# సద్గురు
# శ్రీ నాన్న హృదయం



# సద్గురు శ్రీనాన్నహృదయం

కె.భారతి

శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు

**సద్గురు శ్రీ నాన్న హృదయం**

**కె. భారతి**

ప్రథమ ముద్రణ : జులై, 2018

ప్రచురణ :
కె. భారతి
16-96/బి6, గంగానమ్మకోడు,
ఆదర్శ నగర్ కాలనీ,
ఆకివీడు
పశ్చిమ గోదావరి జిల్లా
ఆంధ్రప్రదేశ్ - 534 235
ఫోన్ : 9000344885

ప్రతులకు :
కె. భారతి
16-96/బి6, గంగానమ్మకోడు,
ఆదర్శ నగర్ కాలనీ,
ఆకివీడు
పశ్చిమ గోదావరి జిల్లా
ఆంధ్రప్రదేశ్ - 534 235
ఫోన్ : 9000344885

ముద్రణ :
యారో పేపర్ ప్రొడక్ట్స్
11-6-720, రెడ్ హిల్స్
లక్డీకాపూల్, హైదరాబాద్ - 500004
ఫోన్ : 9849031042



గురుర్బ్రహ్మా గురుర్విష్ణు
గురుదేవో మహేశ్వరః
గురుసాక్షాత్ పరబ్రహ్మా
తస్మై శ్రీ గురవేన్నమః

# తొలి పలుకు

సద్గురు శ్రీ నాన్నగారితో నాకు 30 సంవత్సరాల అనుబంధం ఉంది. మా తల్లిదండ్రులు భగవాన్ శ్రీరమణుల్ని అరుణాచలంలో ప్రత్యక్షంగా దర్శించుకున్న అదృష్టవంతులు. పోడూరు మా పుట్టినింట నా చిన్నతనంలో భక్తి కార్యక్రమాలు నిత్యమూ జరుగుతూ ఉండేవి. ఆ రోజులలో ఎందరో పుణ్యాత్ములు మా ఇంట పాదం పెట్టారు. అవి ఆధ్యాత్మికమార్గం పట్ల నాకు ఆసక్తిని కలిగించాయి.

నా పూర్వజన్మ పుణ్య ఫలమో, మా తల్లిదండ్రుల సేవా కార్యక్రమాల ఫలమో జిన్నూరు శ్రీ నాన్నగారి పాదాల చెంతకు ఈ దేహాన్ని చేర్చినాయి. అవకాశం చిక్కినప్పుడల్లా నాన్నగారి ఇంటివాకిట వాలిపోవడం, పరిసర గ్రామాలలో ఎక్కడ నాన్నగారు ప్రవచనం చెప్పినా వెళ్ళి ఆ పలుకులు వినాలనే జిజ్ఞాస కలిగింది. నాన్నగారితో అనుబంధం ఏర్పడిననాటి నుండి ఆయన సన్నిధిలో అనుభవించిన హృదయశాంతి మాటలకందనిది.

సద్గురు శ్రీనాన్నగారు 20 సంవత్సరాల క్రితం గురువు వైభవం గురించి శృంగవృక్షం శివాలయ ప్రాంగణంలో చెప్పిన ప్రవచనం నన్నెంతగానో ప్రభావితం చేసింది. వేటగాడు జంతువు తన చేతికి చిక్కేవరకు వదలకుండా ఎలా తరుముకుంటూ వెళతాడో అలా సద్గురువు తన సన్నిధికి చేరిన భక్తులను తరించే వరకు జన్మజన్మలకూ వెంటాడుతూనే ఉంటాడని నాన్నగారు చెప్పిన మాటలు ఈనాటికీ నా హృదయంలో మెదులుతూనే ఉన్నాయి. ఆనాడే గురువు యొక్క వైభవం తెలిసి వచ్చింది. నాటి నుండి ఒక దశాబ్దంన్నరపాటు నాన్నగారు గురువు గురించి ఏమాట చెప్పినా వ్రాసుకోవడం అలవాటుగా మారింది. ఆ మాటలు పుస్తకం రూపంలోకి

తేవాలనే నా సంకల్పాన్ని శ్రీనాన్నగారికి తెలియపరిచాను. నీ సంకల్పం భగవంతుడి అనుగ్రహంతో నెరవేరుతుంది అన్నారు శ్రీనాన్నగారు. సద్గురువు అనుగ్రహం, ఆశీస్సులతో ఆయన హృదయం నుండి వెలువడిన మాటలు "సద్గురు శ్రీనాన్న హృదయం" అనే పుస్తక రూపం దాల్చడం సంతోషదాయకం.

ఈ పుస్తకం భక్తుల జ్ఞానతృష్ణను తీర్చగలదని, ఆధ్యాత్మిక సాధనా మార్గంలో ఉపకరించగలదని, గురువుపట్ల పరిపూర్ణ శరణాగతి ఏర్పడటానికి సహాయకారి కాగలదని ఆశిస్తున్నాను.

"శ్రీ నాన్నగారి పాదపద్మములకు సమర్పిస్తూ ..."

మీ

కె.భారతి



ఓం శ్రీ గురుభ్యోనమః

సద్గురువుతో అనుబంధం జన్మాంతారాల బంధం

సద్గురువు నాన్నగారి ముఖారవిందము నుండి జాలువారిన పలుకులనే ముత్యాలను కొంగుపట్టి వాటినుండి కొల్లేరు తీరాన తన ఇంట (గురువైభవం)అనే రత్నాలను జల్లెడ పట్టిన శ్రీమతి భారతిగారు ధన్యజీవులు. గురువైభవాన్ని వర్షించిన శ్రీ నాన్నగార్కి వడ్డించిన భారతిగార్కి నా హృదయాభివందనాలు.

ఆకలిగా వున్న రమణ శిష్యులకు సాత్విక ఆహారాన్ని అందించాలనే తపనతో (గురువైభవం) అనే పరమానాన్ని వండి వార్చిన భాగ్యశీలి భారతిగారు.

గురువైభవాన్ని గురువు ముఖతః గ్రహించగలం. గురువు మాట అనుగ్రహం, మౌనం అనుగ్రహం, చూపు అనుగ్రహం, వారి సన్నిధియే పరమానుగ్రహప్రసాదం. గురువుతో మనందరి మానసిక అనుబంధం జన్మాంతరాల బంధం. నాడు గురుసన్నిధిలో శ్రవణం చేసిన మాటలు నేను మననం చేసుకోవడానికి ఈ గ్రంథం శిష్యబృందానికి ఒక ఆలంబన.

గురువు పట్ల సజీవమైన విశ్వాసంతో పరిపూర్ణశరణాగతి పొందితే ఆయన స్వరూపమే మనకు అందిస్తారు. ఆయన సమక్షంలో అహంభావన దేహభావన నశిస్తుంది. ఆయన అనుగ్రహమనే వరదలో జీవలక్షణాలు గడ్డిపరకలా కొట్టుకుపోతాయి. స్వరూప జ్ఞానం అనుభవంలోకి వస్తుంది.

గురువు పాదాలు విడిచిపెడితే మాయలోపడతారు.

ఈ లోకంలోకి మనం వచ్చినపని మరచిపోకుండా ఉండటానికే సజ్జన సాంగత్యము, శ్రవణ, మననాదులు ఉపయోగపడతాయి.

ఒక్కచూపైనా చాలు ఆయన సన్నిధిలో అన్న ఆకాంక్షతో అనుదినం ఆయన చెంతకు వేగిరపడి ఆరుదెంచిన భక్తి తత్పరురాలు భారతి.

గురువు వైభవంగుర్తు ఎరిగిన సహనశీలి, సత్యాంగత్యంతో కాలాన్ని సద్వినియోగం చేసుకుంటున్న సాత్వికురాలు ఆమె.

ఆత్మబంధువులు అందరిపై సద్గురు జ్ఞాన నేత్రాలనుండి వెలువడేశాంతి కిరణాలు ప్రసరిస్తూనే వుంటాయి. సద్గురు హృదయ మేఘాలనుండి నిరంతరం వర్షించే అనుగ్రహమనే చిరుజల్లులతో మన హృదయకుహరాలు చల్లబడతాయి.

గురువు పట్ల పరిపూర్ణత విశ్వాసం, ఇష్టం, ప్రేమ వుండాలి. ఆయన జ్ఞాన ప్రదాత. ఆయన సన్నిధి అనేక జన్మల పుణ్యఫలం. హృదయవాసి అయిన ఆయన ఆశీస్సులు సదామనకు అందుతూనేవుంటాయి.

– దంతులూరి పెద్దిరాజు.

ఓం గురుపర బ్రహ్మణేనమః

1 గురువు అన్నా, ఆత్మ అన్నా, ఈశ్వరుడు అన్నా ఒక్కటే. గురువు అంటే ఆత్మే, గురువు అంటే చైతన్యమే గురువు అంటే భగవంతుడే. గురువుకి, ఆత్మకి, భగవంతుడికి బేధమేలేదు.

2 గురువు అంటే తాను ఆత్మ సాక్షాత్కారంపొంది తన శక్తితో ఇతరులను కూడా ఆత్మసాక్షాత్కారం వైపుకి వెళ్ళేందుకు సహాయపడే వ్యక్తే గురువు.

3 మనం భగవంతుడిని పూజించగా, ఆరాధించగా, జపించగా, ధ్యానించగా, ప్రార్థించగా ఆ ఈశ్వరుడికి మనమీద ప్రేమకలిగి, మనకి దేహబుద్ధి వుంది కనుక ఆయన కూడా ఒకదేహం ధరించి, ఒక గురు రూపంలో వస్తాడు.

4 ఆత్మ అంటే ఎవరో అనుకోకు, ఈశ్వరుడు అంటే ఎవరో అనుకోకు, నీ హృదయంలో వున్న సత్య వస్తువే నిన్ను అనుగ్రహించడానికి బయటకి గురురూపంలో వస్తాడు. గురుదర్శనం వల్ల మనకి పాపప్రక్షాళన కలుగుతుంది.

5 మనకు గురువు దొరికినపుడు ఆ గురువుని విడిచిపెట్టకూడదు. గురువు అందుబాటులో వున్నపుడు గురువుని మనం ఉపయోగించుకోవాలి.

6 శ్రీ భగవాన్‌రమణ మహర్షి గురువు గురించి ఈ విధంగా చెప్పారు. ఒక్కసారి పులినోట పడ్డ మాంసపు ముక్క ఏవిధంగా బయటకురాదో, అదేవిధంగా గురువు అనుగ్రహంలో పడ్డవాడు రక్షింపబడతాడు గాని, ఎన్నటికి అతనిచే విడువబడడు.

7 గురువు అనుగ్రహంతో సమానమైనది ఈ సృష్టిలో ఏమి లేనేలేదు.

8 ఒక్కసారి గురువానుగ్రహంలో పడ్డవాడు ఎన్ని జన్మలు ఎత్తినా వాడిని తరింపచేసే వరకు గురువు విడిచిపెట్టడు. గురువు ఏ స్థాయిలో వున్నాడో, ఆస్థాయి వాడు పొందేవరకు గురువు విడిచిపెట్టడు. అదే పులినోట పడ్డ మాంసపు ముక్క.

9 ఆ బ్రహ్మము రూపం ధరించి వస్తుంది మనకి బోధించటం కోసం. ఆయనే గురువు. గురువు అంటే రూపం ధరించిన బ్రహ్మం. మనల్ని అనుగ్రహించడాన్కి రూపం ధరించిన బ్రహ్మమే గురువు.

10 మనల్ని ఈ సంసార సముద్రంలోంచి ఆత్మ అనే ఒడ్డుకి తీసుకురావడం కోసమే రమణ మహర్షిలాంటి గురువులు, మహాజ్ఞానులు ఉపాధి కల్పించుకుని ఈ భూమి మీదకు వస్తారు. వారు కారణజన్ములు.

11 ఈశ్వరుడే కొంతమంది మహాగురువులను ఆయనతో సమానమైన వాళ్ళను ఈలోకంలోకి పంపిస్తాడు. వాళ్ళు చెప్పినమాట త్రికాలాలలో సత్యం మీదే ఆధారపడి వుంటుంది. అందుచేత వాళ్ళు చెప్పినమాట భగవంతునితో సమానం.

గురువానుగ్రహం వుంటే ఈశ్వరానుగ్రహం వున్నట్లే ఈశ్వరానుగ్రహం వుంటే గురువానుగ్రహం వున్నట్లే. ఇద్దరు వేరు కాదు.

12 ఒక్క గురువు యొక్క చూపు నీమీద పడితేచాలు నీవు పరిశుద్ధుడవు అయ్యిపోతావు. నదుల్లో స్నానాలకంటే, విగ్రహాలను పూజించటం కంటే, తీర్థయాత్రలు చెయ్యటం కంటే ఒక్క గురువు యొక్క చూపు బలీయమైనది.

13 ఏనుగు ఒక్క సింహానికే లొంగుతుంది. అదేవిధంగా మన అహంకారం ఏనుగులాంటిది. గురువు యొక్క చూపు సింహం లాంటిది.

గురువు యొక్క చూపు అనే సింహానికి ఈ అహంకారమనే ఏనుగు గజ, గజలాడి, గిజ, గిజ తన్నుకుని చస్తుంది.

14 ఒక్కసారి గురువానుగ్రహంలో పడిన వాడిని తరింపచెయ్యడాన్కి వేలాది జన్మలు నిన్ను వెంటాడుతు వుంటాడు. వాడు గురువు. వాడు బాగుపడే వరకు వాడిని విడిచి పెట్టడు వాడే మహా గురువు.

15 గురువు అంటే ఎవరు? నీ హృదయంలో వున్న సత్యవస్తువే కాళ్ళు, చేతులు తొడుక్కుని వస్తుంది. నిన్ను అనుగ్రహించడం కోసం, ఆ గురువుతో మానసిక అనుబంధం పెట్టుకోవడం వల్ల నీవు తరిస్తావు. గురువుతో మానసిక అనుబంధం పెట్టుకుంటే నీ అజ్ఞానానికి నిప్పు పెడతాడు. గురువానుగ్రహంలో పడ్డాక నీవు తరించే వరకు విడిచిపెట్టడు వాడే మహాగురువు.

16 గురువు యొక్క సమక్షంలో, గురువు యొక్క సహచర్యంలో, గురువు యొక్క సహకారంతో నీ హృదయంలో వున్న నిర్మలమైన వస్తువు నీకుగోచరిస్తుంది. గురువు నీకు జ్ఞాన నేత్రాన్ని ప్రసాదిస్తాడు. గురువు ఏదైతే యదార్థమో దాని వైపు నీకళ్ళు త్రిప్పుతాడు.

17 గురువుకి సేవ చేయడం వల్ల నీకు ఆత్మనిష్ట కలుగుతుంది. ఆత్మ శాంతి కలుగుతుంది. ఆత్మ జ్ఞానం కలుగుతుంది.

18 నీమార్గము గురువే. నీ గమ్యము గురువే. నీ జపము గురువే. నీ ధ్యానం గురువే, నీవు పొందవలసింది కూడా గురువే.

19 గురువుతో నీకు ఆధ్యాత్మిక అనుబంధం వుండాలి. గురువుతో నీకు వున్న అనుబంధమే నీకు వున్న బంధాన్ని తెంపుతుంది. గురువుతో నీకు వున్న మానసిక బంధం వల్ల నీకు వున్న బంధంరాలిపోతుంది.

20 మనందరికి పెద్ద చుట్టం గురువే. గురువు అనే పెద్ద చుట్టంతో నీవు మానసిక అనుబంధం పెట్టుకుంటే, ఆ గురువుతో నీకు వున్న అనుబంధమే నీమనస్సుని నీ హృదయంలోనికి నెట్టివేస్తుంది. అది ఆధ్యాత్మికంగా వచ్చే లాభం.

21 గురువు నిన్ను సంసార సముద్రాన్ని దాటించడానికి ఒక నౌకలాగ ఉపయోగపడతాడు. ఆ నౌక నిన్ను శాంతి కుటీరానికి చేరుస్తుంది.

22 ఒక మహాగురువుతో నీకు సంబంధం లేదనుకో, ఎన్ని ఉపన్యాసాలు విన్నా, ఎన్ని పుస్తకాలు చదివినా, ఎన్ని యాత్రలు తిరిగినా, ఎన్ని నదుల్లో మునిగినా, ఒక్క మహాగురువుతో అనుబంధం లేకపోతే నీకు ముక్తి లభించదు. శాంతి లభించదు.

23 గురువు హృదయంలో కల్పవృక్షం వుంది. కామధేనువు వుంది. చింతామణులు వున్నాయి. అన్ని పుణ్య తీర్థాలు వున్నాయి. అవి కోరినవే ఇస్తాయి. కాని గురువు మనం కోరినవి, కోరలేని వరాలను కూడా అనుగ్రహిస్తాడు.

24 గురువు యొక్క అనుగ్రహం నిన్ను పవిత్రుడుని చెయ్యడమే కాదు, శాంతిలో నీవు కూరుకుపోయేలాగ ఆ గురువు యొక్క అనుగ్రహం నీమీద ప్రవహిస్తుంది.

25 గురువు నీహృదయంలో ఆత్మగావున్నాడు. ఆత్మను పట్టుకోవడానికి నీకు ఏబలహీనతలు అడ్డువస్తున్నాయో, గురువుకి తెలుస్తుంది. ఆ బలహీనతలు, ఎపుడు, ఎక్కడ, ఎలా తొలగించాలో ఆ గురువు చూచుకుంటు వుంటాడు.

26 గురువు చూపు అనుగ్రహం, గురువు మాట అనుగ్రహం, గురువు చేత అనుగ్రహం, గురువు నీతో మాట్లాడిన అనుగ్రహమే. గురువు నీతో మాట్లాడక పోయిన అనుగ్రహమే. గురువు మౌనంగా వున్న అనుగ్రహమే. గురువు యొక్క ప్రతిచేష్ట అనుగ్రహమే. గురువు ఏపనిచేసిన నిన్ను పవిత్రుడిని చెయ్యడానికే. వాడే నిజమైన గురువు.

27 గురువు సహవాసం వల్ల మీకు తెలియకుండానే సాధన జరిగిపోతుంది. గురువుతో సాంగత్యం సాధనలో కెల్లా గొప్ప సాధన.

28 నీ స్వరూప సాక్షాత్కారానికి నిన్ను మోసుకుపోతాడు గురువు. నీహృదయంలో వున్న దేవుని దగ్గరికి, నీ హృదయం యొక్క లోతుల్లోకి నిన్ను మోసుకుపోతాడు. వాడు గురువు.

29 గురువు అంటే ఎవరో అనుకోకు. ఆత్మ అంటే ఎవరో అనుకోకు. దేవుడు అంటే ఎవరో అనుకోకు, నీ హృదయంలో వున్న సద్వస్తువే నిన్ను అనుగ్రహించడానికి బయట గురువుగా వ్యక్తమవుతాడు.

30 గురువు పట్ల నీకు భక్తి వుంటే నీవు పక్వాన్కి వస్తావు. బాగా ముగ్గిపోతావు.

31 భగవంతుడు గురురూపంలో వచ్చి నిన్ను ఆకర్షించుకుంటాడు. ఆయన మీద ప్రేమ కలిగేటట్లు ఆయన చేసుకుంటాడు.

32 గురువు యొక్క అనుగ్రహం నీకు ఉంటే, నీకు ఎన్ని కష్టాలు వున్నా, శాంతి అనే గమ్యానికి తీసుకుపోతాడు. గురువు ఏ స్థానం అయితే పొందాడో ఆ స్థానం మనచేత పొందింపచేసే వరకు మనల్ని విడిచిపెట్టడు. గురువుని మనస్సులో ధ్యానించడం వల్ల మనం పవిత్రులం అయ్యిపోతాం.

33 గురువు అంటే చైతన్యం. జీవుడికి గురువు అత్యంత అవసరం.

34 జీవుడు అనేక అలవాట్లతో బహిర్ముఖంగా వుంటాడు. గురువు చూపు మనస్సుమీద పడటం వల్ల మనస్సుకి శక్తి వచ్చి బహిర్ముఖంగా మనకి ఉన్న అలవాట్లలో నుండి బయటకు తీసుకొస్తారు గురువు.

35 గురువు మనికి అనేక జన్మల పుణ్యఫలం ఉంటే కాని దొరకడు. మనకి గురువుతో అనుబంధం కలిగిన తరువాత గురువు మనకి తెలివి తేటల్ని ప్రసాదిస్తారు.

36 గురువు చెప్పిన బోధను శ్రవణం చేసి అర్థం చేసుకున్న తరువాత, ఆత్మవిశ్వాసంతో, సొంత బుద్ధితో జీవించే శక్తి వస్తుంది. మనకాళ్ళ మీద మనం నిలబడే శక్తిని గురువు అనుగ్రహిస్తాడు.

37 మనకు ఏమంచి గుణం వచ్చినా మంచి లక్షణం వచ్చిన గురువు నుండి వచ్చినవే.

38 మన జీవితంలోకి గురువు రాకముందు ఉన్న ప్రకృతి ధర్మాలు మనస్సుకు శాంతిలేకుండా చేస్తాయి. గురువు వచ్చి మనకి బోధ చేసిన తరువాత ప్రకృతిలో ధర్మాలు, కష్టాలు, సుఖాలు, సంతోషాలు అన్ని అబద్ధమని చెప్పి బ్రహ్మ భావనతో కూడిన ధర్మాని ఆచరింపచేస్తారు. మనల్ని ప్రేమించేవాడు గురువు మాత్రమే.

39 గురువుతో సహవాసం దొరకటం ఎన్నో జన్మల పుణ్యఫలం. గురువును చైతన్యంగానే భావించాలి.

40 గురువు ఎన్నో జన్మల నుండి మాయతో వచ్చిన జీవుడ్ని పవిత్రుడ్ని చేసి, శాంతి తెలియని జీవునికి శాంతినిచ్చి శక్తి లేని జీవుడికి శక్తినిచ్చి ఆనందంగా జీవించేలాగ అనుగ్రహిస్తారు. గురువు నామరూపాలకు అతీతంగా వుంటారు. మనకి సంబంధించిన వాళ్ళనే నిజం చేసుకుని

ధర్మం తప్పి జీవించిన జీవుడికి గురువు చైతన్య భావనను పట్టి ఇచ్చి అందరిలోనూ చైతన్యాన్ని చూసే బుద్ధిని ఇస్తారు. ఆ చైతన్య భావన ఎన్ని జన్మల ప్రారబ్ధ కర్మలు ఉన్నా క్షణంలో పోయేలా చేస్తుంది.

41 గురువుతో సహవాసం దొరికిన మనం ధన్యులం. మనకి సంసారంలో ఎటువంటి కష్టాలు, నష్టాలు వచ్చినా, ఎడ్జస్ట్‌మెంట్స్ చేసుకుని జీవించే బుద్ధిని గురువు ప్రసాదిస్తాడు. కర్తృత్వ బుద్ధిని దూరమయ్యేలాగ గురువు సాధన చేయిస్తారు.

42 గురువు మనపట్ల అపారమైన ప్రేమను దయను చూపిస్తారు. సంసారంలో వ్యక్తులు ద్వేషిస్తు వుంటారు. సత్యంతో తాద్యాప్యం పొందుతూ ఉంటారు కాబట్టి గురువు మనల్ని ప్రేమిస్తు వుంటారు. ఆ తాదాప్యత వ్యక్తికి లేదు కాబట్టి ప్రేమించలేదు. నీవు బ్రహ్మంతో సహవాసం చేసి బ్రహ్మ దృష్టిని అలవరచుకుంటే ఈ జన్మనే మరోజన్మ క్రింద మార్చెస్తారు గురువు.

43 గురువే మన సంపద అనుకోవాలి. మన భర్త, పిల్లల్ని కూడా గురువే అనుకోవాలి. పుట్టుక, మరణం కూడా గురువే అనుకోవాలి. మనస్సు ఎపుడు గురు భావనలో వుండాలి.

44 ఈ సృష్టి కంటే, మన సంసారం కంటే గురువే ఎక్కువ అనే శరణాగతిలో ఫిట్ అవ్వాలి.

45 మనకి ఏ లోటు అయితే వుంటుందో గురువు ఆలోటును బర్తీ చేస్తారు.

46 అజ్ఞానాన్ని, భ్రాంతుల్ని, భ్రమల్ని, చావుని, పుట్టుకని మనస్సు నిజమని బంధించింది. ఆనిజాన్ని అబద్దం అని గురువు బోధ రూపంలో అందిస్తారు. ఆ బోధను ఇష్టపడ్డాక మనస్సు శాంతిపడుతుంది. ఆ

జ్ఞానంలో కలవ డానికి మనస్సు భయపడుతుంది. ఇదంతా గురువు యొక్క దయ.

47 జీవుడికి సహృదయం, సద్బుద్ధి వుంటే బంధ జీవితాన్ని గురువు దూరం చేస్తారు. జీవుడు గురువానుగ్రహం పొందిన తరువాత ఎంతో తేలిక జీవితం జీవిస్తుంది. బహిర్ముఖంతో వున్న జీవుడ్ని గురువు తన అనుగ్రహంతో సూక్షంచేసి అంతర్ముఖపరుస్తారు.

48 గురువు పట్ల అభిమానం, గౌరవం ఎలా పెరుగుతుందంటే గురువు నుండి మనం ఏమి అందుకున్నామో అర్ధం అయినపుడు, గురువు మనకి ఎటువంటి సహాయ సహకారములు అందిస్తున్నారో అర్ధం అయినపుడు గురువు పట్ల గౌరవం పెరుగుతుంది.

49 బాహ్యసంఘటనల యెక్క వేగాన్ని నీ మనస్సు తట్టుకోలేక పోతుంటే గురువును ప్రార్ధించటం వలన సహాయ, సహకారములు అందుతాయి.

50 గురువు మనకి జ్ఞానం యివ్వాలి అనుకుంటే ముందు మనలో వున్న విషాన్ని కక్కించి తరువాతే జ్ఞానం ఇస్తారు. జ్ఞాని యొక్క శక్తి శరీరం వున్నా లేకపోయిన పనిచేస్తుంది.

51 నీవు తిన్న అన్నం అరిగితే మరల ఆకలి పుట్టినట్టు గురువు చెప్పిన మాటలు అర్ధం అయితే ఆత్మ జ్ఞానం సంపాదించాలనే బుద్ధి పుడుతుంది.

శ్రీగురుదేవాయనమః

గురుబ్రహ్మ గురువిష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీగురువే నమః ॥

గురువే బ్రహ్మము, గురువే విష్ణువు, గురువే శివుడు, అంటే దాని అర్థం బ్రహ్మచేసే పని, విష్ణువు చేసే పని, శివుడు చేసే పని ఒక్క గురువే చేస్తాడు. గురువు అంటే ఆత్మ, చైతన్యం, బ్రహ్మము. ఈ మూడు ముఖాల్లోంచి వచ్చేది ఒక ముఖంలోంచే వచ్చేస్తుంది. సమస్త దేవతలు అందరిపని గురువే చేసివేస్తాడు. నీలోపల ఉన్న చైతన్యమే నిజమైన గురువు. గురువంటే అనుగ్రహం. గురువు అన్నా, ఈశ్వరుడన్నా, ఆత్మఅన్నా ఒక్కటే. ఉన్నది ఒక్కటే వస్తువు. అదే గురువు ఆస్వద్వస్తువు నీ హృదయంలోనే ఉంది. నీ హృదయంలో ఉన్న సత్యవస్తువే కాళ్ళు, చేతులు తొడుక్కుని గురువుగా వస్తుంది. గురువు వేరు ఆత్మ వేరు కాదు, గురువు దేహంలో ఉన్న చైతన్యంతో తాదాప్యం పొంది ఉంటాడు. గురువు మనలని అనుగ్రహించడానికి రూపం ధరించిన గురువే బ్రహ్మం.

ఈశ్వరునిలో ఉన్న దయాభాగమే గురువుగా వచ్చింది. రక్షించే భాగము వచ్చింది కాని శిక్షించే భాగం రాలేదు. నీలోఉన్న భగవంతుడే గురురూపం ధరించి భూమిమీదకి వస్తాడు.

గురువు నీతో పరిచయం పెట్టుకుంటాడు. నీతో స్నేహం చేస్తాడు. ఇవన్నీ ఎందుకంటే నీకు సత్యంగురించి బోధించి, బోధించి దాని విలువ నీకు తెలియపరచి, నీ గుండెకు పట్టేటట్టు చేసి నీ మెదడుకి నూరిపోసి ఆయన బోధిస్తుంటే ఏ వాసన అడ్డువస్తుందో ఆ వాసనను లాగి కాల్చి మంటపెడతాడు. నీతో ఒకడిగా జీవిస్తూ ఆయన బోధించింది మీకు అర్థం

అయ్యేటట్లుగా చేసి అది ఆకర్షించే శక్తిని కూడా ఇచ్చి ఆ వస్తువుయొక్క స్వరూపాన్ని పొందేటట్లుచేస్తాడు వాడు గురువు. ఆ గురువు ఏమిచేస్తాడంటే ఆ గురువు మీద నీకు ప్రేమ లేకపోయినా ప్రేమ కలిగేటట్లు చేసుకుంటాడు. వాడే గురువు. గురువు అంటే ఎవరు అనుకుంటున్నారు. "గ్రేస్ ఆఫ్ ఈశ్వర" కంపేషన్ ఆఫ్ ఈశ్వర ఈశ్వరునిలో ఉన్న ఎసన్స్ గురువు, ఆయన కృప రూపం ధరిస్తుంది. అందుచేత భగవంతుడు మన కళ్ళకి కన్పించడు. అసలు వస్తువుకి రూపం, నామం లేదు, వారు ఉంటారు, కాని మాట్లాడరు, మాట్లాడటంకోసం ఆ ఎసన్సే గురురూపం ధరించి వస్తుంది.

ఆ కరుణామయుడైన ఆ గురువు యొక్క ప్రేమ దృష్టి ఒక్కసారి ఆ జ్ఞాన నేత్రంతోటి నీ వంక చూస్తే చాలు. ఆ చూపు నిన్ను పవిత్రుడ్ని చేస్తుంది. 100జన్మలు ఈ గుళ్ళు, గోపురాలు నిన్ను పవిత్రుడ్ని చేయలేకపోయినా ఆ మహా గురువు ఒక్క చూపు నీ మీద పడితే నీవు పవిత్రుడివి అయ్యిపోతావు. ఆత్మానుభవం పొందిన గురువు శక్తి అట్టిది. ఒక జ్ఞానిని ఆశ్రయించడం వల్ల వెన్నెల వల్ల వచ్చే లాభం, గంగాజలం వల్ల వచ్చే లాభం, కల్పవృక్షం వల్ల వచ్చే లాభం ఆయన సహవాసంలో నీకు లభిస్తాయి. విగ్రహాలను ఆరాధించడం, నదులలో స్నానాలు చేయటం, గుళ్ళచుట్టూ తిరగటం పవిత్రత సంపాదించటం కోసమే. ఈ విగ్రహాలు, నదులు నిన్ను పరిశుద్ధపరచడాన్కి ఎన్నో జన్మలు తీసుకోవచ్చు. కాని గురువు ఒక్క చూపు నీ మీద పడితే నీవు పరిశుద్ధుడివి అయ్యిపోతావు.

ప్ర : "శిష్యునిప్రయత్నం లేకుండానే గురువు యొక్క అనుగ్రహం వల్ల ఆత్మ సాక్షాత్కారం అవుతుందా!

జ : మహాత్ముల సన్నిధానంలో మన వాసనలు అణుగుతాయి. నీ దుఃఖానికి కారణం నీ వాసనే అంటే పూర్వ జన్మలలో చేసిన పనులే వాసనలుగా ఏర్పడ్డాయి. నీ మనస్సును బాహ్యాముఖాన్కి త్రిప్పేదికూడా నీ వాసనే. నీ తెలివివల్ల, నీ ప్రయత్నం వల్ల అణగని వాసన గురువు సన్నిధిలో ఆ వాసన అణుగుతుంది. అంటే వాసనకు ఏనుగుకు ఉన్నంత బలం ఉంటుంది. ఏనుగు సింహానికే లొంగుతుందికాని మిగతా జంతువులకు లొంగదు. ఆ గురువు యొక్క అనుగ్రహం, గురువు యొక్క ప్రేమ సింహంలా పని చేస్తుంది. నీ వాసన అణుగుతుంది, నిశ్చలమైన సమాధిస్థితి వస్తుంది. సమాధిస్థితి కలగటం అంటే దృశ్యం నశిస్తుంది. సత్పురుషుల దగ్గర కూర్చున్నప్పుడు మన బుద్ధికి అంతర్దృష్టి కలుగుతుంది. నీ అహంభావన అణుగుతుంది. లోపల సద్వస్తువు నీ అనుభవంలోనికి వస్తుంది. అందులో కదలకుండా ఉండటానికి అభ్యాసం అవసరం. ఆ అనుభవాన్ని పట్టుకుని వేలాడి దానిని స్థిరంచేసుకోవాలి. మన ఊహకు అందని వస్తువు ఒకటి ఉందని ఆయన సమక్షంలో మనకు తెలుస్తుంది. అది అర్థం అయ్యాక స్థిరం చేసుకోవడాన్కి సాధన చేసుకోవడాన్కి బలం కూడా గురువే యిస్తాడు. నీ హృదయంలో నీకు స్థిర నివాసం దొరికాక, ఆ వస్తువు నీకు లభ్యం అయ్యాక నీకు మోక్షస్థితి కలుగుతుంది. ఆ వస్తువు నీ హృదయంలోనే ఉంది. ఆ వస్తువును ఎఱుకలోకి తీసుకురావడాన్కి గురువు బ్యాటరీ లైట్‌లాగ ఉపయోగపడతాడు. ఆ వస్తువు తెలిసాక ఆదేనీవని తెలుస్తుంది. ఇంతవరకు నా జీవితం చాలా వేస్టు చేశాను అని తెలుస్తుంది. గురువుతో మనకు ఉన్న అనుబంధం మనం శరీరాన్ని విడిచిపెట్టిన తర్వాత కూడా తెగదు. మనం ఏ జన్మలోకి వెళ్ళినప్పటికీ ఆ గురువు మన హృదయంలో ఉన్నాడు కాబట్టి మనల్ని వెంటాడుతూ ఉంటాడు. మన మనస్సుకి అట్టడుగున వున్నటువంటి, మూలంలో ఉన్నటువంటి ఆ వస్తువు మనం తెల్సుకునే వరకు మనల్ని వెంటాడుతూనే ఉంటాడు. ఆయనతో ఉన్న అనుబంధం

ఒక జన్మతో వదిలిపోయేది కాదు. గురువు ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితి మనం పొందేవరకు మనల్ని వెంటాడుతాడు. అదే పులినోట్లో పడ్డ మాంసపు ముక్క, అందు చేత సామాన్య ప్రజలకు గురువులతోటి, ఋషులతోటి సాంగత్యం అవసరం. లోపల వస్తువును పట్టుకుంటే బయట ఉన్న రూపాల గొడవ, నామాల గొడవ అక్కర్లేదు. లోపల వస్తువును డైరెక్టుగా పట్టుకోలేనప్పుడు ఆ వస్తువే కాళ్ళు, చేతులు తొడుక్కుని గురురూపం ధరిస్తుంది. ఆ రూపాన్ని ఆరాధించినా సరిపోతుంది. ఆ గురువుతోటి మానసిక అనుబంధం పెట్టుకోవడం వల్ల రైలుఇంజను పెట్టెలను ఎలా తీసుకువెళ్ళుతుందో నీవు గురువుతో అనుబంధం పెట్టుకోవడం వల్ల నువ్వు తరిస్తావు. గురువంటే రూపం ధరించిన బ్రహం. ఏది వచ్చినా నీవు గురువుతో సాంగత్యం విడిచిపెట్టకు. గురువుతో మానసిక అనుబంధం పెట్టుకుంటే నీ అజ్ఞానానికి నిప్పు పెడతాడు. నెమ్మదిగా దానంతట అదే కృశించి నశించి పోతుంది. ఒక వస్తువును మనం వెలిగించాం అనుకోండి అది వెంటనే కాలిపోదు. అది కాలిపోవడానికి 2గంటలు, 3గంటలు సమయం పడుతుంది. అదే విధంగా గురువనుగ్రహంలో పడ్డాక కొన్ని జన్మలలో మీరు తరిస్తారు. తరిస్తామో, తరించమో అనే అనుమానం మీకు అక్కర్లేదు. నీవు ఒక గురువు గురించో ఒక ఋషిగురించో ఊహించలేవు. నీవు నీ దేహానికో,  రూపానికో పరిమితి అయ్యివున్నావు. ఇవన్నీ నీ మనస్సులో ఉన్నాయి.  నీ మనస్సు చుట్టూ, నీ దేహం చుట్టూ తిరుగుతూవుంటావు. ఈద్వైతస్థితిని దాటి వుంటాడు గురువు. గురువు ఎటువంటివాడో నీకు తెలియదు. నీ తెలివికి, నీ బుద్ధికి, నీ మనస్సుకి అతీతం అయివుంటాడు. వాడి సమక్షంలో, వాడి సహచర్యంలో వాడియొక్క సహకారంతో నీ హృదయంలో ఉన్న నిర్మలమైన వస్తువు నీకు గోచరిస్తుంది. ఆ జ్ఞాననేత్రాన్ని ప్రసాదిస్తాడు. నువ్వు ఎన్ని జన్మలెత్తినా ఈ శరీరం చుట్టూ, ఈ మనస్సు చుట్టూ, ఈ బుద్ధిచుట్టూ తిరుగుతూవుంటావు. కాబట్టి గురువుతో

గడపవల్సివుందయ్యా! వారి సాంగత్యం నీకు అవసరమే. గురువు మానసిక పరిస్థితి దాటి వుంటాడు. శాంతిలో కూరుకుపోయి వుంటాడు. గురువు అంటే అంతర్యామి. ఆయన సమక్షంలో ఉన్నప్పుడు మీ అనుగ్రహం కావాలి అని అడగనక్కర్లేదు. ఆయన తాలూకు శాంతి, సుఖం, అనుగ్రహం మీ పట్ల ప్రసరింప చేస్తుంటాడు. వారి సమక్షంలో కుర్చుంటే వారి వైబ్రేషన్స్ నీ మీద పనిచేస్తుంటాయి. నీ మనస్సు దానంతట అదే అణిగిపోతూ వుంటుంది. జ్ఞానం నీకు అందుతూనే ఉంటుంది. నువ్వు గురువుకి సేవ చేయవచ్చు. ఆ గురువుకి నువ్వు చేసే సేవ నీకే లాభం. దాని వల్ల నీకు ఆత్మనిష్ఠ కలుగుతుంది. గురువు ఏదైతే యదార్థమో దానివైపు మీ కళ్ళు త్రిప్పుతాడు. ఆ వస్తువును నువ్వు గ్రహించే శక్తిని ప్రసాదిస్తాడు.

మార్గం గురువే గమ్యం గురువే జపం గురువే ధ్యానం గురువే నీవు పొందవల్సింది కూడా గురువునే. గురువుతో మీరు ఆధ్యాత్మిక అనుబంధం పెట్టుకోవాలి. గురువును అంతరంగంలో గ్రహిస్తే శిష్యుడు ఎక్కడికి వెళ్ళినా పర్వాలేదు. అవగాహన లేనప్పుడు బాహ్యమైన గురువుతో సహవాసం అవసరమే. గురువుతో మానసిక అనుబంధం మంచిది. దేహం ప్రధానం కాదు. దేహం జడం. ఈ దేహం నేను అని మనస్సు చెబుతుంది. ఈ దేహం నేనని ఏ మనస్సు చెబుతుందో ఆ మనస్సుకి గురువుతో అనుబంధం వుండాలి. గురువుతో నీకు ఉన్న బంధమే నీబంధాన్ని తెంపుతుంది. నీ మనస్సును హృదయంలోకి నెట్టివేస్తుంది. నీ మనస్సు హృదయంలోకి ఎప్పుడైతే నెట్టివేయబడిందో ఎప్పుడైతే కరిగిపోయిందో మనస్సు తన రూపాన్ని ఎప్పుడైతే పోగొట్టుకుందో ఆమనస్సే హృదయాకారం చెందుతుంది. అప్పుడు హృదయంలో ఉన్న వస్తువే తానుగా ప్రత్యక్షంగా నీకు అనుభవంలోకి వస్తుంది. నీ హృదయంలో సుఖం నీకు తానుగా వ్యక్తమవుతుంది. చావులేని స్థితికి ఎదిగి వెళ్ళిపోతావు. సత్యవస్తువును నువ్వు

గ్రహించలేకపోతే అది గ్రహించిన వారితో కలిసివుండటం అనేది తప్పనిసరి. ఎందుచేతనంటే సంసారము అనే సముద్రాన్ని దాటించడానికి సత్సంగం అనే నౌక మూడు లోకాలలోనూ లేదయ్యా అన్నారు ఆచార్యులవారు. ఈ మాయలోంచి బయటకు రావడానికి ఈ అహంభావనలోంచి బయటకు రావడానికి ఈ పుట్టడం, చావడం అనే సంసార చక్రంలోంచి ఈ సముద్రంలోంచి బయటకు రావడానికి సత్సంగం అనే నౌక సంసార సముద్రాన్ని దాటిస్తుంది. గురువులతో సాంగత్యం చేయటం అనే నౌకవుంది చూశావు. మిగతా నౌకలకంటే ఉత్తమమైనది, ఉదాత్తమైనది, ఉత్కృష్టమైనది, అద్భుతమైనది, అపూర్వమైనది దానికి మించిన నౌక ఇంకొకటి లేదు. ఈ సంసార సముద్రాన్ని దాటించడానికి అన్నింటికంటే క్షేమమైనది, సురక్షితమైనది. ప్రమాదంలో నిన్ను పడకుండా సురక్షితంగా నిన్ను తీసుకువెళ్ళేది, నిన్ను శాంతి కుటీరంకి తీసుకువెళ్ళి చేరుస్తుంది. మనం సంసారమనే సముద్రంలోంచి జ్ఞానమనే ఒడ్డుకి, మోక్షమనే ఒడ్డుకి క్షేమంగా తీసుకురావడంకోసం గురువు అవసరం. ఈశ్వరుడే కొంతమంది గురువులను ఆయనతో సమానమైన వారిని ఈ లోకంలోకి పంపిస్తాడు. వారు కారణజన్ములు. వారు చెప్పినమాట త్రికాలాల్లో సత్యంమీద ఆధారపడి ఉంటుంది. అందుచేత వారు చెప్పిన మాట కూడా భగవంతునితో సమానం. నువ్వు ఈ భూమి మీదకి వచ్చినపని జ్ఞానం సంపాదించటం కోసమే, నీ జీవిత ధ్యేయం జ్ఞానమే, నీకు జ్ఞానం రాకుండా ఏ విషయాలైతే నిన్ను బాహ్యముఖానికి తీసుకువస్తాయో ఆ విషయాలలోంచి నిన్ను తప్పించి లోపల హృదయ స్థానంలోకి నిన్ను తీసుకువెళ్ళటం కోసమే కైలాశంలోంచి భూమిమీదకు దిగి వచ్చాడు వాడే గురువు. పునర్జన్మ హేతువులు వాసనలు తొలగించుకోవడానికి సహాయ పడేవాడే గురువు. నీ మనస్సును హృదయాభిముఖంగా ప్రయాణించేలా చేసేవాడు గురువు. గురువు ఏదైతే చెప్పాడో ఆ ఉపదేశాన్ని అనుసరించి నువ్వు నడవడమే. అయితే గురువు

ఈశ్వరుడు వేరు కాదు. గురువు అనుగ్రహం వుంటే ఈశ్వరుని అనుగ్రహం ఉన్నట్లే. బోధ దేనిమీద ఆధారపడి ఉంటుందంటే నీ మనస్సును నీ చేతనలను నీకు ఎన్ని అయితే శక్తులున్నాయో ఆ శక్తులన్నింటిని ఒకచోటకు తీసుకువచ్చి మొత్తం ఆశక్తి అంతా లోపలికి మళ్ళించడమే గురువు చేసే పని. బయటపరిస్థితులు మీ మనస్సును లోపలికి వేళ్ళేలాగా సృష్టిస్తాడు. మీ మనస్సు ఎవరి మీద వాలుతుందో వాళ్ళచేత మొట్టికాయలు మొట్టిస్తాడు. బయటపని లోపలిపని గురువే చేస్తాడు. వాడే చేస్తాడు అన్నసంగతి మన అహంకారం వల్ల మనకు తెలీదు. ఎందుచేతనంటే గురువు చేసే పనివైపు మన కళ్ళు యింకా తెరుచుకోలేదు. గురువు చేసే పనికి కళ్ళు తెరుచుకుంటే కనిపిస్తాయి హితులు మిమ్మల్ని విమర్శించినపుడు హితులు మీకు మానసికంగా దూరం అయినపుడు మీకు ఆలోచన ప్రారంభమౌతుంది. మీ బాహ్య ముఖానికి వేగం తగ్గిపోయి మనస్సుకి లోపల ఆలోచన ఎప్పుడైతే ప్రారంభించిందో ఒక్కసారి రవ్వంత, ముల్లంత మనస్సులోపలికి తొంగి చూస్తుంది. లోపల గురువు వీడు దొరుకుతున్నాడురా! లోపలికి చూడటం మొదలుపెట్టాడు అని లోపల గురువు గుంజటం మొదలుపెడతాడు.

ఆ గుంజటం గుంజటం తన స్వరూపాన్ని మీకు యిచ్చేవరకు విడిచిపెట్టడు. వాడు గురువు. ఒక్కోసారి గుంజుతూ ఉంటాడు విడిచిపెడుతుంటాడు, మళ్ళీ గుంజుతాడు, మళ్ళీ విడిచిపెడతాడు మొత్తం మీద నిన్ను కొంత కాలం ప్రిపేర్‌చేస్తాడు. ప్రిపరేషన్‌కి టైం పడుతుంది. తన స్వరూపాన్ని క్షణాలలో యిచ్చేస్తాడు. ప్రిపేరు అయినపుడు కొంచెం కష్టం అవుతుంది. ఏమిటి ఇంత బాధపెడుతున్నాడు, ఇంత కష్టపెడుతున్నాడు ఈశ్వరుడు మనల్ని అనిపిస్తుంది.

ఆ బ్రహ్మానుభవం మీరు పొందిన వెంటనే ఆ బాధ మీరు మర్చిపోతారు. బయట గురువు బయట నుంచి లోపలికి పొమ్మని తోస్తుంటాడు. లోపల గురువు లోపల్నించి లాగుతుంటాడు. నువ్వు మొత్తంమీద ఆత్మలో స్థిరపడేవరకు నువ్వు ఎవరిగా వున్నావో ఆ స్థితి నువ్వు పొందే వరకు ఆత్మనిష్ఠ నీకు కలిగే వరకు విడిచిపెట్టడు. నిన్ను వెంటాడుతూనే వుంటాడు. గురువనుగ్రహం లేకపోతే గురువు మాట విలువకూడా తెలీదు. మనకు దేవుని కూడా వెళ్ళాలని ఉంది కాని అజ్ఞానాన్ని విడిచిపెట్టాలనిలేదు నన్ను వెంబడించాలంటే నీ అజ్ఞానాన్ని విడిచిపెట్టు అంటున్నాడు వాడు. నీ అజ్ఞానాన్ని విడిచిపెట్టకపోతే నీవు నన్ను వెంబడించలేవు. నీవు ఒక ఆకారానికి తాదాప్యత పొందుతూ జన్మ, జన్మలనుంచే ఉన్నావు ఈవేళ ఆకారం లేని మూలాన్ని అందుకోవటం కష్టంగా ఉంది.

గురువు అది నీకు అర్థం అయ్యేలాగా చెప్పి నీ బుద్ధికి గ్రహింపు శక్తి కలుగజేసి నీ చెయ్యి పట్టుకుని అక్కడికి తీసుకువెళ్ళడానికి వస్తాడు. నీకు ఉన్న రూపదృష్టి,నామదృష్ఠిలోంచి విడదీయటానికే వస్తాడు. గురువు చెప్పిన మార్గాన నువ్వు ప్రయాణం ప్రారంభించు. అనుగ్రహం దానంతట అదే వస్తుంది. గురువు చెప్పిన మార్గాన నీవు ఎప్పుడైతే ఒక అడుగు ముందుకు వేశావో గురువనుగ్రహం దానంతట అదే వస్తుంది.

నీవు ఎప్పుడైతే గురువుని విశ్వసించటం ప్రారంభించావో నీవు ఎప్పుడైతే గురువుని శరణాగతి చేయటం, విశ్వసించటం గురువును నమ్మటానికి ఎప్పుడైతే ప్రారంభిస్తున్నావో అప్పుడు అదునుచూచుకుని పదును పెడతాడు.

ఎప్పుడైతే ఈశ్వరునికి శరణాగతి పొందడానికి ప్రయాణం చేస్తున్నావో ఇదే అదును అనుకుని పరికించి పరిశీలించి అపుడు వాడికి ఉపదేశం ప్రారంభిస్తాడు. ఆ బ్రెయిన్‌కి అర్హత యోగ్యత చూచుకుని ఉపదేశం

ప్రారంభిస్తాడు. నీ సంసారంలో ఉన్న అల్పత్వాన్ని స్వల్పత్వాన్ని గురువు నీకు ఎత్తిచూపించి అపుడు నిన్ను హృదయాభిముఖంగా ప్రయాణం చేయిస్తాడు. ఈశ్వరుడు ఎలా ఆడిస్తే అలాగే మనం ఆడగలం. ఎక్కడ కూర్చోమంటే అక్కడ కూర్చోవాలి. ఎక్కడ నుంచోమంటే అక్కడ నుంచోవాలి. మనం ఊరికే బొమ్మలం మాత్రమే, అని ఈశ్వరసంకల్పంకు ఎదురుతిరగకుండా రియాక్టు అవ్వకుండా ఈశ్వర సంకల్పాన్ని గౌరవించటం నేర్చుకోవాలి.

నీలో రకరకాల సంస్కారాలున్నాయి, రకరకములైన కోరికలున్నాయి. రకరకాల తలంపులున్నాయి. ఇవన్నీ ఒక్కో సంస్కారాన్ని వ్యక్తం చేస్తుంటాయి. ఒకటి తర్వాత ఒకటి తొలగించుకోవల్సిన ప్రయత్నం నీ మీద వుంది. నీవు ప్రయత్నం మొదలు పెడితే సరిపోతుంది. గురువనుగ్రహం దానంతట అదే సహాయం వస్తుంది. నీకు నీవు సహాయం చేసుకుంటు వుండటం మొదలుపెట్టు.

భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. మన హృదయంలో సత్యం ఉంది అనే విశ్వాసం నీ హృదయాంతరాల్లోంచి పొంగి, పొంగి ఆ విశ్వాసం వచ్చి నీ శిరస్సును ముంచుతున్నప్పుడు ఆ విశ్వాసంలోంచి ఒక శక్తి నీకు కలుగుతుంది. ఆ శక్తి నీ సంస్కారాలతో పోరాడి, సంస్కారాలను బయటకు లాగి మంటపెడుతుంది. జ్ఞానివి అవుతావు, గురువౌతావు, గురువుపట్ల గురువు మాటల పట్ల అచంచలమైన విశ్వాసం నీకు కలిగినపుడు ఆ శక్తి నీకు అభివృద్ధి అవుతుంది. ఆ శక్తి విజృంభించి నీ సంస్కారాలను బయటకు లాగి మంటపెడుతుంది.

ఒక భక్తుడు వచ్చి భగవాన్‌ని నాకు యింకా గురువు దొరకలేదు! అంటే భగవాన్ : ఈ భూమి మీదకి వచ్చిన ప్రతీమనిషి రెండు పనులు చేయాలి.

ఒక పని నీకు పూర్తయ్యింది అన్నారు భగవాన్. అంటే నేనే గురువునని చెప్పకుండా చెప్పటం. నేనే గురువునని ఆయన ఎవరితోనూ చెప్పరు. కాని శిష్యుడికి చేయవల్సిన పని ఆయనే లోపల చేస్తుంటాడు. కాని వాడి ద్వారా ఉపకారం జరుగుతుందని తెలియనివ్వడు. రమణ మహర్షి శిష్యులు అందరూ అదృష్టవంతులే. వారందరూ పులి నోట్లో పడ్డ మాంసపు ముక్కలు. పులినోట మాంసపు ముక్క బయటకు రాదు, లోపలికి వెళ్ళిపోతుంది. అదే విధంగా ఇష్టం వున్నా లేకపోయినా ఒకసారి రమణానుగ్రహంలో పడ్డ వారు ఏ జన్మలో ఎక్కడ ఉన్నా తరించబడతారు. విడిచిపెట్టే సమస్యలేదు.

నీకు బయటగురువు దొరకడం సగం పని పూర్తి అయినది. ఆ లోపల గురువు ఎపుడైతే పట్టుకుంటాడో అపుడు నీ పని పూర్తయిపోయింది. బయట గురువు దొరకటం మొదటి పని. లోపల గురువు పట్టుకోవటం రెండవ పని. ఎందుచేతనంటే లోపల గురువే మోక్షం, లోపల గురువంటే మనిషిలాగ వుండడు. అక్కడ రూపంలేదు, నామంలేదు. అంటే మనకు రూపబుద్ధి వుంది కాబట్టి లోపల ఉన్న చైతన్యమే మనకు కాళ్ళు, చేతులు తొడుక్కుని వచ్చి మనకు కనపడతుంది. ఆలోపల ఉన్న గురువే మనకు ప్రాణానికి ప్రాణమై వున్నాడు. లోపల గురువు చెవులు లేకుండా వింటాడు. కళ్ళు లేకుండా చూస్తాడు. చేతులు లేకుండా పనిచేస్తాడు. కాళ్ళు లేకుండా నడవగలడు. నీ హృదయంలో వున్న వాసన నీ శిరస్సులోకి వస్తే కాని నీకు తెలియదు. లోపల వున్న గురువు, నీ హృదయంలో వుండగానే వాసనలు చూస్తుంటాడు. వాడు చూడకుండా వాడి కళ్ళు నీవు మూయలేవు. లోపల వున్న గురువు లోపల కెలుకుతాడు. పునర్జన్మలు హేతువులు ఏమి వున్నాయో కెలికి మన శిరస్సులోనికి పంపుతాడు.

మన హృదయం ఖాళీ అవ్వకుండా పరమేశ్వరుడు మనల్ని పనిముట్లుగా ఉపయోగించుకోడు. ఎవడి హృదయం ఖాళీ అవుతుందో వారి హృదయంలోనే గురువు వ్యక్తం అవుతాడు. ఆ సహస్రారంలో ఏ బలహీనతలు అయితే ఉన్నాయో అందులోంచి విడుదల పొందటానికి బయట గురువు సహాయం  చేస్తాడు.

ఎవరు ఏ కులంలో ఉన్నా, ఏ మతంలో ఉన్నా, ఏ దేవుడిని ఆరాధించినా పొందాల్సిన గమ్యం అదే. ఆ వస్తువును మనం పొందే వరకు ప్రతీ జన్మలోనూఏదో ఒక అశాంతి, ఏదో ఒక బాధ ఏదో ఒక వెలితి మనల్ని వెంటాడుతుంది, ఆ సద్వస్తువును తెల్సుకోవటం కోసమే మనం గురి పెట్టాలి. వున్న సత్య వస్తువును తప్పించి మిగతావన్నీ వచ్చినా కాల ప్రవాహంలో కొట్టుకుపోతాయి. గురువు ఏమి చేస్తాడంటే ఎపుడైనా మన కోరికలు నెరవేరినప్పటికీ ఆ కోరిక నెరవేర్చటమే ఆయన గమ్యం కాదు. గురువు మీద విశ్వాసం కలుగ చేయటం కోసం మన మనస్సుకు పవిత్రత పట్టించటం కోసం మనస్సులో ఉన్న దోషాలు తొలగించటం కోసం మనకు భక్తి పెంచటం కోసం కొన్ని కోరికలు నెరవేర్చుతూ వుండవచ్చు. కాని గమ్యం అది కాదు. గమ్యం ఏమిటి అంటే మన హృదయంలో ఉన్న భగవంతుడ్ని మనం పొందే వరకు ఈ ప్రయాణం ఆగదు. ఏంలేదు మనస్సు మీద వున్న భ్రాంతి శరీరంతో వున్న భ్రాంతి పల్చబడితే ఈ క్షణంలోనే వ్యక్తమవుతుంది. మన మనస్సును చూచి మనం భ్రాంతి పడుతున్నాం అదొక్కటే నిజమని ఎవరైనా పొగిడితే సంతోషం, విమర్శిస్తే దుఃఖం. మనకు మనస్సు మీద వున్న భ్రాంతే అసలు వస్తువు దొరక్కుండా అడ్డువస్తుంది. ఈ దేహ బుద్ధిని మనస్సులో ఉన్న చాపల్యాన్ని తొలగించటం కోసం బయటగురువు బోధిస్తుంటాడు. లోపల గురువు అనుగ్రహిస్తూ వుంటాడు. మనస్సులో చాపల్యం తగ్గిస్తుంటాడు. మన మనస్సు ముగ్గిన తర్వాత ఆ

మనస్సును తన లోపలికి గుంజుకుని స్వరూపం యిస్తాడు. అదే గురువు చేసే పని. పూజ కంటె, జపం కంటె, విచారణ కంటె గురువు అనుగ్రహం బలీయమైనది. ఎవడి మనస్సు అయితే తనమూలంలో ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడో అక్కడ ఈ మనస్సు అణిగిపోతే అతని నుంచి శాంతి తరంగాలు, శక్తి తరంగాలు, కాంతి తరంగాలు ప్రవహిస్తుంటాయి. ఆ జ్ఞానిలోంచి వచ్చే శక్తి కిరణాలు నిన్ను పవిత్రుడ్ని చేయడానికి,నిన్ను ఉద్ధరించడానికి, నిన్ను జ్ఞానిని చేయడానికి వచ్చి ప్రయత్నం చేస్తాయి. మీరు మనస్సును ఓపెన్ చేసుకుని వుంటే జ్ఞాని దగ్గరనుంచి వచ్చే సహాయం మీకు అందుతుంది. మీ మనస్సును అణచడానికి ఉపయోగపడుతుంది. జ్ఞాని ఏ స్థితిలో ఉన్నాడో ఆస్థితి మీరు పొందడానికి సహకరిస్తుంది. గురువు చెప్పిన విషయం కనుక అర్ధమైతే చేతులు కదపకుండా, కాళ్ళు కదపకుండా, ఉన్న వస్తువు తనంతట తానుగా వ్యక్తమవుతుంది. గురువు యొక్క మౌనం గురువు యొక్క శాంతి నీ మనస్సును నెమ్మదిగా పవిత్రం చేస్తుంటుంది. నీ మనస్సు మంచిగా మారుతుంది. నీ మనస్సుకు వివేకం కలుగుతుంది. ఆ గురువు నీతో మాట్లాడక్కర్లేదు, ఆ గురువు నీతో ఉపన్యాసాలు చెప్పక్కర్లేదు, గురువు మౌనమే నీకు వివేకాన్ని పెంచుతుంది. నిన్ను బుద్ధిమంతునిగా చేస్తుంది.

నువ్వు ఏ శరీరంలో ఉన్నా, ఏ లోకంలో వున్నా గురువు నీతో మాట్లాడినా, మాట్లాడకపోయినా ఆయన మౌనంలో వున్న అనుగ్రహమే నడిచినా, కూర్చున్నా అనుగ్రహమే. నీతో మాట్లాడకుండా ముఖం ప్రక్కకు పెట్టుకున్నా అనుగ్రహమే. ఎలా వున్నా గురువు యొక్క ప్రతీ చేష్ఠ అనుగ్రహమే.

నాకేమీ వద్దు నీ దయ వుంటే సరిపోతుంది అని గురువును ప్రార్థిస్తే ఆయన దయవస్తుంది. దాని వెనకాల కోరికలు కూడా నెరవేరుతాయి.

గురువు యొక్కకృప ఎలా వుంటుంది అని ఒక భక్తుడు భగవాన్‌ని అడిగాడు !

భగవాన్ : అది నీ మాటలకు, నీ ఆలోచనలకు అందదు. అది నీ మాటలకు అందదు, నీ ఊహలకు అందదు, నీ తలంపులకు అందదు. గురువు యొక్క కృప నీ మనస్సుకి, నీ తెలివికి అతీతమైనది. గురువు యొక్క కృప మాటలతో ఎట్లా చెప్పగలం. గురువు యొక్క అనుగ్రహం నీ అజ్ఞానమనే నిద్రలోంచి నిన్నులేపటానికే. గురువు నిన్ను శిక్షించిన అజ్ఞానమనే గాఢనిద్రలోంచి నిన్ను మేల్కొలపటానికే.

ఒక సారి చూపు, ఒకసారి మాట, ఒకసారి కోపం నటించవచ్చు. గురువు యొక్క ఆగ్రహంకూడా అనుగ్రహమే అని ఎవరైతే భావిస్తాడో వాడు నిజమైన భక్తుడు. నీకు నిజమైన జ్ఞానం కావాలంటే ఎడతెగని భక్తిని అభ్యసించాలి మనం. నీవు ఏ వస్తువునైతే పొందాలనుకుంటున్నావో ఆ వస్తువు మీద నీవు నడిచినా, కూర్చున్నా, ఇంట్లో పనిచేసుకుంటున్నా, పూజ గదిలో వున్నా, వంటింట్లో వున్నా ఆ వస్తువుమీద నీకు ప్రేమ కలిగియుండాలి.

సజీవమైన విశ్వాసం కలిగియుండాలి. గురువు నీ భక్తిని నెమ్మదిగా ముగ్గపెడతాడు. మీ భక్తి ముదిరిన తర్వాత దానికి రంగు వచ్చాక ఆ భక్తి బాగా పరిపక్వానికి వచ్చాక అంతటావున్న ఈశ్వరుడే మీ హృదయంలోనే ప్రత్యక్షం అవుతాడు. గురువు మన మనస్సులో చేదు ఉంటే ఆ చేదును తీసేసి తియ్యదనాన్ని మనస్సుకు తీసుకువస్తాడు. మన మనస్సులో పొరలను లాగివేసి మనస్సును శుద్ధిచేసి, మనస్సును నిర్మలంచేసి మనస్సుకు అంతర్ దృష్టిని కలుగజేసి ఆ గురువే మనలోపల చైతన్యంగా, ఆత్మగా మన హృదయంలో దర్శనమిస్తాడు.

ఒక జ్ఞాని ప్రభావం, ఒక మహర్షి ప్రభావం ఒక గురువు ప్రభావం నిశబ్దంగా భక్తుని హృదయంలోకి రహస్యంగా చొరపడుతుంది. జ్ఞాని ఎపుడు గడిబిడి చేయడు. ఎవరికైతే జ్ఞాని సహాయం చేస్తున్నాడో ఆ జ్ఞానిద్వారా సహాయం పొందుతున్నానని వాడికే తెలీదు. అంత నిశ్శబ్దంగా పనిచేస్తాడు. భక్తుని హృదయంలో చొరబడి వాడిని పవిత్రం చేస్తునట్లు వాడికే తెలీదు. సత్పుర్షులతోటి, మహాత్ములతోటి, మహర్షులతోటి సహవాసం మంచిదే. అదికూడా మీకు తెలియకుండానే సాధన జరిగిపోతుంది. మీరు చేసుకునే జపం, పూజ, ధ్యాన్యం విసనికర్రలాంటిదే. సత్పురుషుల సహవాసం సహజ గాలి లాంటిది. మహా ప్రవాహం క్రింద గాలి వస్తుందనుకోండి, ఆ గాలి వచ్చినప్పుడు విసనకర్ర అక్కర్లేదు. సత్పుర్షుల సహవాసం సహజంగా వచ్చేగాలి లాంటిది. సత్పుర్షుల సాంగత్యం ఎటువంటిదంటే సాధనలలో కెల్లా గొప్ప సాధన. గురువు నిన్ను నీ స్వరూప సాక్షాత్కారానికి మోసుకుపోతాడు. నీ హృదయంలో ఎక్కడైతే దేవుడున్నాడో అక్కడికి గురువు నిన్ను మోసుకుపోతాడు. అది నీకు తెలియకుండానే జరిగిపోతుంది. జ్ఞానికి, జ్ఞానికి బేధం చూడక్కర్లేదు. ఈ ప్రకృతి గుణాలు దాటిన తర్వాత ఎవరైనా ఒక్కటే.

ఈ ప్రపంచంలో నిజమైన సుఖి ఎవరంటే ఒక జ్ఞాని మాత్రమే. బ్రహ్మానుభవం పొందినవాడు కూర్చున్న, నుంచున్న, మాట్లాడినా, చూచినా అక్కడ నుండి శాంతి తరంగాలు ప్రవహిస్తునే ఉంటాయి. ఆందుచేత వారి సాంగత్యం మంచిది.

గురువుది ఎంత గొప్ప స్థితో చూడండి. మాటలతో పనిలేకుండా, చూపులతో పనిలేకుండా, స్పర్శతో పనిలేకుండా కేవలం మౌనంతోనే నీకు యిచ్చేది ఏదో యిచ్చివేస్తాడు. ఆ మౌనంగా చెప్పే బోధ నీకు అర్థం కానపుడే

నీకు మాట చెబుతాడు. గురువు మాట కూడా అనుగ్రహమే. గురువు ఒక మాట మాట్లాడితే ప్రపంచం యావత్తు అది పనిచేస్తుంది. గురువుకి భక్తులు, శిష్యులుంటారు. అలాగే గురువు అంటే ఇష్టంలేనివారు కూడా ఉంటారు.

అటువంటివారి గురించి భగవాన్ అనే వారు కళ్ళుండి చూడలేరు, చెవులుండి వినలేరు కొంతమంది. అర్హత లేనపుడు యోగ్యత లేనప్పుడు సర్వేశ్వరుడు వచ్చి మన ప్రక్కన కూర్చున్నా మనం గుర్తించలేం. సముద్రంలో ఎంత నీరు వున్నా మనం చెంబు పట్టుకెళ్ళితే ఆ చెంబు నీళ్ళే తెచ్చుకోగలం. ఒక బిందె పట్టుకెళ్ళితే ఆ బింది నీరే తెచ్చుకోగలం. అలాగే పరమేశ్వరుడు మన దగ్గర కూర్చున్నప్పటికీ మన అర్హతను మించి యోగ్యతను మించి మనం పొందలేం.

గురువు ఒక మాట మాట్లాడితే అది ఊరు దాటుతుంది, బోదులు దాటుతుంది, కాలువలు దాటుతుంది, నదులు దాటుతుంది, దేశాలు దాటుతుంది, సముద్రాలు దాటుతుంది, ప్రపంచమంతా వ్యాపిస్తుంది. అత్యంత శక్తివంతంగా వ్యాపిస్తుంది. ఎంతకాలమైతే నదులు ప్రవహిస్తాయో, ఎంతకాలమైతే కొండలు ఉంటాయో, ఎంతకాలమైతే సూర్యుడు, చంద్రుడు వుంటారో ఆ జ్ఞాని యొక్క మాట అంత సజీవంగా వుంటుంది. ఆ జ్ఞాని యొక్క నాలుక హృదయంలో వుంటుంది. ఆ జ్ఞాని యొక్క మాట హృదయసారం. యేసు అన్నాడు కొండమీద దీపం పెట్టి ఎవ్వరికీ కనపడకూడదు అంటే ఎలా కుదురుతుంది. అదే విధంగా జ్ఞాని మాట ఎవరికి వినపడకూడదు అంటే ఎలా కుదురుతుంది.

ఒక జ్ఞానికి నమస్కారం పెడితే అది ఈశ్వరునికే చెందుతుంది. ఎందుచేత అంటే జ్ఞాని ఈశ్వరుని స్వరూపం పొందియున్నాడు.

జ్ఞానిని ఆరాధించడం వలన, గౌరవించడం వలన వాడు పుణ్యం సంపాదించుకుంటాడు. ఎవడైతే జ్ఞానిని చూస్తున్నాడో ఆస్థాయికి మనం కూడా ఎదగాలన్న కాంక్ష వాడికి కూడా వస్తుంది.

ఒక గురువును దర్శిస్తే మీరు ఒట్టి చేతులతో బయటకు వెళ్ళరు. నాస్థికుడు ఆస్థికుడవుతాడు ఆస్థికుడైతే భక్తుడౌతారు, భక్తుడైతే జ్ఞాని అవుతారు, జ్ఞాని అయితే భగవంతుని స్వరూపం పొందుతాడు. అందుచేత వాళ్ళ దర్శనం ఊరికే పోదు. నీలో ఎన్ని దోషాలు ఉన్నా ఎన్ని పాపాలు ఉన్నా ఎన్ని ద్వేషాలు వున్నా ఎన్ని బలహీనతలు ఉన్నా జ్ఞానిని దర్శించడం వల్ల అవి ఒక్కొక్కటిగా తొలగిపోతాయి.

కొంతమంది ద్వేషస్వభావం ఉన్నప్పటికీ ద్వేషించేవారు అయినప్పటికీ గురువు దర్శనం వల్ల పాపప్రక్షాళన కలుగుతుంది. అంతకు ముందు పూర్వ జీవితంలో ఎన్ని పాపాలు, దోషాలు, బలహీనతలు ఉన్నా నెమ్మదిగా అవి క్షీణించి నశించిపోయి పాపప్రక్షాళన పొందుతారు.

నీ దేహం వయస్సు 70సం॥రాలు, 80సం॥రాలు అయినా నీ వాసనల వయస్సు కొన్ని లక్షల సంవత్సరాలు ఉండవచ్చు. ఎక్కడో హృదయం యొక్క లోతుల్లో దాక్కున్న ఆ వాసనలను బయటకు లాగి, లాగి మంటపెడతాడు. వాటిని బయటకు లాగితేనే కాని మంట పెట్టటం కుదరదు. గురువు ఇదంతా నిశ్శబ్దంగా చేసుకుపోతాడు. వాడికి ఊరేగింపులు అక్కర్లేదు. గురువు దర్శనం వల్ల నీ బలహీనతలన్నీ క్రమేపీ తగ్గిపోతాయి. నీవు కంగారు పడక్కర్లేదు. అవన్నీ గురువు చూసుకుంటాడు. గురువు ఈ లౌకికమైన గొడవలలోకి మిమ్మల్ని రానివ్వడు. రానిస్తే మీ లక్ష్యాన్ని మరిచిపోతారు. జీవితానికి ఒక గమ్యం పెట్టుకోవాలి. నీ లక్ష్యం సాధించడంలో వెనక్కి తిరిగి చూడక్కర్లేదు. గమ్యాన్ని దృష్టిలో పెట్టుకుని

దానిని సాధించాలని నువ్వు ప్రయాణం చెయ్యి. మీ బలహీనతలు మీలో వున్న గురువానుగ్రహం వల్ల రాలిపోతాయి.

మీ హృదయంలో వున్న ఆత్మను తెలుసుకోవటం కోసం ప్రయత్నంచేస్తుంటే అది నిజమైన సాధన, అయితే మీ హృదయంలో వున్న ఆత్మ ఇది చూస్తుంటుంది. అప్పుడు మీకు గైడెన్స్ కావాలి. మీకు గైడెన్స్ కావాలి కాబట్టి గురువు రూపం దాల్చి బయటకు వస్తుంది నిన్ను అనుగ్రహించడానికి. నువ్వు ఏ దేశంలో ఉన్నా ఏ ప్రాంతంలో ఉన్నా ఆయన నిన్ను ఆకర్షించుకుంటాడు. ఆయన మీద ప్రేమ కలిగేటట్లు ఆయనే చూసుకుంటాడు. నిన్ను బుజ్జగిస్తాడు, నిన్ను లాలిస్తాడు, నీకు స్వప్న దర్శనాలు యిస్తాడు, గురువుమీద ఆకర్షణ కలిగేలా చేస్తాడు, గురువు మాటలు విలువ తెలిసేలాగ బుద్ధిని ప్రేరేపిస్తాడు. నీ పాడు బుద్ధిని సంస్కరించి ఆ మాటల యొక్క విలువ నీ బుద్ధికి పట్టేలాగ నిన్ను అనుగ్రహిస్తాడు. బయట గురువు ఎప్పుడూ అక్కడ వుండడు. నీమనస్సును లోపలికి గెంటేసి బయటకుపోతాడు. లోపల గురువు తనలోకి గుంజువేసుకుని తన స్వరూపాన్ని నీకు యిచ్చివేస్తాడు.

మనకి గురువు దొరికినపుడు గురువును విడిచిపెట్టకూడదు. గురువు అందుబాటులో ఉన్నప్పుడు మనకి ఎక్కువ కష్టం అక్కర్లేకుండా సబ్జెక్టును అర్ధంచేసుకోవచ్చు. అందుచేత గురువును ఉపయోగించుకోవాలి. అవకాశాలను విడిచిపెట్టకూడదు.

హృదయంలో ఉన్న వస్తువును తెలసుకోవటం కోసం తేలిక ఉపాయాలలో సత్సంగం ఒకటి, ఆ సత్పురుషుల సంబంధం మాయతో మీ మనస్సుకి ఉన్న సంబంధాన్ని కొద్దికొద్దిగా తగ్గించుకుంటూ వస్తాడు

సత్పురుషుల ప్రభావం వారి సహవాసం చేస్తుంటే వారి వైబ్రేషన్స్ నీ మీద పనిచేస్తుంటాయి. నీకు తెలియకుండానే రాబోయే జన్మలు కారణాలు వుంటే కాలి బూడిద అయ్యిపోతాయి. సత్పురుషుల సహవాసం యొక్క ప్రభావం అటువంటిది. ఒక గురువుతోగాని, ఒక జ్ఞానితోగాని నీకు అనుబంధం లేదనుకో, నువ్వు ఎంతమంది ఉపన్యాసాలు విన్నా ఎన్ని పుస్తకాలు చదివినా ఎన్ని నదులలో మునిగినా ఎన్ని తీర్థయాత్రలు చేసినా నీకు ముక్తి లభించదు. శాంతి లభించదు.

నీవు మంచిపనులు చేయవచ్చు దాని వల్ల పుణ్యం వస్తుంది. శాస్త్రాలు చదవవచ్చు దాని వల్ల పాండిత్యం వస్తుంది. ఇవి అన్ని నీ దేహం ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. అంత మాత్రంచేత నీ మనస్సులోపలికి తిరగదు. ఎక్కడైతే సద్వస్తువు వుందో అక్కడికి నీ మనస్సు తిరగాలంటే ఒక మహాగురువుతో నీకు మానసిక అనుబంధం లేదనుకో నీ మనస్సు హృదయం వైపుకు ప్రయాణం చేసే అవకాశం లేనేలేదు.

ఐనస్టీన్ : జ్ఞాని యొక్క దర్శనానికి అవసరమైతే భూమి అంచులవరకు వెళ్ళు అని అన్నాడు.

తాత్కాలిక ప్రయోజనాల కోసం గురువు చూడడు. మనం ఇచ్చే గౌరవాలు కూడా గురువుకి అక్కర్లేదు. నీ హృదయంలో వున్న ఈశ్వరుడిని దర్శించడానికి నీ వాసన అడ్డువస్తుంది. నీ వాసన నశించడానికి గురువు సహకరిస్తాడు. నీ వాసనలు తొలగించుకోవాలని నీవు ప్రయత్నిస్తే వారి సహకారం బాగా అందుతుంది.

పూర్వం మహర్షులు, వారు వాసన నశింప చేసుకోవడానికే ఎంతో కృషిచేసి ఆ వాసన నశింపచేసుకున్నారు. కాబట్టి వాళ్ళు మహాత్ములు

అయ్యారు. లేకపోతే వాళ్ళు అవ్వలేరు. ఎప్పుడైతే మీరు కృషి చేస్తారో ఆ కృషి కృపగామారిపోతుంది. ఏ విషయం గురించి మీరు కష్టపడుతున్నారో దేవుడు చూస్తుంటాడు. ఆ విషయం తొలగించుకోవడానికి ఆయన సహకారం అందుతుంది. ఆయన సహకారం ఎప్పుడైతే అందిందో ఆ వాసన అకస్మాత్తుగా రాలిపోతుంది.

దేవునికి పక్షపాతం లేదు. కాని ఏవరైతే శ్రద్ధగా సాధనచేసుకుంటున్నారో వారికి ఆయన అనుగ్రహాన్ని యిస్తాడు. అనుగ్రహాన్ని ఇవ్వటమే కాదు ఆయన స్వరూపాన్ని కూడా యిస్తాడు. గురువనుగ్రహం వుంటే ఎన్ని గొడవలు వచ్చినప్పటికీ ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ కొండల కొండల మధ్య ప్రయాణం చేస్తున్న శాంతిగా మన గమ్యానికి వెళ్ళిపోతాం అంటున్నారు భగవాన్. ప్రతీమాటలోని ప్రమాణం. అడుగడుగుకి ప్రమాణం. ఇది ఇక్కడి వైభవం. ఈ మాటలు కూడా అనుగ్రహమే అని తెల్సుకున్న వారు ధన్యులు. అది మాట కాదు మనల్ని మూలంలో నుంచి సరిచేయడాకి చెప్పే అనుగ్రహమే మాట అని గ్రహించినవారు ధన్యులు. ఒకసారి గురువు మిమ్మల్ని చూశాడు అనుకోండి దాని యొక్క ప్రయోజనం వెంటనే జరగకపోవచ్చు. దాని యొక్క ప్రయోజనం వెంటనే తెలియకపోవచ్చు. కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు ఫలితం వచ్చేటప్పటికి. జ్ఞాని యొక్క చూపు చూపే దాని అనుగ్రహం అనుగ్రహమే. కాని కొద్దిమంది తొందరగా పట్టుకుంటారు. కొంతమంది ఆలశ్యంగా పట్టుకుంటారు. కొంచెం కాలమే తేడా కాని దాని ప్రభావం మాత్రం ఊరికేపోదు. జ్ఞానులచేత మనం చూడబడటం అనే ప్రయోజనం దర్శించటం వల్ల వచ్చే ప్రయోజనం వాళ్ళతో సంభాషించే ప్రయోజనం కాని ఊరికే పోదువయ్యా! మహాత్ముల సన్నిధిలో మీరు కూర్చున్నప్పుడు ఆవాతావరణం వేరుగా ఉంటుంది. కాని గుర్తించడానికి కొంత సమయం పడుతుంది.

గురువు సన్నిధిలో ఎంతో కష్టపడినా అణుచుకోలేని మనస్సు అణుగుతుంది. నిర్మలమౌతుంది. శాంతమౌతుంది. అది కుదురుపడుతుంది. లోపల వున్న వస్తువు కూడా నీకు తెలుస్తుంది. అందులో కదలకుండా వుండాలంటే కొంచెం అభ్యాసం చేస్తే నీ హృదయంలో వున్న వస్తువుకి సంబంధించిన రుచి నీకు తెలుస్తుంది. ఆ హృదయ స్థానంలో నువ్వు స్థిరపడిపోవచ్చు.

గురువు ఎవరిని అసహ్యించుకోడు. వాడిని పరిశుభ్రంచేసి వాడు బాగు పడేవరకు విడిచిపెట్టడు. ఒకవేళ మీ మనస్సు చల్లగా ఉంటే అది గురువు అనుగ్రహం. గురువు అనుగ్రహించడం వల్ల మాకు ఈ ప్రసాద బుద్ధి వచ్చింది అనుకోండి, ఈ శాంతి కలిగింది అనుకోండి, నీ హృదయంలో గురువును ధ్యానిస్తుండాలి. గురువును హృదయంలో ధ్యానించుకోవటం వల్ల నీవు పవిత్రుడివి అవుతావు.

భగవాన్ అన్నారు మనం ఈ భూమిమీదకు ఎందుకు వచ్చామో మర్చిపోకూడదు. భగవంతుడు ఈ అవకాశం ఎందుకిచ్చాడో అనేది మర్చిపోకూడదు. భగవదనుభవం మనం పొందలేకపోయినా, భగవదనుభవం పొందాలనే కాంక్ష కూడా మహత్తరమైనది. జ్ఞానం మనం సంపాదించలేకపోయినా, జ్ఞానం సంపాదించాలనే కాంక్షకూడా పూర్వపుణ్యం లేకపోతే సత్కర్మచేసి వుండకపోతే ఆకాంక్ష కూడా కలుగదు.

భగవంతునికి తెల్సుకోవాలనే కోరిక మనకి ఉదయిస్తుంటే దానికి రెండు కారణాలున్నాయి.

1. పూర్వజన్మలో మనం చేసిన పుణ్యకర్మలు, 2. భగవంతుడి అనుగ్రహం. ఈ రెండూ లేకపోతే భగవదనుభవం పొందాలనే కాంక్ష

ఉదయించదు. భక్తిని చిల్లర గొడవలకు ఉపయోగించకుండా భక్తి భక్తి కోసమే భగవంతుడు భగవంతుని కోసమే ప్రేమిస్తుంటే భగవంతుడి పట్ల భక్తి ప్రేమ కల్గి ఉంటే ఆధ్యాత్మికంగా మనం అభివృద్ధిలోకి వస్తాం. సత్పురుషులు దొరికితే ఒక మహాత్ముడున్నాడు నీవు నామ మాత్రంగా సాధన చేసినప్పటికీ కూడా నీవు ఒడ్డుకి వచ్చేస్తావు. సంసార బంధంలోంచి బయటకు వచ్చేస్తావు. మీరు కంగారు పడవద్దు. మోక్షస్థితి వస్తుందా! రాదా! అని అనుమానించవద్దు. మీరందరూ మోక్షాన్ని పొందుతారు. ఈ శరీరం ఉండగానే, ఈ లోకంలో ఉండగానే మహోన్నతమైన సుఖం, దేవతలుకూడా మిమ్మల్ని చూసి అసూయ పడేటటువంటి ఆనందాన్నీ మీరు పొందుతారు. అటువంటి శాంతిని మీరు ఇక్కడే పొందుతారు.

గురువు అనేవాడు దేహంకాదు. నిన్ను అనుగ్రహించేది దేహంకాదు. ఏదైతే అనుగ్రహిస్తుందో దానికి దేహంతో పని లేదు. గురువు దేహం లేకపోయినా నీకు అనుగ్రహం వస్తూనే ఉంటుంది. మీరు ఎన్నో సంవత్సరాలు అనుభవించాల్సిన కర్మరాశిని అంతా కూడా కొన్ని క్షణాలలో అనుభవింపచేస్తుంది. కొన్ని సంవత్సరాల తరబడి మీ వంటిమీద బాధ వుంటే కొన్ని గంటలలో మీకు ఆ బాధ యొక్క అనుభవాన్ని తీసుకువచ్చి ఆకర్మను అంతాతీసివేస్తాడు.

పరమేశ్వరుడు ఎక్కడ ఉన్నాడు. హృదయంలోనే దేవుడు ఉన్నాడు అనే స్పందన ఎవడికైతే తెలుస్తుందో వాడికి తొందరగా ముందు జ్ఞానం కలుగుతుంది. వాడు సుఖి అవుతాడు.

హృదయంలో ఉన్న దేవుడిని ఎవడైతే చూస్తూన్నాడో హృదయం యొక్క స్పందన ఎవడైతే వింటున్నాడో వాడు తొందరగా ముగ్గుతాడు. వాడి మనస్సు తొందరగా పక్వానికి వస్తుంది. వాడికి తొందరగా జ్ఞానం కలుగుతుంది

గాని కైలాసంలో దేవుడున్నాడు, తిరుపతిలో దేవుడున్నాడు అనుకుంటే చాలా సమయం పడుతుంది.

గురువు యొక్క మాట కూడా బంగారమే. ఇంట్లో బంగారం ఉన్నవారికంటే మనస్సును బంగారం చేసుకునే వారికి తొందరగా జ్ఞానం వస్తుంది. వస్తువు నీకు అనుభవానికి వస్తే మాట పడిపోతుంది. మనస్సు పడిపోతుంది.

ఒక భక్తుడు భగవాన్‌తో చెబుతున్నాడు నేను అప్పుడప్పుడు మిమ్మల్ని తలపెట్టుకుంటున్నాను, నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకుంటున్నాను. నేను బలహీనుణ్ని నాకు తెలుసు, మీకు ఉన్న బలం నాకు లేదు. భౌతికంగా చూచినా, ఆధ్యాత్మికంగా చూచినా నేను శక్తిహీణున్ని నా పరిస్థితిని మీరు అర్థంచేసుకుంటారని వివరంగా చెబుతున్నాను. నేను మిమ్మల్ని ఎలా జ్ఞాపకం పెట్టుకున్నానో, మీరూ నన్ను అలా జ్ఞాపకం పెట్టుకోండి. మీరు నన్ను విడిచి పెట్టకండి. నన్ను మర్చిపోకండి. నాకు మీ అనుగ్రహం కావాలి అని భక్తుడు భగవాన్‌తో అన్నాడు.

భగవాన్ : మీరు నాకు జ్ఞాపకం వస్తున్నారు అని చెప్పావు. ఆ జ్ఞాపకం పెట్టుకోవడం అనేది నీ అహంకారం వల్ల నన్ను జ్ఞాపకం పెట్టుకోవడంలేదు. నీవు గురువును జ్ఞాపకం పెట్టుకుంటున్నావు అంటే గురువనుగ్రహం వల్ల జ్ఞాపకం పెట్టుకుంటున్నావు. నా అనుగ్రహం కావాలి అని అడుగుతున్నావు, నా అనుగ్రహమే లేకపోతే నా జ్ఞాపకం నీకు రాదు. గురువు యొక్క అనుగ్రహం ప్రేమ కరుణ కాని లేకపోతే వాడు నీకు జ్ఞాపకానికి రాదు. ఆయన అనుగ్రహం లేని క్షణం లేదు.

నీకు మంచి కలిగితే దేవుని అనుగ్రహం ఉంది అనుకుంటావు. చెడ్డ కలిగితే దేవుని అనుగ్రహం లేదనుకుంటావు. ఆ చెడ్డ కలిగినపుడు ఏదో నీ మనస్సులో ఉన్న బలహీనత బయటకు తీయటం కోసం గురువు ఆడే ఆట అది. నీ మీద ఇష్టం లేక కాదు. నీవు నన్ను జ్ఞాపకం పెట్టుకున్నావంటే నా జ్ఞాపకమే మొదటి మెట్టు. నీ ఆధ్యాత్మికమార్గానికి మొదటి మెట్టు. గురువును నువ్వు అడగనక్కర్లేదు. గురువుకి తెలియదా! నీ బలహీనతలు ఏమిటి, ఆ బలహీనతల్లోంచి ఎలా బయటకు తీసుకురావాలో ఎక్కడ ఏది యివ్వాలో గురువుకి తెలుసు. నీవు నన్ను జ్ఞాపకం పెట్టుకుంటున్నాను అంటున్నావు చూశావు ! అదిలోపల జరిగే ప్రతిస్పందన, అదే ప్రేరణ, అదే ఆత్మ అదే అనుగ్రహం, అదే గురువు.

నీకు లోపల వున్న వస్తువుని తెలుసుకోవాలనే కోరిక గురువనుగ్రహం వల్ల కలుగుతుంది. లేకపోతే ఆ కోరిక రాదు. నిన్ను అనుగ్రహించి లోపల్నించి ప్రేరణ యిస్తాడు.

నన్ను తెలుసుకో నువ్వు సుఖపడతావు, నన్ను తెలుసుకో నువ్వు మోక్షసామ్రాజ్యానికి అధిపతివి అవుతావు అని లోపల్నించి పిలుపు వినిపిస్తుంటుంది. నీవు ఆయన వైపు ఒక అడుగువేస్తే ఆయన నీ కోసం తొమ్మిది అడుగులు వేసుకుంటూ వస్తాడు.

నీవు హృదయాభిముఖంగా ఈశ్వరునికి అభిముఖంగా నీ హృదయం యొక్క లోతుల్లోకి దిగితే నిన్ను తనలోకి చేర్చుకోవటానికి ఆయన ఎదురువస్తాడు.

ఆ గురువు యొక్క అనుగ్రహం ఎంత వేగంగా వస్తుందంటే ఆ ప్రేమ ఎంత వత్తిడిగా వస్తుందంటే పైకి మాటలు లేకపోయిన ఆ హృదయంలోంచి

వచ్చేశాంతి, ప్రేమ, సందేశం నీకు ఊపిరి సలపనంత వేగంగా వస్తుంది. మీరు తర్వాత ఇంటికి వెళ్ళినా అది మిమ్మల్ని తరుముతుంది. ప్రతీ నిముషం మీ మీద పనిచేస్తుంది.

గురువు యొక్క మౌనం ఎంతబలంగా పనిచేస్తుంది అంటే ఆ గురువు నుండి వచ్చే ప్రబోధలను మీరు విడిచిపెట్టి ఎక్కడికీ తప్పించుకోలేరు.

గురువు యొక్క హృదయంలోనుండి వచ్చే సందేశం ఈ జన్మలోనే కాదు వచ్చే జన్మలో కూడా మిమ్మల్ని వెంటాడుతుంది. మీరు ఏ దేహంలో ఉన్నప్పటికీ మీ లోపల ఉన్న సత్యమే ఏదో ఒక గురు రూపంలో వచ్చి మిమ్మల్ని దొర్లించుకుంటూ పోతుంది. ఇన్ని జన్మలనుండి ఆ వస్తువు నా దగ్గరే వుంది. నా దగ్గర ఉన్నప్పటికీ నాకు తెలియపోవటం వల్ల బయట గురువు రూపం ధరించి తరుముకుంటూ వస్తోంది అని ఆ వస్తువు తెలిసాక నీకు తెలస్తుంది. లోపల గురువు బయట గురువు ఒకటేనని తెలుస్తుంది. ఫ్యాను తిరుగుతుంటే దాని రెక్కలు కనపడవు. గురువు యొక్క అనుగ్రహం అలా వుంటుంది.

మౌనంగా ఉన్న వాడి సందేశం ఏ ఖండంలో వున్నా, ఖండాంతరాలలో వున్న, ద్వీపాంతరాల్లో ఉన్నప్పటికీ ఆ మౌనంలోంచి వచ్చేశాంతి వాడికి కూడా వినపడుతుంది. ఈ మౌనం యొక్క ప్రభావం వాడిమీద కూడా పడుతుంది. మౌన సందేశం ఎంత బలంగా వుంటుందంటే దానిని కాలంగాని, దూరంగాని ఆపుచేయలేదు. ప్రపంచంలో నీవు ఏ మూలలోకి పారిపోయిననూ తరుముతూనే ఉంటుంది. నీవు ఏ మూలానికి వెళ్ళి దాక్కున్నా వెతుక్కుంటూ వచ్చి నిన్ను అనుగ్రహించి తరింపజేస్తుంది. అది గురు వైభవం.

వర్షం కురిసినపుడు బిందె పెడితే బిందె నిండి పోతుంది. ఆ బిందే బోర్లవేస్తే పది దిక్కుల వర్షం కురిసిననూ ఆ బిందెలో ఒక్కచుక్క నీరు కూడా పడదు. అదే విధంగా మీ హృదయాన్ని ఓపెన్ చేస్తే ఆ గురువు యొక్క అనుగ్రహం కూడా అలా వర్షిస్తుంది. హృదయాన్ని మూసేసుకుంటే ఏమీ లేదు. ఆయన సమక్షంలో సాధన చేయాలనే బుద్ధి కలుగుతుంది. ఇంతకముందు సాధన చేయాలనే బుద్ధి వుంటే ఆ బుద్ధి శుద్ధి అవుతుంది.

ఏ శక్తి అయితే ఈ సృష్టినంతా నడుపుతుందో ఆ శక్తిని కనుక నువ్వు శరణాగతిగా వేడుకుంటే నీకు టెన్షన్ ఉండదు. నీకు అశాంతి వుండదు. ఏ శక్తినైతే వేడుకుంటున్నావో ఆశక్తే నీకు మోక్షాన్ని ప్రసాదిస్తుంది. శాశ్వత స్థానాన్ని ప్రసాదిస్తుంది. శాంతితో నిన్ను కప్పుతుంది. ఆ స్థానం పొందే వరకు నిన్ను అనుగ్రహించికాని ఆ శక్తి విడిచిపెట్టదు.

ఏది చేసినప్పటికీ ఈశ్వరుడిని శరణువేడుకో. అన్నిరకములుగా శరణువేడుకో. ఏ దేవుణ్ణి అయితే శరణు వేడుకుంటున్నావో ఆ పనులు దేవుడే చేయగలడు. గురువనుగ్రహం లేదని అనుకోకండి. అనుగ్రహం ఉన్నప్పటికీ గుర్తించేశక్తి లేదనుకోండి.

గురువంటే ఆప్తుడు. ఆప్తుడంటే బంధువుకాదు. ఆప్తుడంటే మన క్షేమం కోరేవాడు. మనం ఎక్కడవున్నా ఉజ్వలమైన మన భవిష్యత్తును కోరేవాడే ఆప్తుడు. ఎక్కడ ఉన్నా మన క్షేమం కోరుతూ ఉంటాడు. గురువు ఆప్తుడు మాత్రమే కాదు. ఆప్తబంధువు కూడా. శరీరానికి బంధువుకాదు. జీవుడికి బంధువు. అంటే శరీరం పోయిన తర్వాత జీవుడు ఎక్కడికి ప్రయాణం చేస్తున్నా, ఏ లోకంలో ఉన్నా మళ్ళీ కొత్త శరీరంలో ఎక్కడ ఉన్నా ఆ జీవుడిని గురువు చూసుకుంటాడు. అంటే ఆ జీవుడు క్షేమంగా వాడి స్వస్థానంకు చేరే వరకు గురువు గమనిస్తుంటాడు. గురువు చాలా

బాధ్యత వహిస్తాడు. భగవాన్‌ని ఒకరు అడిగారు! గురుకృప అంటే ఏమిటి? గురువు యొక్క కృప ఆత్మసాక్షాత్కారానికి మార్గం ఎలా చూపుతుంది? గురువు ప్రేమ ఎలావుంటుంది?

గురువంటే ఆత్మ. మన రంగులు వేరైనా మన దేహాలు వేరైనా, మన కులాలు వేరైనా, మన గుణాలు వేరైనా, మన శరీరాలు ఏదో ఒకరోజు చనిపోయిన ఈ రంగులతోటి గుణాలతోటి,స్వభావంతోటి, మంచి చెడులతోటి సంబంధం లేకుండా అందరి హృదయాలలో స్వతంత్రంగా ఒక వస్తువు ప్రకాశిస్తుంది. అదే నిజమైన గురువు. మన హృదయంలో వస్తువు మనకు తెలియకపోవచ్చు, కాని మన గురువు అదే.

ఆ వస్తువు దాని స్వరూపం మనకు ఇచ్చేవరకు జన్మ, జన్మలకు మనల్ని వెంటాడుతూనే వుంటుంది. ఆ కర్మ చక్రంలోంచి మానవుడు విడుదల పొందాలంటే గురువనుగ్రహం లేకుండా విడుదల పొందలేడు. అదే గురువు యొక్క ఆవశ్యకత. కొంతమంది మహర్షులు జ్ఞానులు ఈ భూమి మీదకు వస్తారు. వారికి ఎటుచూచినా జ్ఞానమే, నవ్వినా జ్ఞానమే,చూచినా జ్ఞానమే, కదిలినా జ్ఞానమే, కదలకపోయినా జ్ఞానమే, కళ్ళు తెరిచినా జ్ఞానమే, కళ్ళుమూసినా జ్ఞానమే.

మీరాబాయి చెప్పింది నీవు జ్ఞానుల దగ్గరకు వెళ్ళు వాళ్ళ పాదల దగ్గర కూర్చో, వాళ్ళు చెప్పిన మాటలు శ్రద్ధగా విను. ఇంటికి వెళ్ళిపో, వాళ్ళ పాదాలను స్మరిస్తూ, వాళ్ళ మాటలను మననం చేసుకుంటే నీవు పవిత్రుడివి అయ్యిపోతావు, నీ నిజమైన పతి నీ నిజమైన గతి నీకు ఎరుకలోకి వస్తుంది.

నీవు దేవుడిని స్మరించగా, స్మరించగా ధ్యానస్థితి కలుగుతుంది. భగవంతుడ్ని ఉపాసన చేయగా, చేయగా కృప వాడి రూపంగా వస్తుంది.

ఆ రూపం ఎవడో కాదు, వాడే గురువు ఆ ఈశ్వరుడు మాంసం రూపంలో ఒక పేరు, రూపం ధరించి వస్తుంది. ఈ నేననే బుద్ధి ఎక్కడినుంచైతే ఉదయించి వస్తుందో ఆ ఉదయంచే చోటుకి ఈ జీవుడు చేరుకునే వరకు గురువు మిమ్మల్ని వెంటాడుతూనే వుంటాడు.

భగవంతుడే రూపం ధరించి భక్తుడికి కనపడతాడు. నీకు చూడటం కావాలి. నీకు చూడటం ఇష్టం కాబట్టి ఎక్కడో వున్న వస్తువు దిగిపోయి ఒక రూపాన్ని భూజాన వేసుకుని వచ్చి నీకు కనపడుతుంది. ఆ రూపం కనిపించడమే కాదు నీతో మాట్లాడుతుంది. ప్రతీ మాట అనుగ్రహమే ఆయన మౌనం కృప, మాట కృప, మౌనం యొక్క బోధ మనకు అందదు. అంత పవిత్రత అంత ఏకాగ్రత, అంత సూక్ష్మత మనకు లేవు. అందుచేత మౌనంగా ఉండటం కాకుండా మాట్లాడుతుంది. మనకు విషయాలపట్ల ఎంత అనురాగం ఉందో ఈశ్వరుని పట్ల అంత అనురాగం ఉంటేచాలు.

గురువు మీ మనస్సును బలహీనంగా వుంచడు, బలంగా చేస్తాడు, నిశ్చలంగా చేస్తాడు. గాలి లేని చోట దీపం ఎంత నిశ్చలంగా ఉంటుందో, ఎంత కుదురుగా ఉంటుందో నీ మనస్సుకి తన కంపెనీ యిచ్చి ఆ స్థితికి మోసుకుపోతాడు. అంటే ప్రకృతికి సంబంధించిన విషయాలుగాని, నీ ప్రారబ్ధంకు సంబంధించిన విషయాలుగాని నీ మనస్సు లొంగదు. నీ మనస్సు కుంగదు, నీ మనస్సు చెదరదు. ఆ స్థాయికి నీ మనస్సును తీసుకుపోతాడు గురువు. నీతో మాట్లాడటం కోసం మాట్లాడడు, కంపెనీ యివ్వటం కోసం మాట్లాడడు, నీ మనస్సును ఎక్కడికి సుదీర్ఘ దూరాలలోకి అంటే ఎక్కడైతే నీ మనస్సు పుట్టుక స్థానం ఉందో, ఎక్కడ రాలిపోయి చెదిరిపోయి ప్రవహించి వస్తుందో నీ మనస్సును తన మూలంలోకి పంపటం కోసం మాటద్వారా, చూపు ద్వారా, సహవాసం ద్వారా దానిని పటిష్టం

చేసి నీకు తెలియకుండా నీ హృదయం యొక్క లోయల్లోకి నీతో మాట్లాడుతూ అక్కడకు తోలుకుపోతాడు వాడే గురువు.

మనం ఈ లోకంలోకి ఏ పని మీద వచ్చామో ఆ పనినిమర్చిపోతుంటాం. ఎందుచేతనంటే ఆధ్యాత్మికంగా పిల్లలం కాబట్టి గురువు ఏ పని మీద ఈ లోకంలోకి వచ్చాడో వాడు మర్చిపోడు. ఒక చాక్లెట్ చేతిలో పెడితే చాలు యీ భూమిమీదకు వచ్చిన పనిని మనం మర్చిపోతాం. నీ లోపల వున్న చైతన్యం మీద విశ్వాసం చెదరగొట్టుకోకు నీ విశ్వాసం రాలిపోకుండా, కాలిపోకుండా చూచుకో. ఎక్కడ్నించి అయితే మనకు శాంతి అందుతుందో కాంతి అందుతుందో ఆ స్పిరిట్‌కి చావులేదు.

శరీరం చనిపోతుంది. చావులేని వస్తువు ఒకటి నీ లోపల వుంది. కాని అది మీ శరీరంలో ఒక భాగంకాదు. ఈ సృష్టి యొక్క కార్యకలాపం అంతా ఏ హృదయంలోంచి అయితే వస్తుందో అందులోనే నువ్వు వున్నావు. ఏ హృదయం అయితే నీకు ఆధారంగా వుందో నీ కళ్ళకు కనిపించే క్రియేషన్ అంతా కూడా ఆ హృదయంలోంచే వచ్చింది. ఆ హృదయం ఎవరో అనుకోకు అది నీవై వున్నావు.

గురువు అంటే పరాయివాడు కాదు. నీ హృదయంలో ఉన్నవాడే వీడు. గురువు నీ వాడే. వచ్చినవాడు ఎవడో అనుకోకండి. గురువు నీ వాడే అనే సంగతిని మర్చిపోకండి. మాయలో పడకండి. మానవజాతి అంతా దేనిని పొందటం కోసం తహ తహలాడుతుందో ఈ ఋషులు, మహర్షులు సాధనచేసి ఏ స్థితిని పొందారో ఆ స్థితిని మీ చేత పొందింపచేయడానికి నీ హృదయంలో వున్న చైతన్యమే గురువుగా వస్తాడు. నీ మనస్సును కొంచెం శాంతిగా వుండు, కుదురుగా వుండు అని చెబుతూ మనస్సుకి వెనకగా వున్న ఆత్మ దగ్గరకు నిన్ను నెట్టుకుంటూ పోతాడు. అన్నీ గురువే, అంతా

గురువే, ముందు గురువే, వెనుక గురువే, పైన గురువే, క్రిందా గురువే, గురువు  తప్పించి, ఆత్మ తప్పించి ఈ లోకంలో ఎక్కడా ఏంలేదు.

ఏ నిజ స్థితిలోంచి ఈ సృష్టి అంతా వెలువడిందో, ఏ నిజ స్థితిలోంచి ఈ సృష్టిఅంతా పెరుగుతుందో, ఏ నిజ స్థితిలో ఈ సృష్టి అంతా ఐక్యం అవుతుందో ఆ నిజ స్థితిలోనికి నిన్ను మోసుకు పోతాడు, తీసుకుపోతాడు. ఆ నిజస్థితిని క్షణ కాలంలో నీకు అందింపచేస్తాడు. ప్రకృతి ప్రభావం నీ మీద పడకుండా నిర్మల స్థితిని కలుగజేస్తాడు.

గురువు యొక్క మౌనం అన్నింటికంటే బిగ్గరగా జరిగే ఉపదేశం. ఈ లోకంలో ఎన్నో దీక్షలున్నాయి. ఇతర దీక్షలు అన్నీ మౌనంలోంచి వచ్చినవే. మౌనంతో ఎవర్నీ పోల్చలేం. మౌనాన్ని మాటలతో, చేతలతో పోల్చలేం. మౌనాన్ని మౌనంతోనే పోల్చాలి. మౌనంతోనే సమానమైనది, దానికంటే ఉత్తమమైనది లేనేలేదు.

మీ మనస్సు కనుక బంగారం అయితే ఆ మౌనంలో బంగారం మీకు అందుతుంది.  గురువు యొక్కమౌనం ముందు మీ సాధనాలన్ని ఎల్.కే.జి లాంటివి. మాటలు మీకు మనస్సులో మార్పు తీసుకురాకపోవచ్చు. కాని మౌనం మటుకు మీకు మారుమనస్సును తీసుకువస్తుంది. మీరు ఈశ్వరుని వైపు ఎలా ప్రయాణం చెయ్యాలో కరెక్టు డైరెక్షన్ చూపిస్తుంది. మీ జీవిత విధానంలో మార్పు వస్తుంది. ఇదంతా గురువు మౌనం వల్ల వాటంతట అవే వచ్చివేస్తాయి. గురువు యొక్క మౌనం అతివేగంగా, అతిశీఘ్రంగా నీ మనస్సును పవిత్రంచేస్తుంది. సాధకుడి యొక్క మనస్సు గురువు యొక్క సమక్షంలో  గురువు యొక్క మౌనంలో గురువు యొక్క ఆప్యాయతలో మీ మనస్సు  మీకు తెలియకుండా పవిత్రం అవుతుంది.  గురువు యొక్క మౌనం మనల్ని ఎక్కడ చావులేని స్థితి వుందో అక్కడికి కొనిపోతుంది.

గురువుయొక్క మౌనానికి బ్రేకులు లేవు. గురువు యొక్క అనుగ్రహం జీవనదిలా వుంటుంది. గురువును, గురువుతో పోల్చాలి.

ఎక్కడ మహర్షి వున్నాడో, ఎక్కడైతే ఋషి వున్నాడో ఎక్కడైతే యోగి వున్నాడో, ఎక్కడైతే బ్రహ్మజ్ఞాని వున్నాడో ఎక్కడైతే అవతారపురుషుడు వున్నాడో అక్కడ ఆ పరిసరాలు ఎంతో పవిత్రం అవుతాయి. ఏ భూమి మీద అయితే ఆయన కాళ్ళు నడుస్తున్నాయో ఆ భూమి కూడా అంత పవిత్రం అవుతుంది. ఏ నదిలో స్నానం చేస్తే ఆనీరు పవిత్రం అవుతుంది. అది జ్ఞాని యొక్క వైభవం.

ఎవడికైతే పవిత్రత ఉందో ఎవడికైతే యోగ్యత వుందో వాడి శరీరం ఉన్నా, లేకపోయినా, ఈ నదులు ఎంతకాలం ప్రవహిస్తుంటాయో, మానవ జాతి హృదయాలలో వాళ్ళ పేర్లు దాచుకుంటుంది. ఇది నగ్నసత్యం. ఆయన ఏ భూమి మీద నడిచాడో, ఏ ఆకాశం క్రింద నడిచాడో, ఆప్రదేశం అంతా కూడా ఆ వాతావరణంతోటి సన్నిహితమైన సంబంధం వుంటుంది. ఎవరైతే ఆయన సమక్షంలో జీవించారో వారితోటి సన్నిహితమైన సంబంధం వుంటుంది. ఆగాలి చల్లగా వీస్తుంది. ప్రతీదీ అందంగా వుంటుంది.

బయట గురువులు శరీరాలు వారుకాదు. ఆ సౌందర్యంలోకి మిమ్మల్ని ప్రవేశపెట్టటానికి బయటకనిపిస్తున్న రూపాలే గురువులు. గురువు యొక్క సన్నిధిలో నువ్వు దేహంలో ఉన్న లోకంలో ఉన్న దేహాతీత స్థితికి, లోకాతీత స్థితికి వెళ్ళిపోతావయ్యా! గురువు యొక్క ప్రభావం అలా పనిచేస్తుంది. నీవు ఏదో దేహంలో వుంటావు, దేహం లేని స్థితిని పొందుతుంటావు లోకంలో వుండికూడా లోకం లేని స్థితిని పొందుతుంటావు. గురువు యొక్క సన్నిధానంలో ఆ పవిత్రత యొక్క వేగం వల్ల జీవకోటే కాదు పంచ భూతాలు కూడా చల్లబడిపోతాయి.

గురువుయొక్క వలలో ఎవరైతే వున్నారో వారికి అత్యంతమైనటువంటి అనుబంధం గురువుతో వుంటుంది. గురువు యొక్క అనుగ్రహాన్ని మన మనస్సులో ట్యూన్ చేసుకోవాలి. గురువు యొక్క ప్రేమ ఎటువంటిదో తెలుస్తుంది. ఆ ట్యూన్ చేసుకొనే బాధ్యత మనకి వుంది. గురువు యొక్క మౌనం శిష్యుడి గుండెకి తాకి వాడికి అర్ధం అయ్యేటట్లు చేస్తుంది. అంత బలీయమైనది గురువు యొక్క అనుగ్రహం. గురువు యొక్క అనుగ్రహం వల్ల మహర్షి అయ్యిపోతావు. మహాత్ముడివి అయ్యిపోతావు. గురువు ఏ స్థాయిలో ఉన్నాడో, ఆ స్థాయికి నమ్మినవాడిని తీసుకువచ్చేవరకు నిన్ను విడిచిపెట్టడు.

గురువు యొక్క మనో మూలంలోంచి మౌనం వస్తుంది. నువ్వుకూడా మనో మూలంలోకి వెళ్ళినపుడే గురువు యొక్క మౌనం నీకు అర్ధం అవుతుంది. గురువు యొక్క శరీరం, మన శరీరం దగ్గర వుండవచ్చు. కాని లోపల వాడు ఎక్కడ వున్నాడో, మనం ఎక్కడ ఉన్నామో మనకి అంతుపట్టదు. మనం మనస్సు చుట్టూ తిరుగుతున్నాం. వాడు మనో మూలంలో వున్నాడు. మనస్సు చుట్టు తిరిగే మీకు మనో మూలంలో ఉన్నవాడు ఎలా అర్ధం అవుతాడు. గురువు యొక్క మౌనం సంపూర్ణంగా ఉంటుంది. సమగ్రంగా వుంటుంది. అది ఎలా వుంటుందంటే ఫెర్‌ఫెక్షన్ చూస్తునట్లు వుంటుంది. గురువు అనుగ్రహంలోంచి వచ్చే స్ఫూర్తిని నీకు అర్హత లేకపోతే సాధకుడివి కాకపోతే నీవు సత్యాన్వేషకుడివి కాకపోతే నీవు భక్తుడివి కాకపోతే ఆ శాంతిని పొందలేవు.

గురువు వెంబడించడం అనేది మన కళ్ళకు కనపడదు. ఆనంద సాగరంలోకి తీసుకువెళ్ళేవరకు నిన్ను విడిచి పెట్టడు. ఒకవేళ నీలో దురాచారం వున్న లోకం నిన్ను విమర్శించిన నిన్ను సదాచారం వైపుకు

తీసుకువెళ్ళి ఆ సద్బుద్ధి నీకు కలిగే వరకు ఒక వేళ ఎవరన్నా ఈసడించినా గురువు విడిచిపెట్టడు. నువ్వు ఇతరులకు దయచూపిస్తే ఆయన దయ నీకు చూపిస్తాడు, ఇతరులకు కరుణ చూపిస్తే నీ పట్ల ఆయన కరుణ చూపిస్తాడు. నువ్వు కపటం లేకుండా మాట్లాడితే నీ మనసుని, నీ బుద్ధిని శుద్ధిచేసి ఆ శీలాన్ని నీకు కలుగజేసి, నీ బుద్ధికి వస్తువు వ్యక్తంచేస్తాడు. అది గురువు యొక్క డ్యూటీ. ప్రత్యేకంగా అడగక్కర్లేదు.

గురువు అన్ని కాలాల్లో సమానంగా వుంటాడు. సర్వకాల సర్వ అవస్థలలోనూ శరీరం వున్నా, శరీరం లేకపోయినా, పరిస్థితులు అనుకూలంగా వున్నా, అనుకూలంగా లేకపోయినా, గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా నిర్వికారంగా వుంటాడు. ఆత్మలో సర్వదా స్థిరంగా వుంటాడు. ఎప్పుడు ఆత్మ స్పృహలోనే వుంటాడు. ఆ స్వరూపంలోంచి జారడు. ఆ నిష్టలోంచి జారడు. అక్కడికి వచ్చేటప్పటికి నీతో రాజీపడడు. ఎందుచేతనంటే నిజమేమిటో వాడికి తెలుస్తుంది.

వేమన చెప్పాడు : పుట్టలో చెదలు పుడతాయి, ఆ పుట్టలోనే అవి నశించిపోతాయి. గురువనుగ్రహం లేకపోతే మనం కూడా అంతే. మానవ జన్మ రావటం, మహా పురుషులు, మహాగురువుల ఆశ్రయం దొరకటం నీకు మోక్షమార్గం కనిపించటం ఎన్ని జన్మల పుణ్యమో కదా!

నువ్వు ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఆ మార్గాన్ని చెడగొట్టడు గురువు. భక్తి మార్గం యిష్టమైతే భక్తిమార్గం, ధ్యానమార్గమైతే ధ్యానమార్గం, విచారణ మార్గమైతే విచారణ మార్గం, నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా నీ కూడా వస్తుంటాడు. భగవాన్ అన్నారు : పూర్వ జన్మలో ఏ సంబంధం లేకుండానే ఇక్కడ కల్సుకున్నామా! ఈ సంబంధం మనల్ని మరలా మరోచోట కలపదా! అంటే ఇది మాటకాదు. వాగ్దానం. జన్మ,

జన్మలు నిన్ను విడిచిపెట్టడు గురువు. నీ ఇష్టాన్ని కష్టమైనా తన యిష్టం చేసుకుంటాడు గురువు. నీ యిష్టం గురువుకి కష్టమే. నీ కోసం నీ యిష్టాన్ని తన యిష్టంగా చేసుకుంటాడు. ఆయనకు నీవు ఏ మార్గంలో ఉన్నావనేది ముఖ్యంకాదు నిన్ను తరింపచేయటమే ముఖ్యం. ఎలాగైనా ఫాలో అయ్యిపోతాడు. ఏ వాసన అయితే బాధించిందో ఫలానా వాసన నన్ను బాధించింది అనే గుర్తు కూడా నీకు తెలియకుండా చేస్తాడు. ఈ లోకంలోకి నువ్వు వచ్చి వెళ్ళిపోయిన జాడ కూడా నీకు తెలియదు.

నిజమైన గురువు ఆత్మరూపంలో వున్న వాడే ఆ నిజమైన గురువు దగ్గరకు తీసుకు వెళ్ళటానికి మార్గాన్ని నిర్దేశిస్తారు బయట గురువులు. మన గురువు మనకు అత్యంత సన్నిహితుడు. చిరకాలం , కలకాలం ఆయన పొందిన స్థితిని మనచేత పొందింపచేయడానికి వెంటాడుతూవుంటాడు. అటువంటి గురువు విషయంలో విశ్వాసం విషయంలో కొరత పనికిరాదు. మీ విశ్వాసంలో ఎప్పుడు కొరత, వెలితి వుండకూడదు. సమానంగా వుండాలి. దేహంతో వున్న గురువులు చేసే పని ఏమిటంటే సమాజంలో ఆధ్యాత్మిక విద్యను వెదజల్లుతారు. గురువుకి కూడా ఒక బాధ్యత వుంది. గురువు బాధ్యత ఏమిటో గురువుకి తెలుసు. ఎదుటి మనిషిలో వున్న మంచితనాన్ని, వివేకాన్ని మేల్కొలిపి వాళ్ళకి ఆధ్యాత్మిక విద్యపట్ల ఇష్టం కలిగేటట్లు చేసుకుంటాడు. మీలో తెలివి, వివేకం, మంచితనం వుంది అవి నిద్రపోతున్నట్లుగా వున్నాయి. నిద్రపోతున్న మీ ధైర్యాన్ని వివేకాన్ని, మంచితనాన్ని మేల్కొలుపుతాడు గురువు.

సమాజంలో ఆధ్యాత్మిక విద్య, ఆధ్యాత్మిక అంతస్తు పెంచడానికి సహృదయాన్ని పెంచడానికి తోటి మానవుడిని వివేకవంతుడిని చెయ్యడానికి దేహధారియైన గురువు పనిచేస్తుంటాడు.

గురువంటే సామాన్యం అనుకోవద్దు. నీ దేహాన్ని చూస్తాడు, అది నువ్వు అనుకోడు, నీ మనస్సు చూస్తాడు అది నువ్వనుకోడు, మీ హృదయంలో ఏదైతే సత్యం వుందో అదే మీరు. కాని అదే మీరని మీకు తెలియటం లేదు. ఏ కారణం వల్ల అది మీరని తెలియటంలేదో ఆ కారణాన్ని ఆయన అనుగ్రహం, ఆయన శక్తిని, ఆయన ప్రేమను పంపించి జన్మ జన్మలనుంచి వస్తున్నటువంటి ఆ సంస్కారాలను కాల్చి బూడిద చేయటానికే ఈ బయట గురువును చూస్తుంటాడు. గురువు చెడ్డవారిలోనూ ఆత్మను చూస్తుంటాడు. ఆ చెడ్డతనాన్ని తొలగించేస్తాడు కాని విమర్శించడు. నీ గురువు పేరు, రూపం నిరంతరం నువ్వు జ్ఞాపకం పెట్టుకో. గురువు యొక్క ప్రేమ, గురువు యొక్క అనుగ్రహం, గురువు యొక్క  మహిమ నీ మనస్సు అర్థం చేసుకుంటుందని గురువు అనుకోడు. చలిస్తున్న మనసు గురువు యొక్క ఔనత్యాన్ని గుర్తించలేదు. నీ మీద గురువు ప్రేమ వున్న కారణంగానే ఎప్పుడన్న నీ గుండె, నీ మెదడు కాని, నా జ్ఞానేంద్రియాలుకాని ప్రశాంతంగా వున్నాయంటే అది గురువనుగ్రహం అని గుర్తించు. గురువనుగ్రహం వర్షించినపుడు ఆయన చేతుల్లో నీ హృదయం, నీ మనస్సు, నీ ఇంద్రియాలు విశ్రాంతి  పొందుతాయి.

నిన్ను అజ్ఞానంలోంచి విడుదల చేసి నీ యింద్రియాలు,  నీ మనస్సు, నీ ఊహలు, నీ సంకల్పాలు నీ తలంపులు అనే అరణ్యంలోంచి నిన్ను విడుదల చేసి నీకు సత్యంవైపుకు దారి చూపించేవాడే గురువు. ఇంద్రియాలనే అడవి, మనస్సనే అడవి, నీ అహంభావన అనే అడవి, దేహబుద్ధి అనే అడవిలోంచి ఒక్క గురువు తప్పించి నిన్ను బయటకు ఎవడు తీసుకురాలేడు.

భగవంతుడే గురురూపం ధరించి భూమిమీదకు వస్తాడు. ఎలా వస్తాడంటే ఆనందాన్ని పట్టుకుని వస్తాడు.  ఆయన చూపు జ్ఞానం, ఆయన

మాట జ్ఞానం ఆయన ప్రతికదలిక జ్ఞానం ఆయనను ఆశ్రయించిన వారిని తరింపచేయడానికే కదులుతాడు, మాట్లాడుతాడు, చూస్తాడు. దేహం ధరించినప్పటికీ ఆయన మాట ఆనందం, చూపు ఆనందం, ఆ శరీరం అంతా ఆనందమే. ఎక్కడ చూచిననూ మధురమే. ఎందుచేతనంటే ఆ మధురాధిపతిలో వున్న మధురం శరీరం ధరించి వచ్చింది. ఆ ఆనందం ఎందుకు శరీరం ధరించి వచ్చిందంటే జీవకోటిని ఉద్ధరించడానికి, సజ్జన సాంగత్యం వల్ల అన్ని స్టేటస్‌లూ నీకు వస్తాయి. సూర్యుడు చేసేపని, చంద్రుడు చేసేపని, గాలిచేసే పని, కల్పతరువు చేసేపని అన్ని సత్పురుషులు నీకు చేస్తారు. అందుచేత శరీరం ధరిస్తాడు. ధరించినా అదంతా ఆనందమే. మధురాధిపతికి అంతా మధురం. ఆయన చూపు మధురం, మాట మధురం, ఆయన మిమ్మల్ని తాకితే మధురం, కూర్చుంటే మధురం, నుంచుంటే మధురం, ఎటుచూచినా మధురమే. భక్తులను ఆశీర్వదిస్తున్నట్లు కనిపిస్తాడు. భక్తులతో మాట్లాడుతూవుంటాడు. కాని వాడిలో కలుపుకోవాలన్న ప్రయత్నం చేస్తున్నాడన్న సంగతి ఈ జీవుడికి తెలియదు. ఆయనలో మనల్ని కలుపుకున్నట్లుగా మనకు తెలియకుండా ఆ పని పూర్తి చేసిపెడతాడు.

ఒక భక్తుడు మేం గురువుని ఎలా ఎన్నుకోవాలి అని అడుగుతున్నాడు ! దానికి భగవాన్ చెబుతున్నారు ఎంతోమంది మహాత్ములు వుండవచ్చు ఎంతో మంది మహర్షులు వుండవచ్చు. ఎంతో మంది యోగులు వుండవచ్చు కాని నీ మనస్సు ఎవరితో శృతి కలుపుతుందో ఎవరిపట్ల నీ మనస్సుకు అనురాగం కలుగుతుందో ఎవరి మాట పట్ల నీకు ప్రీతి కలుగుతుందో అతడే నీకు గురువు. ఎవరి పేరు స్మరించుకుంటే నీ మనస్సు ఆగుతుందో, ఎవరి మాట నీకు విలువగా కనిపిస్తుందో వాడినే నీ గురువుగా నిశ్చయించుకో. ఏ గురువుకైనా ప్రశాంతత వుంటుంది. వాడు శాంతిగా వుంటాడు, ఓర్పుగా వుంటాడు, సహజంగా వుంటాడు, ఈ భూమికి ఎంత

ఓర్పు వుంటుందో వాడికి కూడా అంత ఓర్పు వుంటుంది. ఈ గుణాలు వున్నవాడే గురువు.

సూదంటు రాయిని ఇనుము ఏ విధంగా ఆకర్షిస్తుందో, ఎవడైతే నీకు గురువైయున్నాడో వాడి పట్ల నీకు కూడా అటువంటి ఆకర్షణ కలుగుతుంది. వాడతో నీకు శృతి కలుగుతుంది. గురువు యొక్క స్వరూపం నీకు తెలియాలంటే తెలియదు. నీవు ఎవరో తెలిస్తేకాని గురువు ఎవరో నీకు తెలియబడదు. నువ్వు ఆత్మవే అని నీకు తెలిసాక ఈ గురువు ఎన్నో జన్మలనుంచి నన్ను వెంటాడుతున్నాడు, నన్ను సరిదిద్ది ఆయన స్వరూపాన్ని నాకు యివ్వటానికే అన్న సంగతి నీకు తెలుస్తుంది. జ్ఞానికి చేయడానికి పని అంటూ ఏమీలేదు. ఆయన ఉపాధి ద్వారా ఏపని అయితే జరగవలసివుందో అది జరుగుతూవుంటుంది. ఆయన ఉపాధి ద్వారా మహాసామ్రాజ్యం ఏర్పడవచ్చు. గురువు మాట్లాడకపోయినా కోట్లాదిమంది తరించవచ్చు. అదంతా ఈశ్వరుని మయం అందుచేత గురువుతోటి మానసిక అనుబంధం ముఖ్యం.

గురువు ఎవరనుకుంటున్నారు. మీ ఆత్మలకు ఆత్మవాడు, అమ్మలకు అమ్మవాడు, నీ బంధువులకు బంధువువాడు, సాధువులకు సాధువువాడు, నీ గురువే నీకు నిజమైన బంధువు. అందుచేత నీ శరీరం ఎక్కడ వున్నది అన్నది ముఖ్యంకాదు. నీ మనస్సు ఎవరిని స్మరిస్తున్నది అన్నదే ముఖ్యం. గురువుతోటి సంపర్కం పెట్టుకోవాల్సింది మనస్సే, నశించవల్సిందీ మనస్సే.

ఇక్కడ భగవాన్ రెచ్చిపోయి చెబుతున్నారు సత్పురుషులు తోటి సహవాసం మూడు లోకాలలోనూ లేదు పొమ్మన్నాడు. మూడు లోకాలలోనూ దానితో పోల్చదగినది ఏమీలేదన్నాడు అటువంటి సహవాసం దొరికితే సరేసరి. వెతుక్కో లేకపోతే అన్వేషించుకో ఆ సాంగత్యాన్ని వెతుక్కుంటూ వెళ్ళిపో.

ఒక వేళ ఆ సత్పురుషుడు దొరకకపోయిన ఆ సత్పురుషుడి అన్వేషణలో ఉన్నప్పుడు నీకు అంతర్‌దృష్టి కలుగుతుంది. లోపలవున్న సత్యం వెంటనే అనుభవానికి రాకపోవచ్చు. దానిని తెల్సుకోవాలనే బుద్ధి, ఆకాంక్ష నీకు ఉదయించినపుడు నీకు అంతర్‌దృష్టి కలుగుతుంది. నీ అంతర్‌దృష్టే ఆత్మజ్ఞానాన్ని పట్టిఇస్తుంది. జ్ఞాన సముపార్జన పట్ల నీకు ఆకాంక్ష ఉన్నప్పుడే నీకు గురువు విలువ తెలుస్తుంది. సాధకుడు గురువుపట్ల భక్తి, గౌరవం కల్గివుండాలి. రామకృష్ణపరమహంస చెబుతాడు కొంతమంది గురువులు గోడమీద కూర్చుంటారు. ఇటు గోడ అవతల చూస్తూవుంటారు అటు చెబుతుంటారటండి అంటే వాళ్ళుపొందినటువంటి అనుభవాన్ని ఆ ప్రక్కకు చూనస్తూ ఈ ప్రక్కన వున్నవారికి వ్యక్తీకరిస్తుంటారు, కానీ అనుభవించటమేకాదు ఇతరులకు వ్యక్తం చేయగలగాలి. వాడే గురువు. గాఢనిద్రలో వున్న చైతన్య స్థితిని నీకు జాగ్రదావస్థలో రియలైజ్ చేసేవాడే గురువు. గాఢ నిద్రలో స్థితి జాగ్రదవస్థలోకూడా వుంది. ఆ స్థితిలోని జాగ్రదావస్తలో తదాప్యంచేయటం కోసం నీకు సహకరిస్తాడు. అది గురువు చేసే పని. నీ ముఖాన్ని మోక్షంవైపుకి త్రిప్పుతాడు అంటే అజ్ఞానంలోంచి అవిద్యలోంచి నిన్ను విడుదలచేయటానికి సర్వవిధములా నీకు సహాయ సహకారాలు అందిస్తుంటాడు. ఆ ఈశ్వరునిలో వున్న కృపా గురురూపం దాల్చి వస్తాడు. ఒక మామిడి పండు వుందనుకోండి ఆ మామిడిపండు పైన తొక్క, లోపల పీచు, టెంక రసం వుంటుంది. ఇందంతా కలిపితే మామిడిపండు అవుతుంది. ఆ పండు లాంటి వాడు ఈశ్వరుడు. కాని ఆ మామిడి పండులో వున్న రసమే గురు రూపం దాల్చి వస్తుందటండి. అందుచేత ఆ దయ తప్పించి ఇంక ఏం వుండదు. అంటే మీరు ఏదైనా పొరపాటు చేస్తే దేవుడు శపించవచ్చు కాని గురువు శపించడు. ఒకవేళ శపించడానికి తగిన కారణాలు వున్నా ఆ కారణాలలోనించి నిన్ను విడుదల చేస్తాడు. అంటే దీని అర్థం ఈశ్వరుడి కంటే అగ్రస్థానం యిచ్చాడు గురువుకి.

ఈశ్వరుడు జడ్జిమెంటు రాస్తాడు కాని గురువు జడ్జిమెంటు రాయడు. నిన్ను దేహబుద్ధిలోంచి విడుదల చేసే ప్రయత్నం తప్పించి జడ్జిమెంటు జోలికి వెళ్ళనేవెళ్ళడు. ఈశ్వరుడిలో శిక్షించే స్వభావం వుండవచ్చు. కాని గురువు చేసే పని నిన్ను పరిశుద్ధం చేయటం, వస్తువు గురించి బోధించటం ఆ అమృతానుభవం పొందటానికి నీకు ఏ బలహీనలతలు అడ్డువస్తున్నాయో వాటిని బయటకు లాగి కాల్చి బూడిద చేసే పనికూడా గురువే చేస్తాడు. నీలో చెడ్డను చూస్తుంటాడు. అది నీకు తెలియకుండా తీసివేస్తాడు. ఇది గురువు చేసే సర్జరీ. గురువు చేసే సర్జరీలో నీ ముఖం కూడా నలగకుండా చేస్తాడు.

సాధన పేరు మీద మీకు కష్టాలు పెంచడు, బాధలు పెంచడు, నిన్ను దేహ వాసన, శాస్త్రవాసన, లోక వాసన వచ్చి తడుతున్నప్పటికీ దానిని నిరోధించే శక్తిని కలుగచేస్తాడు. నీ మనస్సుకి మనో నిరోధం ఎప్పుడైతే కలిగిందో అది లోపలికి పోతుంది. బయటనుంచి వచ్చే వాటిని నిరోధించే శక్తిని నీకు గురువు కలుగచేస్తాడు.

నీ మనస్సుకి ఎప్పుడైతే నిరోధం కలిగిందో నీవు దుఃఖానికి దూరం అయ్యిపోతావు. అంటే ఏ విషయాలూ నిన్ను తాకవు. ప్రపంచంలో ఎన్ని ఉన్నప్పటికీ ఎన్ని ఆకర్షణలువున్నా నిరోధించేశక్తిని మనస్సుకి గురువు యిస్తాడు. నీ బలహీనమైన మనస్సుకు బలానిచ్చి లోపలికి పంపించి ఆ వస్తువు దగ్గరకు నిన్ను తీసుకుపోతాడు.

ఒక భక్తుడు భగవాన్‌ని అడిగాడు గురువు మౌనం యొక్క ప్రభావం శిష్యుని యొక్క హృదయంలో ప్రక్కవాడికి కూడా తెలియకుండా చొచ్చుకుపోతుందని మీరు చెప్పారు. దానికి భగవాన్ చెబుతున్నారు : మాటలు కంటే మౌనం ఎక్కువ శక్తివంతమైనది. తీగలో విద్యుత్ శక్తి ఎలా ప్రవహిస్తుందో మౌనంలో ఆత్మశక్తి అలా ప్రవహిస్తుంది.

మౌనం అనేది నిరంతర భాషాస్రవంతి నదిలో నీరు ఏ విధంగా ప్రవహిస్తుందో మౌనంలో భాషాస్రవంతి అలా ప్రవహిస్తుంది. కొన్ని సంవత్సరాలు తరబడి బోధించిన అర్థంకాని సాధకులకు గురువు యొక్క మౌనం ఒక్క క్షణంలో హృదయంలోవున్న వస్తువును స్ఫురింపచేస్తుంది. ఒక మహాత్ముడి మాట విన్నారు అనుకోండి, అది ఎప్పుడైనా జ్ఞాపకం వస్తుంది. ఆ జ్ఞాపకం కూడా నీ మనస్సును ఎంతో శుద్ధపరుస్తుంది.

దక్షిణామూర్తికూడా అంతా మౌనంతోనే బోధించాడు. దక్షిణామూర్తి మౌనం వాళ్ళకి అర్థం అయ్యిందంటే అడ్వాన్స్‌డ్ సోల్స్, మెచ్యూరిటీ సోల్స్, అంటే పరిపక్వత పొందినవారు కాబట్టి ఆ మౌనం అర్థం అయ్యింది. గురువు సమక్షంలో జరగవల్సింది జరిగిపోతుంది. దానినే ఆటోమేటిక్ డివైన్ యాక్షన్ అంటారు. అంటే జ్ఞాని సంకల్పించనక్కర్లేదు. సంకల్పించకుండానే ఆ పని అక్కడ జరిగిపోతుంది. ఈశ్వరుడు రాముడు క్రింద, కృష్ణుడు క్రింద జన్మించారంటే కారణం జన్మించకపోతే ఆయన వైభవం మనకు తెలీదు.

రమణ మహర్షిగారు శరీరం ధరించారు, ఈశ్వరుడే శరీరం ధరించి వచ్చాడు కాబట్టి రమణుని వైభవం మనకు తెలుస్తుంది. ఈశ్వరుడు శరీరం ధరించి రాకపోతే ఈశ్వరుని వైభవం మనకు తెలీదు. మనం జ్ఞానులు దగ్గరకు సరదాగా వెళ్ళితే మంచిదే. నిప్పు వుందనుకోండి సరదాగా ముట్టుకుంటే కాలుతుంది. అది దాని స్వభావం. భక్తుడు భగవాన్‌ని అడుగుతున్నాడు గురువు అనేవాడు శరీరంగానే వుండాలా! లేకపోతే గురువు పనిచేయడా అని ! ఇప్పుడు మీ శరీరం వుంది కనుక మీ అనుగ్రహం తెలుస్తుంది. శరీరం లేకపోతే మీ అనుగ్రహం వుండదా అంటే భగవాన్ అన్నారు శరీరం ఎవర్నీ ప్రేమించదే మరణించేది శరీరం నిన్ను ఎవరైతే ప్రేమిస్తున్నారో ఆ ప్రేమించే వస్తువుకి చావులేదు.

గురువంటే కేవలం కళ్ళకు కన్పించే శరీరంకాదు. గురువు శరీరం పడిపోయిన తరువాతకూడా నీతో అనుబంధం తెగిపోతుందని నీవు అనుకోవద్దు. అవసరమైతే నీ ఒక్కడికోసం శరీరం ధరించి వస్తాడు. నీ గురువు ఎవరన్నది నీకు ముఖ్యంకాదు. నీ గురువుమీద మనస్సు నిలబడాలి. నీవు బాగుపడాలి. నీ హృదయంలో వున్న శాంతి నీ చేతికి అందాలి.

నీ తల్లిదండ్రులు నీకు అన్నం పెడతారు, బట్టలు యిస్తారు, బంగారం యిస్తారు, కాని నీ హృదయంలో వున్న ఆనందాన్ని నీకు ఇవ్వలేరు. అది ఒక్క గురువుకే సాధ్యం. పరమేశ్వరుడు ఎక్కడ వున్నాడో అక్కడకు నీ మనస్సును గురువు యొక్క మౌనం గెంటుకుపోతుంది. అందుచేత జ్ఞాని మాటలు కూడా మౌనానికి అంతరాయం. ఆ మౌన ధారలో, ఆ మౌన ప్రవాహంలో మాటలు నలకలు లాంటివి. పరిపూర్ణమైన ఉపదేశం మౌనం. అందులో కొరతలేదు. గురువు శరీరం ఉన్నంతసేపు శరీర మర్యాదలనుబట్టి దూరంగా కూర్చోవాలి. శరీరం పోయిన తర్వాత మన ప్రాణానికి ప్రాణమైన మన మనస్సుకి మనస్సై ఆత్మలకు ఆత్మై మనక ఇంకా సన్నిహితంగా వుంటాడు. గురువు యొక్క అనుగ్రహంలేదు అనుకోకండి. మీకు అందటం లేదనుకోండి దానిని గుర్తించే శక్తి మీకు లేదనుకోండి. దానిని గుర్తించడానికి మనం రిజర్వు కాలేదు. నువ్వు హిమాలయాలకు వెళ్ళి తపస్సు చేసి ఏ వస్తువునైతే పొందుదామను కుంటున్నావో గురువు యొక్క మౌనం ఆ వస్తువును పట్టి ఇస్తుంది. గురువు యొక్క శక్తి అట్టిది. ఆ స్పర్శ ఎలా వుంటుందంటే ఈ చేయి ఇంకో చేయిని తాకితే ఎంత స్పష్టంగా తెలుస్తుందో నీకు లోచూపు వుంటే ఆ గురువు యొక్క అనుగ్రహ స్పర్శ అంతస్పష్టంగా తెలుస్తుంది. గురువు అనుగ్రహం నీ మనస్సుకు సమాధిస్థితి కలిగేవరకు వెంటాడుతూ వుంటుంది. నీ మనస్సును సూక్ష్మాతి సూక్ష్మంచేస్తుంది. గురువు అనుగ్రహంలో పడ్డవాడికి క్షోభ వుండదు. వాడిని రాగ, ద్వేషాలు బాధించవు,

వాడి యింద్రియాలు క్షోభపెట్టవు, వాడు కాలిపోయినా తాడులా అయ్యిపోతాడు.

గురువు మీద మీకు ఇష్టంవున్నా అయిష్టంవున్నా గురువు చేసే పని మానడు. ఉదా :- బిడ్డకు స్నానం చేయించేటప్పుడు ఏడుస్తాడు, అలాగని వాడికి స్నానంచేయించటం మానం. స్నానం చేయించి, తుడిచి బట్టలు వేస్తారు. అదే విధంగా మీ మనస్సును తడిగుడ్డను పిండినట్లు పిండుతాడు మనలో వున్న వాసనలు కాలే వరకు మిమ్మల్ని బాధపెట్టడానికి కాదు. మీ చైతన్య స్థాయి పెంచటానికి. హృదయంలోకి తీసుకువెళ్ళటానికి, నీకు జ్ఞాని సన్నిధిలో వున్న వైభవం నీ సత్కర్మల వల్ల రాదు. అంటే నువ్వు చేసే సత్కర్మకంటే జ్ఞాని సమక్షం బలీయమైనది. అసలు నీకు సత్పురుషుల సహవాసం దొరికితే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందుతావు. ఆ జ్ఞాని మనతో మాట్లాడటంలేదు మన వంక చూడటంలేదు అని అనుకోవక్కర్లేదు, ఈ చూడటాలు, తాకటాలు, ఈ బోధనలు ఇవన్నీ మౌనంలోనే జరిగిపోతాయి. కాని మాట చెబితే టీచింగ్ మౌనం గ్రేట్ టీచింగ్. గురువు మాట నీలో అజ్ఞానమనే చీకటిని అటుఇటు కదపవచ్చు. కాని మౌనం అలాకాదు. నీలో వున్న చీకటిని రంపంపెట్టి కోసినట్లు కోసుకుంటూ వెళ్ళిపోతుంది. గురువు చూపు రోకటి పోటు వంటిది. ఆ జ్ఞాన నేత్రం నిన్ను తరుముకుంటూవస్తుంది. ఈ జన్మలో కాకపోయినా వచ్చేజన్మలోనైనా నిన్ను పవిత్రుడ్నిచేయడానికి ఆ చూపు నిన్ను తరుముకుంటూ వస్తుంది. అది జ్ఞాన నేత్రంలోనుంచి వచ్చిన చూపు. ఆ అగ్ని కిరణాలు నీ అజ్ఞానాన్ని భస్మంచేసే వరకు విష్ణుచక్రం వెంటాడినట్లు నిన్ను వెంటాడుతాడు. నువ్వు ఎక్కడవున్నా ఏ జన్మలో వున్నా ఒక విధంగా కాదు అన్ని విధములుగా ఒక కోణం లోంచికాదు అన్ని కోణాల్లోంచి పరిశుద్ధుడ్నిచేసి విడిచిపెడుతుంది. మన మాట మనచేత మన భావన

తదనుగుణంగా వుండాలి. అందుచేత నువ్వు ఎలా మాట్లాడితే ముగ్గుతావో ఎటువంటి ఆలోచనలు వస్తే ముగ్గుతావో ఎటువంటి గ్రంథాలు చదివితే ముగ్గుతావో అది చూచుకుని ముగ్గవయ్యా! అప్పుడు నువ్వు మామిడిపండు రంగు వచ్చేస్తావు. లోపల బయట కూడా ముగ్గిపోతావు. నీ చర్మం కూడా మామిడి పండు రంగులోకి వచ్చేస్తుంది. నీవు ఆలాపక్వానికి వచ్చాకే నీలో చేదుతనం, పుల్లతనం ఏం వుండదు. అపుడు నీవు ఆత్మానుభవం పొందడానికి ఫిట్ అవుతావు. అక్కడవరకు గురువు యొక్క మౌనం నిన్ను తరుముతూనే వుంటుంది.

జ్ఞాని మాట్లాడుతుంటే సత్యం మాట్లాడుతుంది. జ్ఞాని నడుస్తుంటే సత్యం నడుస్తుంది. జ్ఞాని చూస్తుంటే నీ హృదయంలో వున్న సత్యాన్నీ చూస్తుంటాడు. అతని చేష్టలన్నీ సత్యంలోనే వుంటాయి.

దేవుడు అవతరించినా అవతరించకపోయినా వున్నాడు. అవతరించని దేవునితో నీకు తాదాప్యం కుదరకపోతే అవతరించిన వాడితో తాదాప్యం పెట్టుకో. ఆ వస్తువు రూపం ధరించి వచ్చినపుడు ఆ రూపంతోటి తాదాప్యత పొందిన వాడిని ఆశ్రయించు. నీకు నిజం తెలియకపోయినా నీవు ఆశ్రయించిన దేవునికి నిజం తెలుసు వాళ్ళతో అనుబంధం వల్ల వాళ్ళకి సేవ చేయటం వల్ల ఆ వ్యక్తంకాని బ్రహ్మం దగ్గరకు మనల్ని మోసుకుపోతారు. పిల్లి తన పిల్లలను ఎక్కడికి వెళ్ళినా ఎలా మోసుకుపోతుందో అలా నిన్ను అభివ్యక్తంగాని వస్తువుదగ్గరకు మోసుకుపోతాడు.

నీ కంటిలోవున్న దోషం వల్ల వస్తువు నీకు కనిపించటంలేదు. కాని నువ్వు వస్తువే లేదు అనుకుంటున్నావు. ఇది చెప్పటానికి గురువు నీ దగ్గరికి వస్తాడు. సమాజంలో కనిపించే మనుషులపట్ల నీవు దయచూపిస్తే గురువు

తన దయను నీకు చూపిస్తాడు. ఆయన సర్వసాక్షి అన్నీ ఆయన చూస్తుంటాడు. నీవు చేసేపని మాట్లాడే మాట దయాపూరితంగా వుండాలి. అపుడు దేవుని కృప అడగనక్కర్లేదు. నువ్వు ఏ కరుణా భావంతో చేస్తున్నావో ఈశ్వరుడు చూస్తూనేవుంటాడు. తన దయను నీకు పంపిస్తాడు.

అసలు సత్యం దగ్గరికి మన కళ్ళు తెరిపించడానికి ఈ జ్ఞానులందరూ ఆలోకంలోంచి ఈ లోకంలోకి దిగి వస్తారు. కొంతమంది దీపం ఆరిపోతుంటే నూనెవేస్తారు. అదేవిధంగా ఈజ్ఞానదీపం ఆరిపోతుంటే ఈ మహాత్ములు, జ్ఞానులు వాళ్ళకి ఏపనీ లేకపోయిననూ ఈ భూమి మీదకు దిగివచ్చి ఆ జ్ఞానదీపం ఆరిపోయేటప్పుడు అది ఆరిపోకుండా కొంత చమురు పోసి బయటకు పోతారు. వారు జ్ఞానులు వాళ్ళకి సొంతపని అంటూ ఏమీలేదు. లోకకల్యాణమే. అంటే లోకం సుఖంగా వుంటే వాళ్ళకి సుఖంగా వున్నట్టుగా అనిపిస్తుంది. వాళ్ళకి సొంత సుఖం, సొంత దుఃఖం అంటూ ఏమీ వుండదు. మన శరీరంతోటి, బంధువులతోటి మనం ఎలా తాదాప్యం పొందుతున్నామో మొత్తం సృష్టి అంతటితోటి వాళ్ళు అలా తాదాప్యం పొందుతారు.

భక్తులు కొంతమంది భగవంతుడిని ప్రార్థిస్తారు ఓ ఈశ్వరుడా నా అంతట నేను ఒడ్డుకు రాలేకపోతున్నాను. ఈ రాగ, ద్వేషాలలోంచి, యిష్ట, అయిష్టంలోంచి బయట పడటానికి నాకు శక్తి సరిపోవడంలేదు అని ప్రార్థిస్థారు. అనుగ్రహం లేనిదే ఒడ్డుకు రాలేనని నెమ్మదిగా భక్తిని అభివృద్ధిచేసుకుంటారు నీవు శరణాగతి చెందినపుడు ఈశ్వరుడు మానవ శరీరం ధరించి నీకోసం వస్తాడు. ఆ ఈశ్వరుడే నిన్ను పవిత్రుడ్ని చేసి ఉద్ధరించడానికి మానవశరీరం ధరించి గురువుగా వస్తాడు. నీ భక్తి నిజమైతే నీ శరణాగతి వాడు గ్రహించి నోరులేకుండా బోధించలేడు కాబట్టి ఒక శరీరం ధరించి ఆయనే గురువుగా వచ్చి బోధిస్తాడు.

నువ్వు ఏ ఈశ్వరుణ్ణి అయితే పూజించుతావో జపాలు చేశావో, ధ్యానాలు చేశావో, గుడులు కట్టించావో, ప్రదక్షిణాలు చేశావో వీటికి కరిగిపోయి ఆయనకు అవసరం లేకపోయినా ఒక ఆకారం ధరించి ఒక పేరు పెట్టుకుని గురువుగా నిన్ను సమీపిస్తాడు. నీ జీవితం పూర్వజన్మల్లో ఎన్నో వంకరులు తిరిగి వచ్చినప్పటికీ ఆ ఈశ్వరుడు ఎప్పుడైతే నీకు దర్శనమిచ్చాడో నీ హృదయంలో సత్యవస్తువు గురించి బోధించి, బోధించి మౌనంగా ఆ వస్తువులో ఐక్యం చేస్తాడు అంతేకాదు నువ్వు ఎవరివో నీకు తెలియపరుస్తాడు. నువ్వు ఎవరివో నీకు తెలియపరచడమంటే నువ్వు అనుకునే నీ మనస్సు నువ్వు కాదని, నువ్వు అనుకునే నీ దేహం నీది కాదని నీవు ఏ వస్తువు అయివున్నావో అది నీ హృదయంలో ఉందని ఆ వస్తువు నువ్వు అయ్యేటట్లు తెలియపరుస్తాడు. ఇంతకాలం ఏ మనస్సుని కేంద్రంగా పెట్టుకుని అహంకారం కేంద్రంగా పెట్టుకుని జీవిస్తున్నావో దానియొక్క పునాదులు పడగొట్టి నీ మనస్సులోని వస్తువుతో నిన్ను తాదాప్యంచెందింపచేస్తాడు. మీరు చేసిన పుణ్యం, మీరు చేసిన పూజ నాకేమీ అక్కర్లేదు మీది మీకే ఇచ్చేస్తాను అని గీతలో కృష్ణుడు చెప్పాడు. ఇది మామూలుగా చెప్పటంకాదు ప్రతిజ్ఞచేసి చెబుతున్నాను అన్నాడు కృష్ణుడు.

ఒక వేళ ఈ శరీరంలో వుండగా ఆయన ఇచ్చే శక్తిని నువ్వు తట్టుకోలేకపోతే, అవసరం అయితే ఇంకో నాలుగు జన్మలు నీకోసం ఎదురుచూచి నీకు అర్హత యోగ్యత కలుగజేసి శరీరం కూడా నీడ ఎలా వస్తుందో నీకూడా నిన్ను వెంటాడి ఆయన స్వరూపం నీకు ఇచ్చే వరకు విడిచి పెట్టడు గురువు. మీరు చేసిన ప్రయత్నం ఊరికే పోదు. మీరు భగవదనుభవం పొందటం కోసం ప్రయత్నం చేశారనుకోండి కాని భగవదనుభవం మీకు రాలేదనుకోండి చేసిన ప్రయత్నం మాత్రం వ్యర్థం కాదు. ఈ గురువు ఏంచేస్తాడంటే ఈ జీవుడిని హృదయంలోకి

తీసుకువెళతాడు. అక్కడ నీ హృదయంలో ఎవరు వున్నారు? నువ్వే వున్నావు. ఎలా వున్నావు! ఆత్మగా వున్నావు, జ్ఞానంగా వున్నావు, వైకుంఠంగా వున్నావు, అక్కడికి నిన్ను తీసుకువెళ్ళేవరకు నీ గురువు విశ్రాంతి తీసుకోడు. అపుడు నీకు ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. వాడు గురువు.

రమణస్వామి అన్నారు ఆ లోపల వున్న వస్తువు నీ చేతికి దొరికాక గురువు ఎక్కడో వున్నాడు అనుకున్నాను, వైకుంఠంలో నారాయణుడు వున్నాడనుకున్నాను ఆ నారాయణుడు నా హృదయంలోనే వున్నాడు. నా యింద్రియాలకంటే, నా మనస్సుకంటే, నా బుద్ధికంటే , నా తలంపుకంటే అత్యంత సమీపంగా వున్నాడనే సంగతి వస్తువు అనుభవంలోనికి వచ్చాక తెలుస్తుంది. ఈ అనుభవం నాకు కలుగజేయటం కోసమే బయటనుండి వెంటాడే గురువు నా హృదయంలో వున్నాడు అనే సంగతి వస్తువు అనుభవం అయ్యిన తరువాత నీకు తెలుస్తుంది. ఇంతకంటే ఏం కావాలి! ఇంతకంటే టీచింగ్ మీకు ఏం స్పష్టతకావాలి? ఎల్.కె.జి వాళ్ళకి చెప్పినట్టు చెబుతున్నాడు ఇక్కడ భగవాన్ ఇంతకంటె ఏం కావాలి మీకు. భగవాన్‌తో తన స్నేహితుడు రంగన్ అన్నాడు బియ్యం నువ్వే తేవాలి, వంట సరుకులు నువ్వే తేవాలి పొయ్యి మీదకు నువ్వే తేవాలి, పొయ్యి క్రిందవి నువ్వే తేవాలి, వంటను నువ్వే చేయాలి, విస్తరి కూడా నువ్వే వెయ్యాలి అన్నీ నువ్వే వడ్డించాలి అని రంగన్ అంటే దానికి భగవాన్ అన్నారు అలాగే అన్నీ నేనే చేసేస్తాను విస్తరిలో నేనే వడ్డిస్తాను, వడ్డించడమే కాదు దానిని పిసికి, పిసికి చంటి పిల్లలకు నోట్లో పెట్టినట్లు నీ నోట్లో కూడా పెడతాను. కాని మింగటం అనే పని నువ్వు చెయ్యాలి. ఆ ఒక్క పని నువ్వు చేస్తే సరిపోతుంది. అది గురువు యొక్క ప్రేమ. భగవాన్ అనేవారు పూర్వ జన్మలో ఏ సంబంధం లేకుండానే మనం ఇక్కడ కల్సుకున్నామా ఈ సంబంధం మనల్ని మరొకచోట కలపదా!

గురువు సమక్షంలో కూర్చున్న వారికి ఎవరికన్నా శారీరకంగా అనారోగ్యంగా వున్నా ఆ గురుస్వామి చెప్పే వాణి కనుక మీరు శ్రద్ధగా వింటే మానసికంగా, శారీరకంగా ఉన్న అశాంతి చల్లారిపోతుంది. మనస్సులో వున్న బాధ చల్లారిపోతుంది. మీ శరీరంలో అశాంతి వుండవచ్చు. కాని మనస్సు మటుకి శాంతితో నిండిపోతారు అదే గురుస్వామి నీకు ఇచ్చే అనుగ్రహం. అందుచేత ఎప్పుడో వైకుంఠంలో ఏ అంతస్థు పొందుదామనుకుంటున్నారో ఆ అంతస్థు ఇక్కడే ఇచ్చేస్తాడు వాడే గురువు. ఏం సుప్రీంగా చెబుతున్నాడో చూడండి వాడే గురువు. జీవుడిని గురువు ఎక్కడికి తోలుకుపోతున్నాడంటే నీకు శరీరం వున్నా ఈ శరీరం నీవు కాదని స్పష్టంగా తెలుస్తూవుంటుంది. లోకం కనిపిస్తున్న దానితో అనుబంధం లేకుండా ఏదైతే మీరు అయివున్నారో ఆ వస్తువు మీరే అని స్పష్టంగా తెలుస్తుంది. శరీరం వున్నా, శరీరం చనిపోయినా, శరీరం భూమిమీద తిరుగాడుతున్న లోకం కన్పించినా, కనిపించకపోయినా ఒకలాగే వుంటారు. ఆ స్థితిని మీ గురువు ఇక్కడే ఇప్పుడే మిమ్మల్ని ఆయనచేతులతో అనుగ్రహిస్తాడు.

భక్తులు గురువుని ఎంత ప్రేమిస్తున్నారో అంతకంటే ఎక్కువ గురువు భక్తుల్ని ప్రేమిస్తాడు. అంటే మీ శరీరాన్ని మీరు ఎలా చూచుకుంటున్నారో భక్తుడి శరీరాన్ని గురువు తన శరీరంగా చూచుకుంటాడు. శివుడు కంటే గొప్పవాడు గురువు. చెఱకుగెడ కంటే చెఱుకుగెడలోని రసం గొప్పది శివుడు చెఱుకుగెడ అయితే ఆ గెడలో వున్న రసం గురువు.

భగవంతుడు ఈ జీవుడు చేసిన పాపాన్ని, పుణ్యాన్ని చూడవచ్చు. కాని గురువు చూడడు. రామకృష్ణులు ఎవరి గురించో ఇలా అన్నారు. పదిమంది కూర్చునివుండగా అతను చాలా మంచివాడని సహృదయం వున్నవాడని ఎవరిగురించో చెబుతున్నాడు అంతలో అందులో ఒకతను ఇలా అన్నాడు.

స్వామీ అతను చాలా మంచివాడని మీరు చెబుతున్నారు అతడు సారా త్రాగుతాడు అని రామకృష్ణునితో చెప్పాడు. రామకృష్ణుడు అన్నాడు వాడు సారా త్రాగుతుంటే త్రాగవచ్చు, కాని సహృదయం వున్నవాడే. నాకు వాడిమీద వున్న ప్రేమ వాడి త్రాగుడును మాన్పిస్తుంది వాడు గురువు పొరపాట్లు వుంటే సరిచేస్తాడు. దైవం శిక్షించవచ్చు. గురువు శిక్షించకుండా మన పొరపాట్లను సరిచేస్తాడు. ఇపుడు గురువు గొప్పవాడా! దేవుడు గొప్పవాడా! దేవుడు పుణ్యానికి పుణ్య ఫలితం, పాపానికి పాప ఫలితం యిస్తాడు. దేవుడు అంటే కర్మఫలదాత. కాని గురువు అలాకాదే. శివుడు దేవుడు అయితే శివుడిలో వున్న ఆప్యాయత, కరుణ, గురువు, దేవుడు తీర్పు చెబుతాడు. గురువు తీర్పు చెప్పటం కాదు ఏ కారణం వల్ల మనస్సు బాహ్యముఖానికి వెళ్తుందో ఆ కారణాన్ని వాడుమింగివేయడానికి చూస్తాడు. మీరు మామూలుగా దేహాన్ని మనస్సును శిక్షించకపోతే మీ వాసనలు మీరు పిండకపోతే ఏ కోరికలు అయితే బాహ్యముఖం చేస్తున్నాయో వాటిని పిండకపోతే సత్పురుషులు యొక్క సహవాసం చేయండి. దేహ వాసన, లోకవాసన, శాస్త్రవాసన మొత్తం సమస్త వాసనలు సత్పుర్షులు యొక్క సహవాసంతో ఊడిపోతాయి. ఆ వస్తువును డైరెక్టుగా పొందినవాడి దగ్గరనుండి వచ్చే జ్ఞానతరంగాలు ఆ శక్తి తరంగాలతోటి పోల్చడానికి ఏదీసరికాదు. నీకు సత్పురుషుల సహవాసం దొరికినపుడు ఇతర నియమాలతో పనిలేదు ఆ చైతన్యం మనకు స్వరూపంగా వ్యక్తం అయ్యేవరకు ఎవడు అయితే విడిచిపెట్టడో వాడు గురువు.

" కుత్ర అంతయు కోసి గుణముగ పాలించి"

"గురురూపమై వెలుగు అరుణాచలా"

అన్నారు భగవాన్. చెడ్డగుణాలు అన్నీ తొలగించి మంచి గుణాలతో నన్ను అలంకరించు అరుణాచలా అంటే ఇక్కడ గురువు అవసరమే అని

చెప్పకుండా చెప్పటం. భగవాన్ బాహ్యంగా గురువు లేదు కాని ఆయనకూడా గురువు యొక్క ప్రాముఖ్యత చెప్పటం కోసం నువ్వు గురువుగా నన్ను గైడు చెయ్యి. నాకు మార్గదర్శిగా వుండు. నన్ను తరింపచెయ్యి అరుణాచలా! బేధబుద్ధి వుందికనుక అది చెబుతుంది అంటే నీకు దేహంతో వున్న గురువు కావాలని చెబుతుంది. చెప్పేది మిధ్యా. నేను, వాడు అన్వేషణ ప్రారంభిస్తాడు. లోపల వున్న వస్తువు ఏమిటి పాపం మనం లోపలే వున్నాం మిధ్యా నేను మొదట్లోనే వున్నాం నాలోంచే ఈ మిధ్యా నేను వస్తోంది అది దేహంతో తాదాప్యం పొందటం వల్ల ఇంకొక గురువు కోసం వెతుకుతుంది అని లోపల వున్న వస్తువు మన మీద జాలిపడి కాళ్ళు, చేతులు తొడుక్కుని వస్తుందటండీ! అదే గురువటండి.

గురువే వచ్చి ఏమి తెలియనట్లు కూర్చుంటాడటండి. కాని వాడు మనిషి క్రింద కనిపించినా వాడు బోధించేది ఆత్మగురించే, వాడు బోధించేది సత్యం గురించే, వాడు బోధించేది జ్ఞానం గురించే, వాడు సత్యం కాబట్టి జ్ఞానం కాబట్టి బ్రహ్మం కాబట్టి దాని గురించే బోధిస్తాడు.

ఆ మహాగురువు వాడు కాళ్ళుచూచినా, చేతులు చూచినా కొంత కాలానికి ఆత్మక్రిందే కనిపిస్తాయి. వాడి దేహం కూడా ఆత్మేఅని నీకు స్ఫురిస్తుంది. వాడు ఆత్మగురించి మాట్లాడుతుంటే గురువు యొక్క దేహం ఆత్మే అని నీకు స్ఫురిస్తుంది.

గురువు సత్యం కాబట్టి వాడు సత్యాన్నే బోధిస్తాడు. వాడు ఆత్మేకాబట్టి నీకు ఆత్మ గురించే బోధిస్తాడు. వాడు బోధించగా, బోధించగా నాలోపల వుంది అంటున్నారు అని లోచూపు ప్రారంభిస్తాడు. నీకు తెలియదు నీకు లోచూపు కలుగుతుంది అంటే నీకు టీచ్ చేసేవాడు, ఆ టీచింగ్ పట్ల నీకు ఆకర్షణ కలుగచేసేవాడు, నీకు లోచూపు కలుగచేసేవాడు అన్ని పనులు

గురువే చేసుకువెళ్ళిపోతాడు. నీ లోపల బుద్ధి సూక్ష్మత అవ్వటం కోసం ఎవడైతే సహాయం చేస్తున్నాడో వాడే పరమ గురువు. గురువులకు గురువు ఎవడు దక్షిణామూర్తి. దక్షిణామూర్తి మౌనంగా కూర్చున్నాడు. అంటే సూక్ష్మదృష్టి వున్నవారికి మౌనం యొక్క ఉపదేశం అందుతుంది. స్థూలదృష్టి వున్నవారికి మాటకావాలి. అందుకే గురువు మాట చెబుతాడు. లేకపోతే ఆ మాట కూడా అవసరం లేదు. ఆ గురువు చెప్పే మాట జ్ఞానం ఆ చూపు జ్ఞానం, స్పర్శ జ్ఞానం, ఆ కదలిక జ్ఞానం అంతేకాదు ఆ దేహం అంతా జ్ఞానమే.

ఎవరిని చూచి మనకు ఆకర్షణ, గౌరవం కలుగుతుందో, ఎవరి ముఖం చూస్తుంటే మనకు జ్ఞానం కలుగుతుందో వారిని లోకం భగవంతునితో సమానంగా ఆరాధిస్తారటండి! ఎందుచేత భగవంతునితో సమానంగా ఆరాధిస్తారంటే భగవంతునియొక్క స్వరూపాన్ని వాళ్ళ దయవల్ల అనుగ్రహించారు కాబట్టి.

నువ్వు అపచారం చేసిన గురువు చెప్పినట్టు నడుచుకోలేకపోయిన గురువుకి కోపం రాదయ్యా నిన్ను సరిదిద్దటానికే ప్రయాణం చేస్తుంటాడు. గురువు నీవు ఏదైనా పొరపాటు చేసినా క్షమించటమే కాదు క్షమించి నీ కూడా తిరిగి నీవు పడే బాధలను వాడుకూడా పడి నీ తల్లిచేయని పని, నీ తండ్రిచేయలేని పని నీ బంధువులు చేయలేని పని గురువు ఏ స్థితిలో వున్నాడో ఆ స్థితిని నీవు పొందే వరకు వెంటాడుతాడు. గురువు స్వరూపమే క్షమఅటండి ఎలాగ వీడిని సరిదిద్దాలి నీవు తప్పిపోయిన గొఱ్ఱెలాంటివాడు. ఈ గొఱ్ఱెను ఎలా కాయాలి మనం ఈ సుఖాన్ని ఈ శాంతిని ఎలా వ్యక్తం చెయ్యాలి అని వాడి గురించి తపిస్తూనే వుంటాడు. కాని వాడి మీద ఆగ్రహం చూపించడు. ఎప్పుడైనా ఆగ్రహం వచ్చినా అనుగ్రహమే

ఆగ్రహంగా వస్తుందటండి నిన్ను సరిదిద్దటానికి, అందుచేత నిన్ను భగవంతుడు విడిచిపెట్టినా గురువు విడిచిపెట్టడు. నిన్ను సరిదిద్దుతూనే వుంటాడు.

గురువు మీద ప్రేమ కలగటంకోసం నీకు పుష్కలమైన ప్రేమ ఇస్తుంటాడు. నోటితో వర్ణించలేని ప్రేమను నీకు ఇస్తుంటాడు. ఆ ప్రేమ యొక్క రుచిని చూపించి ఆయనపట్ల నిన్ను ఆకర్షించుకున్నాడంటే ఆయన చెప్పిన జ్ఞానాన్ని నువ్వు వినటంకోసం.

"గురురూపమైనట్టి కరుణాసముద్రమా"
"కృపచేసి మమ్మేలుము అరుణాచలా"

నీవు ఆ గురువు రూపాన్ని ధ్యాన్యం చేసుకుంటుంటే ఆ గురువు నామాన్ని స్మరించుకుంటుంటే నీకు నిజం తెలియకపోయినా ఆగురువుకి నిజమేదో తెలుస్తుంటుంది. అందుచేత ఎక్కడికి తీసుకువెళ్ళాలో గురువుకి తెలుస్తుంటుంది.

గురువు యొక్క కటాక్షం ఏం చేస్తుందంటే ఒక నిశ్చలస్థితిలో, నిర్మల స్థితి, నిరాడంబర స్థితి అనుగ్రహం యొక్క వేగం కలుగజేస్తుంది. కాని రవ్వంత, ముల్లంత, చింతాకంత విశ్వాసం అయినా గురువుమీద వుండాలి.

మీ గురువుని మీరు స్మరించగా, స్మరించగా ఆ పాదాలను ధ్యానించగా, ధ్యానించగా మీ ఆధ్యాత్మిక స్థాయి మీకు తెలియకుండా పెరుగుతూ వుంటుంది. మీకు గురువు పట్ల ఇష్టం వుండాలి. ప్రేమ వుండాలి. ఆప్యాయత వుండాలి. అక్కడ మనస్సు నిలబడాలి. అది చాలా ముఖ్యం ఇదంతా ద్వైతమే ఈ ద్వైతం అద్వైతానుభవం తీసుకురావడానికి సహకరిస్తుంది. అద్వైతానుభవంలో కాని అమృతానుభవం కలుగదు.

గురువు పట్ల భక్తి ఎలా వుండాలంటే ఉద్దవుడికి కృష్ణునిపట్ల ఎంత భక్తి వుందో అటువంటి భక్తి వుండాలి. ఉద్దవుడి హృదయం కృష్ణుడికి తెలుసు , కృష్ణుడి హృదయం ఉద్దవుడికి తెలుసు, ఒకరి హృదయం ఒకరికి తెలుసు. ఇద్దరి హృదయాలు ఒక్కటే అటువంటి భక్తి మీకు గురువు పట్ల కుదిరినపుడు మనం మోక్షాన్ని కోరుకోనక్కర్లేదు దానంతట అదే వస్తుంది.

శ్రీకృష్ణ చైతన్యుడు కృష్ణుడితోటి అంటాడు కృష్ణా, దేహం వుందా, లేదా అన్నది ముఖ్యంకాదు ఒక వేళ దేహం పోయినా నీ మీద భక్తి చెడిపోకూడదు దేహం వున్నా, లేకపోయినా నా లోపల వున్న జీవుడు ఎప్పుడూ నీ పాదాలనే ఆశ్రయించి వుండాలి. దేహం వుందా, లేదా అన్నది ప్రధానం కాదు. దేహం వుందనుకో నా మనస్సు నీ పాదాలను అంటిపెట్టుకుని వుండదనుకో నేనేమిచేసుకుంటాను ఈ దేహాన్ని . నా మనస్సు నీ పాదాలను ఆశ్రయించి వుండాలి అదే నేను కోరుకునేది.

కృష్ణా నీ మీద నాకు ఎంత ప్రేమ వుండాలంటే ఎముకలు కూడా శేషం లేకుండా కరిగిపపోవాలయ్యా! ఎముకలు కరిగించే ప్రేమ కలిగేటట్లు నన్ను ఆశీర్వదించు. నువ్వు కావాలి, కాని నువ్వు కల్పించిన లోకాలు నాకు అక్కర్లేదు. అవి మాయాలోకాలు. కృష్ణా! నువ్వు అంతర్యామిగా వున్నావు. నాకు యజమానిగా వున్నావు. కృష్ణా నువ్వు ఎవడివో తెలియనపుడు కదా నేను ఈ లోకాలు కోరుకునేది. నీ యందే కల్పించబడ్డాయి ఈ లోకాలన్నీ కూడా, అటువంటి భక్తి నీకు గురువుపట్ల వుండాలి.

ఒక్క ఆత్మానుభవం పొందినవాడు ఆత్మసుఖం పొందినవాడు మాత్రమే జ్ఞానికాదు. నాకు భగవంతుడే కావాలి ఏమీ అక్కర్లేదని చెప్పేవాడుకూడా జ్ఞానితో సమానం. వాడు కూడా మనకు పూజ్యనీయుడు. నమస్కరింప

దగినవాడు. భగవంతుడేకావాలి నాకు దేనితోనూ నిమిత్తంలేదు. నాకు భగవదనుభవం ఒక్కటే కావాలి. అనుకున్నవాడు కూడా జ్ఞానితో సమానం. అది నిజమైన భక్తుడి లక్షణం. అలాగ నీవు గురువుని ప్రేమించటం వల్ల గురువును ధ్యానించడం వల్ల నీ ఆధ్యాత్మిక అంతస్థు నీకు తెలియకుండానే పెరుగుతుంది. మనందరికంటే మన శ్రేయస్సు ఎవరుకోరుకుంటారు. మన హితవు కోరుకునేవాడే గురువు. మన నిజమైన స్నేహితుడు కూడా గురువే. నీకు బండెడు దుఃఖం వుందనుకో కంగారుపడకు. ఆ బండెడు దుఃఖంతోటి నువ్వు శరణాగతి చెందావనుకో గురువు ఏం చేస్తాడంటే చెప్పమంటావా నీ బండెడు దుఃఖాన్ని బండెడు ఆనందంగా మార్చివేస్తాడు.

ఆయన సర్వజ్ఞుడు. అంతా ఆయనకే విడిచిపెట్టు ఆ భారమంతా ఆయనదే ఒక వేళ ఏదైనా బెంగ వచ్చిందనుకో ఆ బెంగ నీకు కష్టంగా వుందనుకో నువ్వు బెంగపెట్టుకోవటం మానివెయ్యి. గురువు నీ కోసం బెంగపెట్టుకుంటాడు. నీ బెంగ పోతుందేమోనని కంగారుపడకు. అవసరమైతే నీ కోసం గురువు బెంగ పెట్టుకుంటాడు. ఆ స్థాయికి నీవు రావాలి.

మీ గురించి మీరు బెంగపెట్టుకున్నారనుకోండి మీ గురించి ఇంక ఆయన బెంగపెట్టుకోడు. మీ భక్తికి ఎంత మెచ్యూరిటి రావాలంటే ఆయనే మీ గురించి బెంగపెట్టుకునేలాగ నువ్వు సరెండర్ అవ్వాలి. అదే భక్తి, అదే జ్ఞానం, అదే శరణాగతి అంతా ఆయనే. మనం ఆ గురువు గురించి గంటల తరబడి ఆలోచిస్తాం అనుకోండి దానికంటే ఒక్కసారి ఆ గురువు నిన్ను ఎలావుంది? ఏమిచేస్తోందో? ఎక్కడ వుందో అని ఒక్క క్షణం నీ గురించి ఆలోచించాడు అనుకోండి చాలు. నీ జీవితం పూర్తయిపోయినట్లు. నీ శరీరం ఎక్కడ వున్నా గురువును స్మరించగా, ఆ గురువును ప్రేమించగా,

గురువు పట్ల పూజ్య భావం కనుక వుంటే అది ఏమౌతుందంటే నిజం నీ లోపల స్వరూపంగానే వుంది. ఒక్కసారి ఎప్పుడో గురువు యొక్క అనుగ్రహం వల్ల తళుక్కున మెరుస్తుంది. నీ స్వరూపం నీకు వ్యక్తమవుతుంది. ఆ లోపల వున్న వస్తువు నీకు వ్యక్తం అవ్వటానికే గురువు యొక్క సన్నిధి. అంటే వాళ్ళ సన్నిధిలో వారితో సంభాషించడం వల్ల అవ్యక్తంగా వున్న వస్తువు, మనకు గోచరిస్తుంది. కొంతమంది గురువులు మాట్లాడరు, ఆత్మగా వున్నప్పుడు మాటలతో పనిలేదు. వారు ఆత్మగా వుంటారు. అలా వుండటమే చాలు. నీకు ఎంతో అపారమైన జ్ఞానసంపద కలుగుతుంది. ఆ వెలుగును గోచరింపచేయటమే గురువు యొక్క పని.

ఏ వస్తువు కోసం నీవు పూజలు, జపాలు, యజ్ఞాలు, యాగాలు చేస్తున్నావో, ఏవస్తువు కోసం నువ్వు పవిత్రుడు అవ్వటం కోసం చేస్తున్నావో గురువు ఆ వస్తువైయున్నాడు. అలా అయి వున్నవాడి ఒక మాట చాలు, ఒక చూపు చాలు, నీ మనస్సులోపల్కి వెళ్ళటానికి నీ దేహబుద్ధిని తొలగించడానికే ప్రయత్నం చేస్తాడు. గురువు ఇంకొకటి చేస్తాడు. మీకు ఎవరైతే ఇష్టమో వారితో తిట్టిస్తుంటాడు ఒకోసారి. ఎందుచేతనంటే వాళ్ళని మీ హృదయంలో మోస్తుంటారు. ఇంక అక్కడ మీరు దేనికీ స్థానం ఇవ్వరు. ఆమోత తగ్గించడం కోసం వాళ్ళచేత తిట్టిస్తాడు మిమ్మల్ని. ఆ నాలుగు మొట్టికాయలు పడితేనే కాని మోత ఆగదు మీకు.

ఏ సమయంలో నిన్ను తలుపుసందున పెట్టి నొక్కాలో నీ లోపల ఉన్న అజ్ఞానాన్ని ఎలా కక్కించాలో దాని కోసం ఎదురుచూస్తాడు. కాలగర్భంలో ఆ టైం వచ్చేసరికి లోపల వున్న అజ్ఞానాన్ని కక్కిస్తాడు నీచేత. ఆ దేహబుద్ధిని తొలగించటం కోసం ఆ అదునుకోసం చూస్తుంటాడు. నీ లోపల ఎంతవరకు పక్వానికి వచ్చావో లోపల నుంచి గైడుచేస్తాడు.

నీ యింద్రియాలు ఐదే కాని ఆరవ యింద్రియం కూడా ఇస్తాడు గురువు. గురువు అనుగ్రహం వల్ల చాలా దూరం చూడగలుగుతావు. ఒక్కోసారి మీరు నడిచి వెళుతున్నారు అనుకోండి మిమ్మల్ని తప్పించుకుని వెళ్ళిపోతాడుమీరు ఎవరో తెలియనట్లు మిమ్మల్ని దాటించుకుని వెళ్ళిపోతాడు. మిమ్మల్ని పలకరించడు  అసలు మీరెవరో తెలియనట్లు వెళ్ళిపోతుంటాడు. గురువు ఎన్ని చేసినా, గురువు మాట్లాడినా, మాట్లాడకపోయినా, నీ వంక చూచినా, చూడకపోయినా ఇవన్నీ కూడా నీ మనస్సును పవిత్రం చేయడానికే అని గ్రహించినవాడు ధన్యుడు.

గురువు మౌనంకూడా బోధిస్తుంది. అంతేకాదు నీ సందేహాలను పోగొడుతుంది నీకు తెలియకుండానే ఆ రోజుకి ఆ రోజు నెమ్మదిగా, నెమ్మదిగా నీ దేహాభిమానాన్ని తగ్గించుకుంటూ వస్తాడు. గురువు ఏమీ పనిచేయటం లేదు అనుకుంటున్నావు. పనిచేస్తున్నాడు అల్లరిగా చెయ్యడు సైలెంటుగా చేస్తాడు.

నీకు దేహమే నేను అని బాగా పాతుకుపోయిన బుద్ధిని, అది పోయేటట్లుగా నిన్ను తరుముకుంటూ వస్తాడు. వాడు గురువయ్యా! మీరు గురువును ఒక పెద్ద చుట్టం అనుకోండి చాలు సరిపోతుంది.

చాకలి బట్టలు ఉతుకుతాడు. ఎందుకంటే ఆ బట్టలలో వున్న మురికి పోవడానికి. అలాగే గురువు కూడా మన మనస్సును ఉతుకుతాడు. ఎందుచేతనంటే అందులో మురికి పోవడానికి, బట్టలు శుభ్రం అవ్వటానికి ఎన్ని దెబ్బలు తింటాయో మన మనస్సుని కూడా గురువు అన్ని దెబ్బలు కొడతాడు.

గురువు యొక్క అనుగ్రహం ఇట్టిది అని వర్ణించటానికి ఏ పుస్తకం సరిపోదు. గురువు యొక్క మౌనంను గురువు యొక్క శక్తిని ఎవడయ్యా వర్ణించగలడు. అది వర్ణణాతీతం, మాటకి అతీతం, రచనలకి అతీతం. ఆత్మ లేకుండా గురువు లేడు. గురువు యొక్క మౌనం విశ్రాంతి లేకుండా ప్రవహిస్తుంది. అది భాషాప్రవాహం. దానికి శబ్దాలతోటి పనిలేదు. మౌనాన్ని ఏదీ ఆటంకపరచలేదు. నదులు, సముద్రాలు, కొండలు, మౌనానికి ఏదీ అడ్డురాదు. వారితో సాంగత్యం మంచిది. అందుచేత ఒకటి మర్చిపోకు. నీ దేహం ఎక్కడ వున్నా ఆ గురువుని స్మరించటం మానకు.

నీ శరణాగతి నిజమైతే ఆ గురువు యొక్క అనుగ్రహం వర్షం రూపంలో కురుస్తుంటే ఆ గురువు యొక్క దయ, ఆ గురువు యొక్క ప్రేమ ఆ గురువు యొక్క వాత్సల్యం అలా కురుస్తుంటే మీ మీద ఊపిరిసలపదయ్యా, అట్టిదయ్యా గురువు అనుగ్రహం అంటే. నీకు ఎన్ని కష్టాలు వున్నా, ఎన్ని నష్టాలు వున్నా, ఎన్ని బాధలు వున్నా, ఎన్ని భారాలు వున్నా వూడిపోతాయి అనుగ్రహం వచ్చి మిమ్మల్ని ముంచినపుడు, మనకి వచ్చిన కష్టాలు చాలా తక్కువ వున్నాయి ఇంకావచ్చినా ఫర్వాలేదు అనిపిస్తుందటండీ. అంటే ఎన్ని కష్టాలు వచ్చినా నీకు ఏమీ అనిపించదు. అందుచేత గురువు యొక్క సహాయం నీకు అవసరమే.

గురువు అనుగ్రహం లేకుండా మోక్షలక్ష్మి మిమ్మల్ని వరించదు. అంటే ఆ మోక్షలక్ష్మి ఎపుడు గురువు ఒళ్ళోనే కూర్చుని వుంటుంది. గురువు ఎవరిని వరించమంటే వారిని వరిస్తుంది గురువు అనుగ్రహం వుంటే అంతా వచ్చేస్తుంది. నీ గురువుని మర్చిపోకు జ్ఞాపకం పెట్టుకో అది కూడా గొప్ప సాధనే.

ఒక భక్తుడు భగవాన్ అడుగుతున్నాడు! గురువు యొక్క కృప ఎలా వుంటుంది! ఆత్మసాక్షాత్కారానికి మార్గం ఎలా చూపిస్తుంది.

భగవాన్ చెబుతున్నారు. నిజమైన గురువు నీలోపలే వున్నాడు. లోపల ఆత్మగా వున్నాడు.

భక్తుడు ముందు భగవంతుడికోసం భగవంతుడిని ప్రార్థించడు. ఏవో కోరికలు కోసం ప్రార్థిస్తాడు. సర్వసాధారణంగా భక్తుడు నాకు జ్ఞానాన్ని ప్రసాదించు, వైరాగ్యాన్ని ప్రసాదించు అని భగవంతుడిని కోరడు. ఏవో ఆర్థికపరమైన ఇబ్బందులు వుంటాయి, అవి తీరాలి, ఇవి కావాలి అని కోరుకుంటూవుంటాడు. అది ఒక దశ భక్తిలోకూడా కొంత కాలానికి ఎందుకు ఈ వస్తువులు, నాకు నువ్వే కావాలి అని భగవంతుడిని కోరుకుంటాడు.

భగవంతుడి దగ్గర వస్తువులు ఏమి చేసుకుంటాము. నాకు నువ్వే కావాలి. అని కోరుకుంటాం. ఇలా కొన్ని జన్మలకు ఈ స్థితికలుగుతుంది. మనం ఇలాగ కొంత కాలం విషయ సుఖాల్లో ఉన్నాకా, మీరు సత్పురుషులతోటి సహవాసం చేస్తుంటే, సత్కర్మలు కనుక చేస్తుంటే ఒక్కసారి ఏమిటి భగవంతుడు కల్పించిన విషయాలతో కొట్టుకుపోతున్నాం, విషయ చింతనలో కొట్టుకుపోతున్నాం, ఆత్మచింతన లేదు, దైవ చింతనలేదు, అని ఒక్కసారి ఆ భగవంతుని దయవలనే మీ ముఖం ఆ భగవంతుని వైపు తిరుగుతుంది.

మీరు ఇంటిదగ్గర ఏదో ఒక రకంగా ఏడుస్తున్నారు. ఆ ఏడుపు తప్పటంలేదు. ఆ ఏడుపు భగవంతుడి కోసం ఏడిస్తే ఆ భగవంతుడే గురురూపంలో మీ దగ్గరకి వస్తాడు. మీరు వస్తువుల కోసం ఏడ్చినంతకాలం,

భగవంతుడు గురురూపంలో రాడు. భగవంతుడికోసం ఏడిస్తే అపుడు భగవంతుడు అయ్యో మనం చాలా విషయాలు లోకంలో మిగిలిస్తే అవి అన్నీ వదిలేసి ఇప్పుడు మనమే కావలని అంటున్నాడు అని గురురూపం దాల్చి వస్తారు.

గురువు అనుగ్రహం ఎట్టిదంటే వాడు నీ మనస్సును పటిష్టం చేసి పడవేస్తాడు. బయటవాళ్ళ సహాయం లేకుండా వాడు సంతోషంగా వుండగలుగుతాడు. ఇతరుల యొక్క సహాయం లేకుండా నీవు శాంతిగా, సుఖంగా వుండేలాగ అనుగ్రహిస్తాడు. అంతకంటే ఏమికావాలి. నీకు పరిస్థితులు అనుకూలంగా వున్నా, పరిస్థితులు ప్రతికూలంగా వున్నా ఏదైనా కష్టం వచ్చినా, నష్టం వచ్చినా, పరాజయం వచ్చినా, అవమానం వచ్చినా నీవు ఒక్కడివే శాంతిగా, సుఖంగా వుండేటట్లు నీ మనస్సును అంత పటిష్టం చేస్తాడు. బాధ అనుభవిస్తున్నాను అనే స్పృహలేకుండా గురువు అలానే చేస్తాడు అంతకంటే ఏం కావాలినీకు.

ఎవడు చేస్తాడు ఈ స్థితి! ఒక్క గురువుకే సాధ్యం. నీవు దుఃఖంలో వున్నా ఆ దుఃఖాన్నంతాకూడా సుఖంగా మార్చేస్తాడు అలా మార్చగలిగే వాడు గురువు ఒక్కడే. ఆ శక్తిని నీకు గురువు ఇస్తాడు. నీవు ధ్యానంచేయటం వల్ల జపంచేయడం వల్ల ఏ పరిపక్వత స్థితి వస్తుందో ఆ స్థితిని గురువు తన దయవల్ల నీకు ప్రసాదిస్తాడు. నీవు ఒళ్ళంత బురద చేసుకుని ఏమి సాధిద్దామనుకుంటున్నావు? నీ బట్టలు నలగకుండా ఆ గొప్ప స్థితిని నీకు ప్రసాదించగలడు వాడే గురువు.

ఎప్పుడైనా మన జీవితంలో ఇంతశాంతిని మనం అనుభవిస్తామని ఊహించామా. అని నీలో నిన్ను నీవు చూచుకుని తన్మయత్వం కలిగే స్థితిని ప్రసాదిస్తాడు వాడు గురువు. ఎప్పుడో శరీరం చనిపోయిన తర్వాత

వైకుంఠం వెళితే సుఖం వుంటుందని అనుకున్నాం.  ఈ శరీరం భూమి మీద తిరుగుచున్నప్పుడు ఈ పంచ భూతాలమధ్యన ఈ సంఘం మధ్యన ఈ స్నేహితులమధ్యన ఈ విరోధుల మధ్యన నిన్ను అగౌరవపరిచే వాళ్ళ మధ్యన ఇంతమంది మధ్యలో ఎప్పుడైనా ఇంత శాంతిని అనుభవించగలిగేనా అని నిన్ను నీవు చూచి నీకు ఆశ్చర్యం కలిగే శాంతిని పొందేలాగ గురువు అనుగ్రహిస్తాడు.

ఆ వైకుంఠంలో కలిగే సుఖం, ఆ కైలాసంలో కలిగే ఆనందం, నీ ఆత్మశాంతి ముందు, నీ ఆత్మ సుఖం ముందు లిప్త మాత్రంగా కనిపిస్తాయి. అట్టి స్థితిని గురువునీకు అనుగ్రహిస్తాడు. జ్ఞానంతో అలంకరిస్తాడు. ఆ కంటి రెప్ప కంటిని ఎలా కాపాడుతుందో ఆలా గురువు ఎప్పుడూ కాపాడుతూ వుంటాడు. నిజమైన గురువు లోపలే వున్నాడు.  కానీ లోపల వున్న మనకి తెలియటంలేదు. అంతా బయటే ఉందనుకుంటాన్నాం. గురువు బయట వున్నాడు, బయట వున్నాడనుకుంటున్నావు అందుచేత బయటవున్నాడు. అన్న భావన నీకు తొలగించడం కోసమే ఆ లోపల గురువే బయటకు వస్తాడు. గురువు బయట  చేసేపని బయట చేస్తుంటాడు. లోపల చేసేపని  లోపల చేస్తుంటాడు. వీడు, వాడు ఒకటే అన్న సంగతి నీకు తెలియదు. ఆ విషయం మనకి మరుపు పెడతాడు.

అజ్ఞానం నశించే వరకు ఆ జీవ లక్షణాలు ఆ మనస్సు నశించేవరకు, వాడికి ఆత్మజ్ఞానం కలగదు. శరీరం చనిపోయినపుడు జీవుడు చావడు. ఆ జీవలక్షణాలు పోతే అపుడు జీవుడు పోతాడు. ఆ జీవుడు చనిపోతేకాని వాడికి ఆత్మజ్ఞానం కలగదు అందుచేత శరీరం చనిపోయాక జీవుడు ప్రయాణం చేస్తూ వుంటాడు ఇది గురువు చూసుకుంటూవుంటాడు. గురువు అడ్రసు మనకు తెలియకపోయినా, గురువు మన అడ్రసు చూచుకుంటూ వుంటాడు. మన ఎడ్రసు దగ్గరికి వచ్చేస్తాడు. మనల్ని ఉద్ధరించడానికి

వచ్చేవాడే గురువు. గురువు మనకి నచ్చలేదు అనుకోండి వాడు మనకి నచ్చేటట్లు చూచుకుంటాడు. గురువుకి అవసరం లేకపోయినా పరిచయంచేసుకోవడానికి మాట్లాడతాడు. నీకు ఎంతకాలం అయితే దేహాభిమానం వున్నదో, నీ అస్థిత్వాన్ని దేహానికి పరిమితి చేసుకుంటున్నాడో అంతకాలం కూడా గురువు నీ కోసం దేహం ధరించి వస్తాడు. నీ కోసం ఒక దేహాన్ని కల్పించుకుని వస్తుంటాడు. గురువు లోపలనుంచి అనుగ్రహిస్తేచాలు. లోపల నువ్వు బాగుపడిపోతావు అనుకున్నప్పుడు గురువు ఇంక దేహం ధరించిరాడు. లోపలినుంచే అనుగ్రహిస్తాడు. లోపలికే తీసుకుపోతాడు. కానీ నీకు దేహాభిమానం ఎక్కువగా వున్నప్పుడు ఆ పరమాత్మ భావన లేనపుడు ఆయన కూడా నీ కోసం ఒక దేహం ధరించి వస్తాడు. ఆ దేహం ఆయనకి అవసరం లేకపోయినా అంతకంటే దయ ఏం వుంది!

ఆయనకి ఆ దేహంతో ఎట్టి పని లేదు. ఎందుచేతనంటే దేహంతో వున్నప్పుడు ఆయన దేహమాత్రుడు కాదన్నసంగతి ఆయనకి తెలుస్తుంది. కాని ఒక దేహమైన గురువు అవసరం అయినపుడు ఎంతకాలం అయితే దేహం వున్న గురువు అవసరమో అంతకాలం కూడా ఒక దేహాన్ని ధరించి నీకోసం వస్తుంటాడు. గురువు అజ్ఞానంతో వున్న నీ తాదాప్యాన్ని తొలగిస్తాడు. విషయచింతన తగ్గిస్తుంటాడు. ఆత్మచింతన పెంచుతూ వుంటాడు. ఆత్మతప్ప ఇంక ఏంలేదు. ఉన్నదంతా ఒక్కటే. అనే అనుభవం నీకు వచ్చేవరకు నిన్ను వెంటాడుతూనే వుంటాడు వాడే గురువు. ఒకసారి ఏదో మాటల సందర్భంలో భగవాన్ ఒక మాట చెప్పారు!

ఎవరైనా ఒకసారి ఈ గేటు దగ్గరకు వచ్చి వాడిని వాడు అర్పించుకుని వెళ్ళిపోతే వాడు ఎక్కడెక్కడ తిరిగినా చివరికి ఈ గేటులోకి వస్తేకాని వాడు తరించడు. వాడు ఏ లోకంలోకి వెళ్ళినా చివరికి ఇక్కడికి రావల్సిందే.

ఒక్కసారి ఇక్కడ అర్పించుకుని వెళ్ళాక వాడికి ఇష్టంలేక, ఎక్కడెక్కడికో వెళ్ళినా మళ్ళీ ఇక్కడికి వస్తేకాని వాడికి తరించే అవకాశం లేదు. నీవు ఎలాగ వున్నావో గురువు కూడా అలాగే వున్నాడని నీవు ఊహించుకుంటున్నావు. నీవు దేహమాత్రుడివే అని గురువు కూడా దేహమాత్రుడే అని అనుకుంటున్నావు. నీకు అసూయవుంది. గురువుకి కూడా అసూయవుంది. అని అనుకుంటావు నీవు, నీకు కోపం వుంటే గురువుకి కూడా కోపం వుందని అనుకుంటావు. ఎందుచేతనంటే మనలో వున్నదే ఇతరులలో కనిపిస్తుందిగాని మనలో లేనిది ఇతరులలో కనపడదు.

గాఢనిద్రలో మనలో గురువు మన ప్రాణాన్ని, మనస్సుని హరించాడు. అలాగే మనం జాగృదావస్థలో ఉండగా ఎవడైతే మన ప్రాణాన్ని, మనస్సును హరిస్తున్నాడో వాడే నిజమైన గురువు. గాఢ నిద్రలో ఎలా వున్నావో, జాగృదావస్థలో కూడా అలాగే వుండటం నేర్చుకుంటే జ్ఞానమే మీ గుమ్మంలోకి వచ్చి వరిస్తుంది.

మనం వచ్చిన పని మనం మర్చిపోయినా ఆయన వచ్చినపని ఆయన మర్చిపోడు గురువు. మనందరం వచ్చిన పని ఏనాడో మర్చిపోయాం. నీలో ఏదైనా పొరపాటు వుంటే గురువుకి తెలియదని నీవు అనుకోవద్దు. గురువు సాక్షిగా నీ లోపల వున్నాడు. అయిన నిన్ను చూచి వెక్కిరించడు. నిన్ను చూచి వెగతాళిచెయ్యడు. ఆ బలహీనతల్లోంచి నిన్ను ఎలా విడుదల చెయ్యాలో చూస్తుంటాడు. అవకాశం ఎప్పుడు వస్తుందో చూస్తుంటాడు. ఆ బలహీనతల్లోంచి విడుదలచేస్తాడు. నిన్ను జ్ఞానంతో అలంకరింపచేస్తాడు. వాడు గురువు. మనకు ఏదైనా ఆపరేషన్ చేసేటప్పుడు మత్తు మందు ఇస్తారు. తరువాత కత్తి తీసుకుని వుంటాడు డాక్టరు. అట్లాగే గురువు నీకు సర్జరీ ఎప్పుడు చెయ్యాలో, నీ అహంకారం మీద, నీ మమకారంమీద, నీ

రజోగుణంమీద, నీ తమోగుణం మీద ఎప్పుడు కోతపెట్టాలో సహజంగా సర్జరీ చేస్తాడు.

అయితే సర్జరీ చేసినపుడు నీ ముఖం నలగకుండా, నీ బలహీనతల్లోంచి విడుదల చేస్తాడు వాడేగురువు. నీవు సందులో తిరుగుతున్నావనుకో సందుల్లోంచి నిన్ను హైవేలోకి తీసుకువస్తాడు. హైవేలోకి తీసుకువచ్చి నిన్ను వదిలెయ్యడు. ఆత్మజ్ఞానమనే రోడ్డుమీద నడిపిస్తాడు.

ఆ తెలివితేటల్లో నీకు స్పష్టత కలుగచేసి, బ్రెయిన్‌లో క్లారిటీ కలుగజేసి, కేవలం నీకు బుర్రేకాదు, గుండెకూడా ఇస్తాడు గురువు. గురువు అంటే ఏమి అనుకుంటున్నావు తెలివిని ప్రాక్టీసు చెయ్యటానికి గుండెబలం, బుద్ధిబలాలను అనుగ్రహిస్తాడు. నీ హృదయంలో ఉన్న ఆ నిజం దగ్గరికి నిన్ను గెంటుకుపోతాడు గురువు.

గురువు దయ చూపిస్తే, ఎవడు ఆ రాజ మార్గానికి అడ్డంగా వచ్చేవాడు. ఈశ్వరానుగ్రమం వున్నప్పుడు ఏదీ అసాధ్యంకాదు. ఈ సృష్టికి అంతా ప్రభువు అయినవాడు ఎన్ని శక్తులతోటి ఉంటాడు వాడు దేవుడికి ప్రతీదీ సాధ్యమే.

ఇక్కడ భగవాన్ చెబుతున్నారు ఎక్కడవున్నా, ఏ కాలంలో వున్నా ఏ పరిస్థితితులలో వున్నా, అంటే పరిస్థితులు నీకు అనుకూలంగా ఉన్నా, పరిస్థితులు ప్రతికూలంగా వున్నా నిన్ను అదృష్టం వెంటాడుతున్నా, దురదృష్టం వెంటాడుతున్నా, ఎపుడైతే నీ మనస్సు సమానంగా వుందో, ఎపుడైతే నీ మనసు ధైర్యాన్ని విడిచిపెట్టదో ఆ స్థితిని నీకు కలుగచేసే వాడే గురువు. నీవు ఏ ప్రదేశంలో వున్నా, ఏ కాలంలో వున్నా నీవు శాంతికి దూరం అవ్వవు. ధైర్యానికి దూరం అవ్వవు. ఈశ్వరుడిపట్ల నీ ఆత్మ

విశ్వాసానికి దూరం అవ్వవు. ఆ స్థితిని నీకు అనుగ్రహింపచేసే వాడే గురువు.

అంతర్యామిగా వున్న సర్వేశ్వరుడు మన భర్త, మన యజమాని, ఈ పంచభూతాలకి యజమాని వాడికి తెలియకుండా సృష్టిలో ఏదీ జరగదు. అందుకు వాడు ఏమిచేస్తాడు అంటే మనకి ఉపదేశించటం కోసం గురువుగా వస్తాడు.

ఒక ప్రక్క బోధిస్తుంటాడు. భయపడకు నేను ఉన్నాను అంటాడు, నీకు సపోర్టుగా వుంటాడు గాలిలో విడిచిపెట్టడు మనల్ని, భక్తుడికి నీడ భగవంతుడు. నిజంగా భగవంతుడి పట్ల విశ్వాసం ఉన్నవాడికి భయంతో పనిలేదు. అభయస్థితిని అనుగ్రహిస్తాడు భగవంతుడు భక్తుడికి.

భగవంతుడు చెయ్యి భక్తుడు పట్టుకోనక్కర్లేదు. భగవంతుడే భక్తుని చెయ్యి పట్టుకునికూడా లాక్కునిపోతాడు ఎలాగ అంటే పెద్ద కష్టంగా లాక్కువెళ్ళడు నదికి వరద వచ్చినపుడు ఆ మహాప్రవాహంలో ఏనుగులు ఎలా కొట్టుకుపోతాయో అంత తేలికగా లాక్కుపోతాడు భగవంతుడు ఈ భక్తుడిని! ఎక్కడికి? గమ్యం దగ్గరికి.

నీకు ఏమైనా అవరోధాలు ఉన్నాయనుకో నీ బుద్ధిలో వున్న దోషాలు అడ్డువస్తుంటాయి, మీ ఇష్టాలు, అయిష్టాలు, పాపాలు, కోపాలు, ఇవి అడ్డువస్తుంటాయి. ఇవన్నీ లోపలికి ఈ జీవుడిని నెట్టుతూ వుంటే అడ్డు వస్తుంటాయి. పూర్వజన్మ అలవాట్లు ట్రాఫిక్ జామ్‌లో పడవేస్తాయి, గురువు ట్రాఫిక్‌జామ్‌లో పడనివ్వకుండా అవన్నీ క్లియర్ చేసుకుంటూ వెళ్ళి నీచేత ఏదో చిన్న ప్రయత్నంచేయించి ఆ రాళ్ళని ఆయనే గెంటివేసి, నీవు ఏదో సాధన చేసి గెంటినట్లు నీకు అనిపింపచేసి, హృదయంలోకి గెంటుకు పోతాడు, వాడే గురువు.

గురువు ఆ రాయిని నిన్ను ముట్టుకోమంటాడు, నిన్ను ముట్టుకోమని ఆయనే గెంటివేస్తాడు. గెంటి వేస్తే నువ్వు ఏమనుకుంటావంటే నేనే గెంటివేశాను అనుకుంటావు. నిన్ను ఊరికే ఆ రాయి మీద చెయ్యి వేయమంటాడు. ఆ రాయిని మనం గెంటగలమా? ఆజన్మాంతరంలో వచ్చే వాసనలే పెద్ద పెద్ద బండరాళ్ళు. ఎన్ని జన్మలనుంచి వచ్చి గూడుకట్టుకున్నాయో, దాన్ని తొలగించుకునే బుద్ధి కొంచెం మనకి కలుగచేస్తాడు. వాటిని ముట్టకోమంటాడు, గెంటివేయటం వాడే గెంటివేస్తాడు కాని నీకు తెలియకుండా నువ్వు చేస్తున్నట్లు నీకు అనిపింపచేసి నీకు ఆత్మజ్ఞానాన్ని కలుగజేస్తాడు వాడే గురువు.

ఆ రాళ్ళను ఆయనే గెంటుతున్నప్పటికీ నీవు గెంటుతున్నట్లు అనిపించేసి ఆయన అనుగ్రహిస్తాడు. ఎందుచేతనంటే గురువు వల్ల ఈ సహాయం వస్తోందని నీవు అనుకోవాలని గురువు అనుకోడు. అలా అనుకుంటే వాడు గురువు కాదు.

ప్రపంచం అంతా నీకు వ్యతిరేకంగా వున్నా నీవు ఒంటరిగా నీ కాళ్ళమీద నీవు నిలబడేటట్లు చేస్తాడు. ఏమిట్రా మనకి ఇంత ధైర్యం వచ్చేసింది అనుకుంటావు అంతకుముందు పిల్లిని చూస్తే పారిపోతాం. ఇపుడు పులి ఎదురైనా నీవు ధైర్యంగా ఎదుర్కొంటావు.

భయస్థుడిని భయరహిత స్థితికి తీసుకుపోతాడో వాడే గురువు. మన హృదయంలో ఉన్న చీకటిని పోగొట్టటానికి ఎవడైతే ప్రయత్నం చేస్తున్నాడో వాడికి నమస్కరించకపోతే ఎవరికి నమస్కరిస్తామండీ! మనం వాడిని పూజించకపోతే ఎవడిని పూజిస్తాం. హృదయంలో వున్నటువంటి బండరాళ్ళని పెకిలించి బయటకి లాగి, లోపల ఉన్నటువంటి చీకటిని ఆయన దయతోటి బయటకి నెట్టుతూవుంటే, వాడికి కృతజ్ఞత

చూపించకపోతే వాడిని పూజించకపోతే వాడిని ధ్యానించకపోతే ఎవడిని ధ్యానిస్తాం, ఎవడిని పూజిస్తాం, ఎవడిని జపిస్తాం.

ఒకసారి మనకి మాటలతోటి వర్ణించలేనటువంటి, మనస్సుతోటి ఊహించలేనటువంటి, శాంతి సాగరంలో, ఆనందసాగరంలో ఊగిసలాడుతుంటాం. ఇది మనం చేసే సాధనల వల్ల వచ్చేసింది. అని మనకి అనిపిస్తువుంటుంది. అలా అనిపింప చేస్తాడు గురువు. గురువు దయ వల్ల వచ్చిందని గ్రహించిన వాడు ధన్యుడు.

మనం ఎప్పుడైనా ఆనందసాగరంలో ఈదులాడుతుంటాం అనుకోండి సాధన చేసేసాం. అందుకు హృదయ గుహలోపడిపోయాం. మొత్తం మీద ఇంటికి వచ్చేసాం అనుకుంటాం ఆ ఇంటికి తీసుకువచ్చి పడేసింది గురువే అన్న సంగతి మర్చిపోతాం. అయినా మనం మర్చిపోయినప్పటికీ మన దగ్గరనుంచి కృతజ్ఞతలు ఆశించడు వాడు గురువు.

మీకు ఏమైనా వ్యాపకాలు వుంటే ఆ వ్యాపకాలు మిమ్మల్ని విడిచి పెట్టమని చెప్పడు. మీకు చెప్పకుండానే అందులోంచి సహజంగా, నార్మల్‌గా నిన్ను విడుదల చేస్తుంటాడు.

గురువు నోటితో అలా చెయ్యి, ఇలా చెయ్యి, అలా కూర్చో, ఇలా కూర్చో అని వారు ఏమీ చెప్పరు. వారిని ఎలా కూర్చోబెట్టాలో అలా కూర్చోబెడుతూ నిన్ను ప్రయాణం కొనసాగిస్తుంటారు. వాడికి మాటలతోటి పనిలేదు. నీలో ఏదైనా తొలగించుకోవలసిన వాసన ఉందనుకో ఆ వాసన నీ సహస్రారంలోకి రాకముందే గురువు అంతర్యామిగా వున్నాడు కాబట్టి వాసన, తలంపు క్రింద మారకముందే ఏ వాసన అయితే నిన్ను గమ్యానికి వెళ్ళనివ్వకుండా బ్లాక్ చేస్తుందో ఆ వాసన చూస్తాడు.

గురువు నీకు ఫలానా వాసనవుంది అనిచెప్పడు. కాని ఆ వాసన ఎక్కడ వుందో నీకు తెలియకుండా బయటకు లాగి కాల్చి బూడిద చేసి లైను క్లియర్ చేసి, నిన్ను ఇంటికి తీసుకుపోతాడు.

నీ ఇంటికి నిన్ను తీసుకెళ్ళటం అంటే మోక్షంలోకి తీసుకువెళ్ళటం, నీ మోక్షమే నీ నిజమైన ఇల్లు. ఆ ఇంటికి తీసుకువెళ్ళేవరకు నిన్ను విడిచిపెట్టడయ్యా గురువు. దారిలో నీకు అనేక ఇబ్బందులు రావచ్చు. ఆ ఇబ్బందులలో వచ్చే బాధలు కూడా నీకు తెలియనివ్వడు. నీకు తెలయనివ్వకుండా ఆయనే చెయ్యిపట్టుకుని తీసుకుపోతుంటాడు.

ఏదిపోతే నీ స్వరూపం వ్యక్తం అవుతుందో ఆయన అంతట ఆయనే పోగొడుతూ, విశ్రాంతి లేకుండా పనిచేస్తూ, ఆ శిష్యుడికి ఏది ఉపకారమో ఆ రకంగా నీతోటి చెప్పకుండా పనిచేసుకుపోతుంటాడు వాడు గురువు. గురువుకి రెస్ట్ అక్కరలేదటండి.

గురువు ప్రతిక్షణం తోలుకుపోతుంటాడు. గురువు అంటే చైతన్యమే, చైతన్యానికి రెస్టు ఎందుకు! నీవు ఆయన గురించి ఎలా అనుకున్నా వారు చేసుకునే పని వారు చేసుకుంటూపోతారు.

ఏమైనా సంతోషాలు అనుభవించినా, దుఃఖాలు అనుభవించినా ఈ సుదీర్ఘమైన అజ్ఞానమైన నిద్రలో మనం పోతున్నాం. ఈ అజ్ఞానమే నిద్రలోంచి మనల్ని మేల్కొలపటానికి ఎన్ని ప్రక్రియలు కావాలో, అది ఎపుడు చేయాలి, ఎక్కడ చేయాలి, ఎలా చేయాలి ఆ టైం చూచుకుంటూ పోతాడు. వాడికి శాంతి అక్కర్లేదు. విశ్రాంతి అక్కర్లేదు వాడు గురువు. వారి పని వారిదే. వారి ప్రవాహమే ప్రవాహం.

ఈ అజ్ఞానమనే నిద్రలోంచి ఎవరో ఒక్కరో, ఇద్దరో మేల్కొలపటం కాదు, ఎంతమందిని మేల్కొలుపుతున్నవారు రిటైర్ అవ్వరు. గురువు యొక్క ముఖ్యమైన పని అదే.

నీ లోపల ఉన్నది ఉప్పుసముద్రముకాదు నీ లోపల వున్నది పాల సముద్రంకాదు, నీ లోపల వున్నది సుఖసముద్రం, శాంతి సముద్రం, ఆనంద సముద్రం. ఆ ఆనంద సముద్రంలో నీవు మునకలు వెయ్యడానికి ఏ బలహీనతలు, ఏ పాపాలు అడ్డువస్తున్నాయో ఇవన్నీ చూసుకుంటూ వుంటాడు, చూచుకుని ఓహ్ ఇన్ని వున్నాయా అని అనుకోడు ఆయన అనుగ్రహం ముందు ఎన్ని దోషాలు ఉన్నప్పటికీ అన్నీ బయటకి లాగి కాల్చి బూడిద చేస్తాడు లోపల వున్న ఆనంద సముద్రంలో ఈదులాడటానికి నీవు సహాయ సహకారములు అందిస్తాడు. వాడు గురువు. దేవతలుఅందరూ చేసేపని గురువు ఒక్కడే చేసుకుపోతాడు. నీవు ధ్యానం చేసేటపుడు, జపం చేసేటపుడు, నీ గురువు ఎవరో నీకు లోపలనుంచి తెలుస్తుంది ఈ జీవుడిచేత కామాన్ని జయింపచేసేవాడు, కాలాన్ని జయింపచేసేవాడు గురువు.

ఎంత పండితుడు అయినా, ఎంత ధనవంతుడు అయినా, ఎంత కీర్తి వున్నా, గురువు దయ కటాక్షం లేకుండా వాడు సత్యసాక్షాత్కారం పొందలేడు. ఎందుచేతనంటే గురువే నీ నిజమైన ఆత్మగా వున్నాడు. ఆయన అనుగ్రహం లేకుండా ఆయన్ని ఎలా పొందుతావు.

గురువు అంటే ఎవరు? నీలో వున్న అంతర్యామి, నీలో వున్న మహా వెలుగే గురువు. నీలో ఎంతో కొంత భక్తి వుంటే ఆ భక్తి అనే పిందెను పండు చెయ్యడానికి, నీలో వ్యక్తి భావన తగ్గించడానికి, అహంభావన రాహిత్య స్థితిని నీ చేత పొందింపచెయ్యడానికి, గురువు ఎప్పుడూ ఈ కాలం, ఆ కాలం అనకుండా నీకు సహాయ సహకారాలు ఆయన

అందిస్తుంటాడు. ఎక్కడో ఆనందం వున్నదని ఇప్పుడు దాకా చెప్పు కున్నాం. ఆ శిష్యుడ్ని ఉద్ధరించాలని ఆనంద తాండవంలో ఆనంద ప్రవాహ వేగంలో శరీరం ధరించాడు కాబట్టి గురువు శరీరం కూడా ఆనందమే. అందుచేత ఆయన్ని చూచేటప్పటికి మనకి ఆనందం కలుగుతుంది.

ఆ ఆనందంలో ఉబికి, ఉబికి ఆనందంలో నాని, నాని ఊరికే ఒక రూపం కనిపించాలి కదా శిష్యుడికి. ఆనందమే శరీర రూపం ధరించింది. అందుచేత గురువు యొక్క శరీరం కూడా ఆనందమే.

ఆత్మలో ఆనందం వుందని ఇప్పటివరకు చెబుతున్నారు. గురువు యొక్క శరీరం ఆనందంతో వచ్చింది. గురువు యొక్క శరీరం ఆనందంలో ఉ ంది.

కొన్ని జీవరాసులలో నీవు గురువుని చూచే పరిస్థితి నీకు కలుగజేస్తాడు. ఎటు చూచినా నీకు గురువే కనిపిస్తాడు. నిన్ను అలా ముగ్గపెడతాడు. ఎటుచూచినా గురువే కనిపించేటట్లు నిన్ను అనుగ్రహిస్తాడు. గురువు యొక్క అనుగ్రహం లోపల్నించే పనిచేస్తుంటుంది.

కళ్ళు వున్నవాళ్ళు చూడండి, చెవులు వున్నవాళ్ళు వినండి, గ్రహించే శక్తి వున్నవాళ్ళు గ్రహించండి. భగవాన్ చెబుతున్నారు గురువు ఎదురుగుండా ఉన్నప్పటికీ కళ్ళు వున్నా కొంతమంది చూడలేరు, చెవులు వున్నా వినలేరు, అర్థంచేసుకునే శక్తి లేనివారు అర్థంచేసుకోలేరు. గురువుని గ్రహించటానికి గురువుని గుర్తించడానికి నీకు యోగ్యత ఉండాలయ్యా!

ఈశ్వరుడిపట్ల భక్తిలేని మనం తపిస్తుంటే, భక్తి కలిగేటట్లు అనుగ్రహిస్తాడు గురువు. అందుచేత గురువు ఒక్కడేనయ్యా నీలో బలహీనతలు ఉన్నంతకాలం గురువు యొక్క సహాయం అవసరమయ్యా నీకు.

భక్తుడు అడుగుతున్నాడు భగవాన్‌ని నా హృదయంలో ఏదో సత్యం వుంది. అది నాకు తెలియటంలేదు. అది తెల్సుకోవటానికి మీరు ఏమైనా అనుగ్రహిస్తారా? అని అడిగితే భగవాన్ చెబుతున్నారు అనుగ్రహించమని సహాయం చెయ్యమని గురువుని అడగవలసిన పనిలేదు. నీవు ఆత్మసాక్షాత్కారం పొందాలని అనుకున్నంతకాలం గురువు యొక్క అవసరం వుంది. నీలో సత్యముగా వున్నవాడు గురువే.

గురువు వేరు, నేను వేరు అనుకోవచ్చు. మొదట స్టేజిలో నీవు ఎలా అనుకుంటున్నావో గురువు చూస్తు వుంటాడు.

ఆ బేధ బుద్ధి పోవటానికి నీతో మాట్లాడుతూ నీతో తిరుగతూ ఆ బేధబుద్ధిని చూస్తుంటాడు. ఈ మాటలు, ఈ రాతలు, ఈ ప్రసంగాలు అన్నీ కూడా బేధబుద్ధిలోంచి విడుదలచేసి ఆ బేధబుద్ధి అనుగ్రహించేవరకు గురువు విడిచిపెట్టడు.

భక్తుడు నీ కృప నా మీద వుంటుందా అని అడుగుతున్నాడు. భగవాన్ ఏమంటున్నారంటే దయ ఎప్పుడూ వుంటూనే వుంటుంది. నీకు అర్హత వస్తుందంటే  దయ యొక్క స్వరూపం నీకు తెలుస్తుంది. గురువు దయ ఎపుడు వుంటుంది. గ్రహించే బుద్ధి నీకు వుందోలేదో చూచుకోవయ్యా!

భక్తుడు అడిగాడు మరి అది ఎలా తెలుస్తుంది! అపుడు  భగవాన్ చెబుతున్నారు గురువు మీద భక్తివల్ల తెలుస్తుంది. నీ ఆలోచనలు దాన్ని పట్టుకోవచ్చు. పట్టుకోకపోవచ్చు ఒకసారి గురువు జిమ్మిక్కులు చేస్తుంటాడు. ఒక్కోసారి మనం అనుకుంటూవుంటాం. గురువు మన చెయ్యి వదిలేశాడేమో, ఈ మధ్యన గురువు జ్ఞాపకంరావటంలేదు. గురువు ఎక్కడికి పోయాడో ఏం తెలియటంలేదు అని అలా అనుకుంటాం. ఈ మధ్యన

మనకి శాంతిలేదు. అంతా ఆందోళనగా వుంది అని అలా అనిపింపచేస్తాడు. మనచేత ఎందుచేత?

మనల్ని కౌగలించుకోవడానికి గురువు దయ లేదని తోపింపచేస్తాడు, ఎందుకు అలా తోపింపచేస్తాడంటే మనల్ని గాఢంగా, గూఢంగా ఆయన హృదయంలోకి మనల్ని తీసుకోవడానికి ఈ జిమ్మిక్కులు చేస్తుంటాడు అది తెలిసినవాడు ధన్యుడు.

నీవు గుర్తించలేనంత మాత్రాన అనుగ్రహం లేదని మాత్రం అనుకోకు. వున్నసత్యం ఏదో నీకు ఎఱుకపరుస్తాడు. అది తప్పించి ఏదీలేదని నీకు అనుభవంలోకి తీసుకువస్తాడు ఆ నగ్న సత్యం నీకు అనుభవంలోకి తీసుకువస్తాడు వాడు గురువు. నీ లోపల ఉన్న సత్యం తెలిసాక ఎక్కడో గురువు వున్నాడు అనే బుద్ధిపోతుంది. ఎక్కడో ఉన్నవాడు ఇక్కడే వున్నాడు అన్న సంగతి నీకు అనుభవైక వేధ్యం అవుతుంది. ఇదంతా గురువు దయవల్లే జరిగిపోతుంటుంది.

ఆయన వేరు,నేను వేరు అని నీవు గురువును జపిస్తూవుండవచ్చు ఆయన వేరు, నేను వేరు అని పూజ ప్రారంభిస్తావు. కానీ నీ హృదయంలో వున్న సత్యం గురించి స్మరింపచేస్తాడు. దానికోసం నిన్ను తపింపచేస్తాడు. తపింపచేసి, స్మరింపచేసి విడిచిపెట్టడు, అది పొందే వరకు ఆయన దయ నిన్ను వెంటపడుతూ వుంటుంది. వాడే గురువు.

భగవాన్ చెబుతున్నారు గురువును పట్టుకో, విడవకుండా పట్టుకో, గురువుని ఆశ్రయించు. గురువు చెప్పింది శ్రవణం చెయ్యి. గురువుకి సేవచెయ్యి. ఆయనకి సేవచేసే కొలదీ, ఆయన మాటలు వినే కొలదీ నీకు ఏమి తెలుస్తుందంటే, ఏ కారణం వల్ల ఈ జన్మకి వచ్చాము, ఏ కారణం వల్ల ఈ దుఃఖం మనకి కలుగుతోందో ఆ కారణాలు తెలుస్తాయి.

ఆ కారణం నీకు తెలిసాక ఆ కారణాన్ని నీకు తొలగిస్తాడు వాడు గురువు. ఆ కారణంగా నీకు తెలియకుండానే కత్తిరిస్తాడు. కత్తిరిస్తే దుఃఖంతోటి, జన్మలతోటి సంబంధం నీకు ఊడిపోతుంది. అలా ఊడిపోయేలాగ అనుగ్రహించేవాడే గురువు.

గురువుకి సేవ చేస్తుంటే ఏ కారణం వల్ల దు:ఖం వస్తుందో నీకు తెలుస్తుంది. ఆ కారణాన్ని నీ మెదడుకి అందజేస్తాడు. ఆ కారణాన్ని తెలియపరిచి ఊరుకోడు. ఆ కారణంలోంచి విడుదల చేస్తాడు. వాడు గురువు.

భగవాన్ ఇక్కడ ఒక మాటచెప్పి ప్రక్కకు తప్పుకుంటున్నారు!

భగవంతుడి పట్ల నీవు ఏదైనా అపచారం చేస్తే ఆ అపచారం యొక్క ప్రభావం నీ శిరస్సుమీద పడకుండా గురువు నిన్ను సరిచెయ్యగలుగుతాడు. నీవు సంవత్సరాల తరబడి అనుభవించవలసింది కొన్ని క్షణాల్లో అనుభవింపచేసి నిన్ను విడుదలచేస్తాడు వాడు గురువు.

భగవంతుడు మీకు పది సంవత్సరాలు శిక్షవేస్తే పదిరోజులు అనుభవింపచేసి మిమ్మల్ని విడుదల చేస్తాడు. భగవంతుడు శపిస్తే, ఆ శాపం యొక్క ప్రభావం కొన్ని గంటలు అనుభవింపచేసి బయటికి తీసుకువస్తాడు వాడు గురువు.

ఒకవేళ గురువుపట్ల మీరు అపచారంచేస్తే భగవంతుడు కూడా మిమ్మల్ని సరిదిద్దలేడని కొంతమంది మహాత్ములు చెబుతున్నారు. ఎందుకు చెబుతున్నారంటే గురువు యొక్క వైభవం తెలియటంకోసం.

మన అందరి శిరస్సులమీద ఆయన దయవుంది. తెలిసినావుంది, తెలియకపోయినా వుంది, కాని తెలిసినవాడు ధన్యుడు. ఆ పుణ్యబలం

వున్నవాడికి తెలుస్తుంది పుణ్యబలం తక్కువగా వున్నా దయవున్నట్టు తెలియదు. అందుచేత గురువు అంటే లోపలవున్న చీకటిని పోగొట్టేవాడు గురువు.

మీకు ఎపుడైనా అశాంతి కలుగుతుంటుంది. ఏమిటి ఇంత అశాంతిలో వున్నాను. గురువు నా చెయ్యి వదిలేశాడు. ఎక్కడికిపోయాడు అనిపిస్తుంది. మీలో ఎంత అశాంతి వుందో, ఇంక ఎన్ని జన్మలు ఈ అశాంతి వెంటాడుతుందో, మీలో వున్నఅశాంతి ఎంత దట్టంగా వుందో, ఎంత బరువుగావుందో మీ మెదడుకి చూపించి తరువాత దానిని తొలగించడానికి ప్రయత్నంచేస్తాడు గురువు.

మీ అశాంతిలోంచి మీ జన్మ బంధంలోంచి, మీ దుఃఖంలోంచి విడుదల చేయడానికే ఈ ప్రక్రియలు అన్ని చూపిస్తూ విడుదలచేసే ఆ భక్తిని విడుదలచేసే ఆ శక్తిని ప్రసాదించి విడుదలచేస్తాడు. అజ్ఞానాన్ని తొలగించు కోవాలనే బుద్ధిని ఇచ్చేవాడు గురువు. అజ్ఞానంలోంచి విడుదల చేసేవాడు గురువు. బ్రహనిష్ఠకలుగజేసేవాడు గురువు. అన్నీ గురువే అంతా గురువే.

ఒక్కొసారి మీకు అనిపిస్తుంది ఇంక మనకి వెయ్యి జన్మలు ఎత్తినా మోక్షంరాదని, కాని ఆ వాసనలు మీకు చూపించి కదిపి, కెలికి మీ శిరస్సు లోనికి తీసుకువచ్చి అవి పోగొట్టుకోవాలని అనిపింపజేసి తీసివేస్తాడు. మీ గురువు.

ఎక్కడైతే మహాత్ములు, మహా గురువులు, జ్ఞానులు వుంటారో అక్కడ వాతావరణం ఆహ్లాదకరంగా వుంటుంది. గురువు సమక్షంలో వున్నవి అన్నీ మధురక్షణాలు. మనం ఏమీ కట్టుకున్నామో, ఏమి తింటున్నాం అని ఆలోచిస్తున్నాం కాని ఏమి వింటున్నా అని ఆలోచించటంలేదు. మంచిమాటలు వింటే వెలుగు నీలోంచి తొంగి, తొంగి చూస్తుంది.

చెడ్డమాటలు వింటే చీకటి తొంగి చూస్తుంది. మహాత్ముల వాతావరణం వల్ల మానసికంగా మార్పు వచ్చేస్తుంది. మహాత్ముల సమక్షంలో నీ తలంపులు, నీకు రాబోయే పునర్జన్మ హేతువులు వాసనలు అవి అన్నీ అణిగిపోతాయి, చిరిగిపోయి నాశనంమయిపోతాయి.

నీ మనస్సు స్వచ్ఛమైపోయి,నీకు ఈ జన్మలోనే సమాధిస్థితి వచ్చేస్తుంది. ఆ వస్తువే నీ దగ్గరికి వచ్చి వరించి వేస్తుంది. నిన్ను అనుగ్రహిస్తుంది. దాని స్వరూపం నీకు ఇస్తుంది. అది అనుభవంలోనికి వచ్చేలాగ గురువు చేస్తాడు. నిన్ను అనుగ్రహిస్తాడు. గురువు సన్నిధిలో అది జరుగుతుంది. నీవు విన్నది నీకు అనుభవంలోనికి వచ్చేలాగ గురువే చేస్తాడు. అది నీ సొంతం చేసుకోవడానికి నీవు రవ్వంత, ముల్లంత ప్రయత్నం చేస్తే నీకు సొంతం అయ్యిపోతుంది. అప్పటి వరకు గురువు నిన్ను వెంటాడుతూనే వుంటాడు.

మీరు నరకానికి వెళ్తేకూడా మీ కూడా నరకానికి వస్తాడు గురువు. మీరు నరకానికి వెళ్తే స్వర్గంగా మార్చేస్తాడు ఆ నరకాన్ని, వాడు గురువు. మన శ్రేయస్సుని కోరేవాడు గురువు ఒక్కడే మనల్ని మనం ఎంత ప్రేమించుకుంటున్నామో అంతకంటే ఎక్కువగా గురువు మనల్ని ప్రేమిస్తాడు. అట్టి గురువుకి మినహాయింపులు లేకుండా శరణాగతిచెందు. గురువును ప్రేమించు నీకు పూర్ణత్వం వస్తుంది దేవుడు నిన్ను మాయ అనే జైలులో పడవేస్తాడు కాని గురువు నిన్ను మాయలోనుండి విడిపిస్తాడు. మీరు బాగుపడటానికి ఒక్క గురు రూపము చాలు! నీ దేహ బుద్ధి పోయేవరకు గురువుని ధ్యానించు. దేహబుద్ధి నశించినపుడు గురువు యొక్క స్థితిని పొందుతావు.

గురువు తన స్థితికి వచ్చేవరకు నిన్ను విడిచిపెట్టడు. గురువుని ధ్యానించగా, ధ్యానించగా, దేహబుద్ధి నశించి ఆత్మబుద్ధి వస్తుంది. అపుడు గురువు పొందే సుఖం, శాంతి నీవు కూడా పొందుతావు. ఆ కల్తీ లేని సుఖం, శాంతి, ఆనందము నీకు అందేవరకు గురువు నిన్ను వెంటాడుతాడు. గురువుయొక్క స్థితిఅట్టిది. అందువలన గురువుకి మినహాయింపులు లేని శరణాగతిచెందు.

శరణాగతే నిజమైన ప్రార్ధన. ఇదే బలమైన ప్రార్ధన. గురువు మీద భారం వేసి జీవిస్తే ఆధ్యాత్మికంగా పురోభివృద్ధి కనిపిస్తుంది. ఒకవేళ నువ్వు సాధన చేయలేకపోతే శవాన్ని తీసుకువెళ్ళి గురువు సమక్షంలో పడవెయ్యి. ఆ గురువుదగ్గరపడి వుండండి.

ఆ గురువు వైబ్రేషన్స్ మన మీద పనిచేస్తాయి. ఆ వైబ్రేషన్స్ పనిచేయడమే కాదు. నీకు లోచూపు కలుగుతుంది. ఆ లోచూపు కలిగాక నిజమైన విద్య అపుడు ప్రారంభమౌతుంది. ఆ విద్య మిమ్మల్ని పరమాత్మ వున్న గుహలోకి తీసుకువెళుతుంది. మీరు ఏమి చేయలేని పరిస్థితిలో వున్నప్పుడు ఆ శవాన్ని తీసుకువెళ్ళి ఆయన సమక్షంలో పడవేస్తే పూజ, జపం, ధ్యానం, విచారణ చెయ్యటంవలన ఏ ఫలితం వస్తుందో అంత ఫలితం ఆయన సమక్షంలో వుండటం వలన వచ్చివేస్తుంది.

ఆ గురువు యొక్క సహవాసం వల్ల ఆ సద్వస్తువుకి మీరు దగ్గరవుతారు. ఆంతేకాదు సద్వస్తువు మీద ప్రేమ కలుగుతుంది. సద్వస్తువు మీద అనురక్తి కలుగుతుంది. అందులో లయమైపోతారు, అంతేకాదయ్యా నీ శరీరం వుండగానే మీకు ముక్తి సుఖం అందుతుంది. మీ చేతికి ఎటువంటి వారితో సహవాసం చేస్తే నీ చేతికి ముక్తి సుఖం అందుతుందో అటువంటి వారితో సహవాసం కోరుకోవయ్యా నువ్వు!

గురువు ద్వారా లోకానికి ఎంతో శాంతి అందుతూవుంటుంది. వారిని చూచి ఎంతో మందికి మారు మనస్సు పొందుతారు. వారు భూమికి వెలుగు అయ్యివుంటారు.

గురువు ఎవరనుకుంటున్నావు, ఆత్మ ఆ రూపంలో వుంది. అది మిస్ అవ్వద్దు. భగవంతుడు ఆ రూపంలో వున్నాడు. గురువు దగ్గర అనుగ్రహం తప్పించి నీకు ఇవ్వటానికి ఏమీ లేదు. ఒక వేళ వాడిని ముక్కలు, ముక్కలుగా ఖండించినా వాడు మీకు శాంతినే యిస్తాడు వాడు గురువు. గురువంటే జ్ఞాన ప్రదాత, దానికంటే స్వచ్ఛమైనది ఏముంది ఈ లోకంలోకాని పరలోకంలోకాని అంటాడు కృష్ణుడు. నీవు గురువు దగ్గరకు వెళ్ళినపుడు వినయముగా వెళ్ళు, శ్రద్దగా వెళ్ళు హేళన పనికిరాదు, గురువు దగ్గరికి వినయంగా, శ్రద్దగా, సమీపించి వారి అనుగ్రహాన్ని సంపాదించు గురువును గౌరవించు, గురువు యొక్క మన్ననలు సంపాదించి వారియొక్క ప్రసన్నత సంపాదించి నీకు తెలియని విషయాలు వారిని అడిగి తెలుసుకుని బాగుపడు అంటాడు కృష్ణుడు అర్జునితో. నువ్వు గురువుని ఎంత వినయంగా అడిగితే, ఎంత భక్తితో అడిగితే, ఎంత శ్రద్ధగా అడిగితే, అక్కడ ప్రసన్నుడు అవుతాడు గురువు. గురువు తన హృదయాన్ని ఓపెన్ చేసి జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు.

జ్ఞాన శిఖరాల మీద నిన్ను కూర్చోబెట్టటం కోసం మళ్ళీ చావు ఎలా వుంటుందో, పుట్టుక ఎలా వుంటుందో తెలియని స్థితికి నిన్ను తీసుకువెళ్ళటం కోసం గురువు చేసే ప్రయత్నం వాడే గురువు. కబుర్లతోటి, కాకర కాయలతోటి సరిపెట్టేవాడు గురువు కాదు. నీ హృదయం యొక్క లోతుల్లోకి, లోయల్లోకి, ఆ చైతన్యం ఎంత లోపలవుందో అంత లోతుల్లోకి వెళ్ళేవరకు మధ్యలో నిన్ను ఆపుచేయకుండా అక్కడికి చేరుకునేవరకు ఎదర నిలబడి నీకు మార్గం చూపిస్తాడు వాడే గురువు గురువు ఎక్కడికి పారిపోడు. ఎదర నిలబడతాడు ఆ గమ్యానికి తీసుకువుళ్ళేవరకు నిన్ను చెయ్యిపట్టుకుని

ఆలోపల నువ్వు ఎవరిగా వున్నావో వాడిని నీ చేతికి పట్టి ఇచ్చే వరకు నిన్ను విడిచిపెట్టడు వాడే గురువు అంటే.

మీ సంసారంలో ఇబ్బందులను బట్టి ఎదురుగాలులు వస్తున్నా, గురువు మీకు లోపల వుండి ఆ కష్టాలను తట్టుకునే వైరాగ్యాన్ని శక్తిని ఇచ్చేవాడు గురువు మీరు డిప్రెషన్‌లోకి వెళ్ళకుండా ముందు నేనున్నాను అని చెప్పి లోపల నీకు తగినటువంటి శక్తిని ఇచ్చేవాడు గురువు.

భక్తుడు అంటున్నాడు భగవాన్‌తోటి అయితే మీరు గురువు గురించి చాలా బాగా మాట్లాడుతున్నారు, నేను వింటున్నాను, శ్రవణం చేయటమే కాదు ఆనందిస్తున్నాను. మీ మాటలకు సంతోషిస్తున్నాను. మీ మాటలు వింటుంటే నాకు ఏనుగు మీద కూర్చునట్లు వుంది. ఎంత బాగుంది గురువు యొక్క వైభవం, అసలు సాధన చెయ్యకుండానే జ్ఞానాన్ని చేతిలో పట్టుకుంటున్నాను అనిపిస్తోంది, మీరు చెబుతుందటే మీ మాటలు వింటుంటే అసలు అది నిజంగా అనుభవంకు వస్తే ఎంత గొప్పగా వుంటుందో. అన్నీ బాగానే వున్నాయి మీరు నా గురువని నాకు ఎలా తెలుస్తుంది. లోకంలో అనేకమంది గురువులు వున్నారు కాని ఈ గురువు నా గురువు అని నాకు ఎలా తెలుస్తుంది. వాడు నా గురువు అని తెలియడానికి నాకు కొన్ని సూచనలు చెప్పండి అని భక్తుడియొక్క ప్రశ్నకి భగవాన్ అంటున్నారు నీవు తదేక ధ్యానం చేయడం వలన తదేక జపం చేయటం వలన నీ గురువు ఎవరో నీకు తెలుస్తుంది.

నాకు గురువు ఎవరు అని ధ్యానం చేస్తుంటే ఆ ధ్యానంలో నీకు స్ఫురిస్తుంది. వాడు నా గురువు అని నీ మనస్సు అంతర్ముఖం అయితే నీకు అంతర్ దృష్టి కలిగితే అపుడు స్ఫురిస్తుంది నీకు లోపలినుంచి వాడు నా గురువని.

ఎంత చదువు చదువుకున్నా, ఎంత ధనం వున్నా, ఎన్ని శక్తులున్నా, గురువు యొక్క దయ లేకుండా ఆత్మజ్ఞానం కలగదని చెబుతారు. అక్కడ ఆయన ఇంటర్‌ఫియర్ అవ్వవలసినదే. ఆయన ప్రమేయం లేకుండా ఆ చివరి మెట్టు దగ్గరికి నీవు రాలేవు. నీ హృదయం యొక్క లోయల్లో ఉన్న నిజమే గురువు. అక్కడికి ఆ నిజమైన గురువు దగ్గరికి తీసుకువెళతాడు. బాహ్యంగా వున్న గురువు అయితే నీ హృదయంలో ఉన్న నిజం ఆ గురువుకి అనుభవంలో ఉంది కాబట్టి ఆ నిజమే ఈ గురువు కాబట్టి ఆ గురువు యొక్క సన్నిధానంలోంచి ఆ గురువు యొక్క పరిసరాలలోంచి ఆ గురువ యొక్క ప్రభావం వల్ల కొండపైనుండి నీరు క్రిందకి ఎలా ప్రవహిస్తుందో, అలాగ అతనిలోంచి కాంతి, శాంతి, జ్ఞానం కారుతుంటుంది.

భగవాన్ దగ్గరకు ఒక భక్తుడు వచ్చాడు ఒక అరగంట కూర్చున్నాడు భగవాన్ దగ్గర ! మీ దగ్గరకు వచ్చేటప్పుడు ఏదో అడగాలని వచ్చాను కాని మిమ్మల్ని చూచిన తరువాత అడగాలని అనిపించటంలేదు మిమ్మల్ని చూడాలి అనిపిస్తుంది. చూచే కొలది చూడాలి అనిపిస్తుంది. కాని నాకు ఇది కావాలని అడగాలని బుద్ధి రావటంలేదు. కాని చూడాలనిపిస్తోంది అన్నాడు. అది జ్ఞాని యొక్క వైభవం.

నీలోపల వున్న నిజమే గురువు. గురువు దగ్గరనుండి మనం పొందేది బంగారం, గురువుకి మనం ఇచ్చేది మట్టి. భగవంతుడే నీ లోపల ఆత్మగా వున్నాడు. కాని నీకుతెలియటంలేదు ఎందుచేతనంటే అజ్ఞానమనే పొర నీకు అడ్డువస్తోంది. అజ్ఞానమనే తెరని నీ అంతట నీవు కత్తిరించుకో లేకపోతున్నావు.

ఆ గురువు వచ్చి నీ చేత కత్తిరింపచేస్తాడు గురువు అంటే పెద్ద సర్జన్. ఆ కత్తిరిని నిన్ను ఊరికే ముట్టుకోమంటాడు కాని ఆ కత్తిరించటం ఆయనే కత్తిరిస్తాడు. గురువు అంటే సర్జన్‌లకే సర్జన్.

గురువు కృప లేదనుకో ఆ తెరను నీవు తొలగించుకోలేవు. నీ తెలివి తేటలు సరిపోవు. నీ సాధన సరిపోదు.నీ ప్రాణాయామం సరిపోదు, నీ పూజ సరిపోదు, గుళ్ళు, గోపురాలు సరిపోవు, ఈ జీవుడు ఎంతటివాడు నువ్వు ఎంత? ఈ సృష్టి ఎంత విశాలమైంది? అందులో నువ్వు ఎంత? నువ్వు చేసే మంచి ఎంత? నువ్వు సరిపోవు. నువ్వు సాధన చేసిన గురువు యొక్క అనుగ్రహం లేకపోతే అజ్ఞానం అనే తెరని తొలగించి బయటకి రాలేవు. గురువు నీ భక్తి ముదరనిస్తాడు నీ భక్తికి అభివృద్ధిలోనికి రానిస్తాడు. వచ్చిన తరువాత ఈశ్వరుడే చైతన్యంగా ఆత్మగా దర్శనం ఇస్తాడు.

ఆ లోపల చైతన్యంగా దర్శనం ఇవ్వటం కోసమే ఆ లోపల నిన్ను ప్రిపేరు చేయటం కోసం తన సహజ లక్షణాలుఅయిన ఆనందంతో, శక్తితో, జ్ఞానంతో రూపం ధరించి వస్తాడు. బయట గురువుగా ఎముకలతోటి, రక్తంతోటి, మాంసంతోటి కాదు ఊరికే నీకు అలా కనిపిస్తాడు. శాంతితోటి, శక్తితోటి, జ్ఞానంతోటి రూపందాల్చి వస్తాడు గురువు నీ హృదయంలో వున్న నిజమైన గురువు దగ్గరకి తోలుకువెళ్ళటానికి వస్తాడు.

ఆ నిజమైన గురువు దగ్గర ఎంత ఆనందం వుందో, అదే ఆనందాన్ని చేతితోటి పుచ్చుకుని, ఆ శక్తిని చేతితోటి పుచ్చుకుని, రూపం ధరించి వస్తాడు.

గురువు ఎలావస్తాడు అంటే వాడి రూపమే శాంతి, గురువుని ఏ మూల నుంచి చూచినా ఆనందమే. ఏ మూలనుండి చూచినా శాంతే. అంటే ఎముకలు కనపడవు, రక్తం కనపడదు, చర్మం కనపడదు, ఆనందమే ఆనందం ఎందుకు ఆ ఆనందం నీకు రుచి చూపించి నీ లోపల వున్న నిజమైన ఆనందంలోకి పంపించటం కోసం అలాగ ఆనందం రూపం ధరించి వస్తాడు గురువు.

అందుచేత గురువు ఎక్కడికి తీసుకువెళుతున్నాడు మిమ్మల్ని ఆ సర్వేశ్వరుడు దగ్గరకు తీసుకుపోతున్నాడు గురువు. హృదయంలో వున్న ఈశ్వరుని దగ్గరకు మిమ్మల్ని తీసుకుపోతున్నాడు కాబట్టి గురువు కూడా ఈశ్వరునితో సమానం.

పెరుమాళ్ళు అంటాడు భగవాన్‌తో నాకు చనిపోయే రోజులు దగ్గరకు వచ్చాయి. ఓ భగవాన్ ! నీకు నేను చాలా అపకారం చేసాను. నీకు ఎంత అపకారం చేశానంటే నేను చనిపోయిన తరువాత నేను నరకానికి వెళ్ళిపోతానని ఇప్పుడు తెలుస్తోంది అని అంటాడు పెరుమాళ్ళు. అప్పుడు భగవాన్ అంటారు ఓ పెరుమాళ్ళూ నీవు చేసిన చెడ్డ నేను జ్ఞాపకం పెట్టుకోను. నీవు చేసిన మంచే జ్ఞాపకం పెట్టుకుంటాను. ఓ పెరుమాళ్ళూ నువ్వే కనుక నిజంగా నరకానికి వెళితే నీ కోసం నేనూ నరకానికి వస్తాను, నీకు లేని స్వర్గం నాకెందుకు? నీకు లేని మోక్షం నాకెందుకు? నీ కోసమే నేను కూడా నరకానికి వస్తాను పెరుమాళ్ళూ అంటాడు భగవాన్.

దయలేకుండా ఏ గురువూ వుండడు. నీ ఒక్కడికోసం నరకానికి వస్తానన్నాడు. అందుచేత గురువుతో సంబంధం తెగదు. ఎందుచేతనంటే అజ్ఞానం నశించే వరకు, మనస్సు నశించేవరకు వాడికి ఆత్మజ్ఞానం కలుగదు.

అయ్యో గురువు యొక్క వైభవం గ్రహించలేకపోతున్నాం. గురువు పట్ల భక్తిలేదని మనం తపిస్తుంటే భక్తి కలిగేటట్లు అనుగ్రహిస్తాడు వాడు గురువు. దయ అనేది దేవుని గుణంకాదు, దయ అనేది దేవుని స్వభావం. భగవాన్‌ని నేను తలపెట్టుకుంటున్నాను, అని నీవు అనుకుంటావు. భగవాన్‌ని తలపెట్టుకునే జ్ఞాపకం కూడా భగవానే!

ఈశ్వరుడు నీ కంటే శక్తివంతుడు, నీ కంటే వివేకవంతుడు, నీ రాబోయే జన్మలు ఆయనకు తెలుసు. నీకు వర్తమానకాంల ఒకటే తెలుసు, ఆయనకు వర్తమానకాలం, భూతకాలం, భవిష్యత్తుకాలం కూడా తెలుసు ఏల నీకు ఈ గోల!

నీవు తరించడానికి అనేక సాధనాలున్నాయి. అన్ని సాధనలకంటే సత్సంగం గొప్ప సాధనం అంటున్నారు భగవాన్. సత్పురుషులతోటి కలిసి వుండటం గొప్ప సాధన, దాని వల్ల కూడా నీ మనస్సు నశిస్తుంది. అహంభావన నశిస్తుంది. దేహ భావన నశిస్తుంది. అన్ని సాధనలకంటే గొప్ప సాధన విశిష్టమైనటువంటి సాధన సత్సంగము.

నీవు కాని వానితో అనుబంధం తగ్గిస్తువుంటుంది. సత్సంగము మానవుడు మామూలుగా అజ్ఞానంలో కూరుకుపోయి వుంటాడు. హెచ్చుతగ్గులుగా వుంటాడు. మనస్సులో మెఱక, పల్లాలు వుంటాయి. అవి అన్ని సత్పురుషుల సహవాసం వల్ల నేచురల్‌గా, నార్మల్‌గా తగ్గుతూవుంటాయి. సత్పురుషుల దగ్గర, మహాత్ముల దగ్గర నీవు కూర్చుంటే యోగబలం ఎక్కడ వుందో బుద్ధిబలం ఎక్కడ వుందో, ఎక్కడైతే శాంతికాముకలు ఉన్నారో, అక్కడ నీవు కూర్చుంటుంటే అది కూడా గొప్ప సాధనతోటి సమానం.

నీవు బాగుపడటానికి జపం ఎలా చేసుకుంటున్నావో, ధ్యానం ఎలా చేసుకుంటున్నావో నీవు తరించడానికి నిష్కామకర్మ ఎలా చేసుకుంటున్నావో అలాగే సత్సంగము కూడా నీ మనస్సును అణచడానికి ఒక ఉపాయమయ్యా! నీవు సత్‌పురుషులతోటి సహవాసం చెయ్యగా, చెయ్యగా నీకు రాబోయే జన్మలు, కల్పించే తలంపులు, వాసనలు క్షీణిస్తాయి, పలచబడతాయి.

ఎటువంటి కుటుంబంలో వుంటే జ్ఞానం కలుగుతుందో అటువంటి కుటుంబంలో మనకి శరీరం కలుగజేస్తాడు ఈశ్వరుడు.

భగవాన్ అంటున్నారు నీకు సత్పురుషులతోటి సహవాసం దొరికితే ఇంకేమి కావాలయ్యా! సత్పురుషుల సహవాసం అంటే మాటలు అనుకుంటున్నావేమో! ఆ సత్పురుషుల సహవాసంలోనే నీకు అన్నీ వచ్చేస్తాయి. ముముక్షత్వం వచ్చేస్తుంది. వాళ్ళు కేవలం నీకు బట్టలు కొనడమేకాదు. నీ ఆది తీసుకుని బట్టలు కుట్టించి నీకు తొడుగుతారు. అది సత్పురుషుల యొక్క గొప్పతనం.

సత్పురుషులలోపల జ్ఞానమనే వెలుగు వుంది. అక్కడకి తీసుకువెళ్ళడానికే నీకు సహకరిస్తాడు. ఒక జ్ఞాని పట్ల నీకు భక్తి నిలబడుతుంటే వారి మాటలతో పనిలేదునీకు. నీవు వారి ముఖం చూడటం వల్ల వారి నేత్రాలు చూడటం వల్ల కూడా నీకు జ్ఞానం కలుగుతుంది అది జ్ఞానియొక్క వైభవం.

జ్ఞానినీకు మంచి చెప్తానని చెప్పడు. వాడి ద్వారా నీకు మంచి జరుగు తుంటుంది. నీ మనస్సులో మార్పు తీసుకువస్తునట్లుగా నీకుచెప్పడు. నాస్తికుడు ఆస్థికుడు అవుతాడు. ఆస్థికుడు భక్తుడు అవుతాడు, భక్తుడు జ్ఞాని అవుతాడు, నీ మానసిక స్థాయిని అలా పెంచుతూ వుంటాడు. ఇదంతా సహజంగానే  నీకు చేసుకుంటూపోతాడు.

గురువు నీకు తెలియకుండానే శాంతి తరంగాలు, శక్తి తరంగాలు నీలోకి పంపిస్తుంటాడు. జ్ఞాని సమక్షంలో ఈ ప్రక్రియ జరుగుతుంటుంది. అలా జ్ఞాని హృదయంలో ఒక్కసారి పడ్డామా ఆయన దయకి ఒక్కసారి అర్హుడివి అయ్యావా, ఏదో ఒక జన్మలో నిన్ను తరింపచేస్తాడు. తన స్వరూపాన్ని నీకు ఇచ్చేవరకు నిన్ను వెంటాడుతాడు.

నీ హృదయంలో వున్న ఈశ్వరునితో నీకు అనుసంధానం కుదిరితే మంచిదే, అలా వుండలేకపోతే బయట సత్పురుషులతోటి నీకు సహవాసం అవసరం, ఇంట్లో వుంటే ఏకాంతవాసం, బయటకి వస్తే సజ్జనసాంగత్యం అపుడు నీకు మనస్సు నశిస్తుంది.

ఆదిశంకరాచార్యులు ఏమన్నారంటే ఈ జనన,మరణ చక్రంలోంచి నీవు బయటకి రావటానికి విషయ ప్రపంచంలోంచి నీవు బయటకి రావటానికి ప్రియ, అప్రియంలోంచి బయటకి రావడానికి సత్సంగమనే నౌక తప్పించి మించినది ఏమీలేదని చెప్పారు.

గౌతమ బుద్ధుడు అంటాడు ! మీ ఇంట్లో ఉన్న నిప్పులను పట్టుకెళ్ళి కాలవలో పడవెయ్యమన్నాడు. కాలువ అంటుకోదు, కాని నిప్పులు ఆరిపోతాయి.

అలాగే ఒక మహాజ్ఞాని సమక్షంలో గురువు సమక్షంలో మీ ద్వేషాలు, మీ కక్షలు, మీ కార్పణ్యాలు, తెచ్చి జ్ఞాని హృదయంలో పడవేస్తే జ్ఞాని నశించడు మీ కార్పణ్యాలు నశిస్తాయి. మీ నాన్సెన్స్ అంతా పట్టుకెళ్ళి జ్ఞాని హృదయంలో పడవేస్తే మీ నాన్సెన్స్ అంతా కాలిబూడిద అయిపోతుంది. జ్ఞాని యొక్క వైభవం అటువంటిది. గురువు యొక్క వైభవం అటువంటిది. భూమికి ఎంత సహనం వుంటుందో జ్ఞానికి అంతే సహనం వుంటుంది.

జీవకోటి ద్వారా పనిచేసేవాడు ఈశ్వరుడు మనల్ని స్తోత్రం చేసే వాళ్ళు వుంటారు, విమర్శించేవారు వుంటారు, మనం నిందాస్థుతులకు అతీతంగా వుంటున్నామా, లేదా అది, చూచుకోవడానికి ఈశ్వరుడు ఏమిచేస్తాడంటే ఏదో ఒక జీవుడిని ఉపయోగించుకుని వాడు పనిచేస్తాడు.

ఒక జీవుడి చేత స్తోత్రం చేయిస్తుంటాడు, ఒక జీవుడుచేత నిందిస్తుంటాడు, ఇదంతా ఈశ్వరుడు చేస్తున్నాడని వాడికి తెలియదు.

ఈ నిందాస్థుతులకు ఎవడైతే అతీతంగా వుంటాడో వాడినిచూచు కుంటాడు, చూచుకుని వాడిమీద ఈశ్వరుడి దయను వర్షం లాగ వాడి శిరస్సు మీద కురిపిస్తాడు.

ఈశ్వరుడి కరుణతో తడిపి, తడిపి ముద్దచేసి వాడి స్వరూపాన్ని ఇస్తాడు. ఎవరో ఒకరి చేత నిందిస్తాడు ఒకరి చేత స్తోత్రం చేయిస్తాడు, అపుడు వికారం వస్తే తీసి ఒక ప్రక్కన పెట్టేస్తాడు. అంటే పునర్జన్మకి పంపివేస్తాడు.

ఈ భక్తుడి చుట్టూ వికారాలు కలుగచేస్తాడు ఈశ్వరుడు. వికారాలు కలుగజేసినపుడు నిర్వికారంగా వుంటాడనుకోండి, ఈ చక్రంలోంచి బయటకు తీసివేస్తాడు. ఆయన దయతోటి తడుపుతాడు. తన స్వరూపాన్ని ఇస్తాడు. వాడే దేవుడు. ఈ జనన, మరణ చక్రంలోంచి ఈ వికారాలలోంచి, ఈ నామరూపాలలోంచి, విడుదల పొందటానికి ఒక నౌక వుంది సత్పురుషుల సహవాసం, మహాజ్ఞాని సహవాసం ఒక పెద్ద నావలాంటిది. నదిని దాటటానికి నావ ఎటువంటిదో అలాగే ఈ జనన, మరణ చక్రంలోంచి ఈ ప్రవాహంలోంచి విడుదల పొందడానికి మహాత్ములు, సత్పురుషుల సాంగత్యం కూడా ఒక నావలాంటిది అని ఆదిశంకరా చార్యులవారు చెప్పారు. ఒక మహాజ్ఞాని దగ్గరకు వెళ్ళాము అనుకోండి ఆ జ్ఞానికి మనయందు ప్రేమ భావన కలిగింది అనుకోండి, వాడు మన శరీరం వంక చూడడు. మన గుణాల వంక చూడడు. మన మనస్సు వంక చూడడు, మన ఇంద్రియాల వంక చూడడు, వాడు బ్రహ్మమైయున్నాడు. మన హృదయంలో కూడా బ్రహ్మం వుంది సరిగ్గా నీ హృదయంలో వున్న బ్రహ్మము వంకే చూస్తాడు.

ఎక్కడో మన హృదయాంతరాళ్ళలోకి చూస్తున్నాడు, అంతే మన పని పూర్తి అయ్యిపోతుంది. ముందు రైల్లో కూర్చోబెట్టి వేస్తాడు. ఒక గంట, రెండు గంటలు ఆల్యమైనా మోక్ష సామ్రాజ్యంలోకి ఆత్మ సామ్రాజ్యంలోకి ప్రవేశింపచేస్తాడు.

యుగాల తరబడి తపస్సులు చేసినా, యుగాల తరబడి మంచి పనులు చేసినా ఒక మహాత్ముడి కృప వాడు ఒక్కసారి మన వంకచూస్తాడు అనుకోండి మన పని పూర్తి అయ్యిపోతుంది. మన జీవితాలు ఆనందసాగరంలో మునిగిపోతాయి. ఒక దేవతా పురుషుడు స్పర్శ చాలు, అది డబ్బువలన పాండిత్యంవలన వచ్చేది కాదు డబ్బువలన దేవుని చూడలేము.

ఎవరికైతే జ్ఞానం వుందో ఎవరికైతే ముముక్షత్వం వుందో ఆ జ్ఞానాన్ని ఎవరైతే ఆపేక్షిస్తున్నారో, వాళ్ళు గురువుని ఆశ్రయించి, గురువుకి నమస్కరించి గురువుని గౌరవించి వాళ్ళు భిక్షచేసుకుని ఆ భిక్షాన్నం సగం గురువుకి బెట్టి ముందు గురువు తీసుకున్నాక మిగతా అన్నం వాళ్ళు తిని అలా తరించారు, పూర్వం కొంతమంది. డబ్బువుందని కార్లు, విమానం కొనుక్కోగలం, డబ్బువుందని భగవంతుని పట్ల భక్తిని ఎలా కొనుక్కోగలం.

గురువుని శిష్యుడు అడిగితే చెప్పిన దానికి శిష్యుడు ఏమి అడగకుండా గురువు చెప్పిన దానికి తేడా వుంటుంది. శిష్యుడు ఏమన్నా అడిగితే గురువు అడిగిందే చెబుతాడు కాని గురువు చెప్పాలనిపిస్తే ఒక ప్రవాహంలా వుంటుంది.

గురువు తన హృదయం పొంగిచెప్పటంవేరు, అది టీచింగ్. అలా ఆచార్యుడే చెప్పగలడు. అది ఆయనకే సాధ్యం.

పూర్వం ఆచార్యులు తాను చెప్పటమే కాదు తన భక్తులని తనకూడా పెట్టుకుని తనకి ధనం వుంటే పోషించేవాడు. అలా ఎందుచేతనంటే తన శరీరంతోటి అది ఆగిపోకూడదని మిగతావాళ్ళు కూడా జ్ఞానం గురించి బోధించాలని ఆ గురువు అనుగ్రహం వుంటే కూర్చున్నవారు నిలబడేలోపు జ్ఞానంతో అనుగ్రహించగలడు.

ఇపుడు మీలో ఎవరికైనా నక్సలైట్లు వచ్చి కళ్ళకు గంతలు కట్టి ఎక్కడికో అడవిలోకి తీసుకు వెళ్ళి వదిలేసారనుకోండి అక్కడ్నుంచి ఇల్లు మనదైన మనం రాలేం. ఆ డీప్ ఫారెస్ట్‌లోంచి ఎవరో ఒకరు రోడ్డు చూపిస్తే కాని మీరు రాలేరు. అలాగే కటిక చీకటిలోంచి అజ్ఞానం అనే అడవిలోంచి మిమ్మల్ని మీ నిజమైన ఇంటికి దారి చూపించి చేర్చేవాడే గురువు.

ఒక్కోసారి దుఃఖం వస్తే కంగారు పడకండి గురువు నన్ను వదిలేసి ఎక్కడికి పోయాడు, అడ్రసు లేకుండా అని మిమ్మల్ని అనుకోనిస్తాడు. నీ గురువుకి తెలియకుండా దుఃఖం రాలేదు, మిమ్మల్ని విడిచిపెట్టటానికి కాదు. అవన్నీ ఎందుకు చూపిస్తాడంటే ఆయన ఒడిలోకి తీసుకోవడానికి ఈ ప్రక్రియ చేస్తున్నాడని తెలియక గురువుని తిడతాం. ఒక వేళ ఆయన్ని తిట్టినా క్రిందకు పడవేయడు. ఆయన ఒడిలోకి తీసుకుంటాడు ఆయనే గురువు.

గురువు జ్ఞానం గురించి చెప్పటంకాదు. జ్ఞానం ఇవ్వటమే గురువు వేరు దేవుడు వేరు కాదు. గురువు మీద భక్తి కలగటం కష్టం, ఎదురుగా మన కళ్ళకి కనిపిస్తుంటాడు. అందుచేత గురువుని నమ్మటం కష్టం మిమ్మల్ని ఉద్ధరించడానికి గురువు తప్పించి ఎవరున్నారు.

ఒక అవతార పురుషుడు శరీరం ధరించాడంటే లోకాన్ని అనుగ్రహించ టానికే కాని ఇంకో పని వుండి కాదు. ఆ గురువుతోటి మానసిక అనుబంధం

కలగటం కష్టం. పూర్వ పుణ్యం లేకుండా అది సాధ్యంకాదు. గురువుతోటి మనకి ఏదన్నా అనుబంధం వచ్చిందనుకోండి మొట్టమొదట ఏదో ప్రేమిస్తున్నాం ఆయన వలన ఏదో జ్ఞానం నేర్చుకుంటున్నాం అనిపిస్తుంది. కొంత కాలానికి కొంత లోతులోకి వెళ్ళాక తెలుస్తుంది. అది జన్మాంతర అనుబంధం అని అది ఈనాటిది కాదు ఏనాటిదో అనేటటువంటి అనుభవం మనకి కలుగుతుంది.

గురువు చూస్తూ వుంటాడు. వాడు చెబుతాడు, చెబుతాడు మీరు వినకపోతే ఏమి చేస్తాడంటే దూళ్ళకి పడగొట్టి గొట్టంపెట్టి పోసేస్తారు. అలాగే మిమ్మల్ని పడగొట్టి వేసి లోపల గొట్టంపెట్టి జ్ఞానం పోసేస్తాడు. మీ చేత ఆ జ్ఞానాన్ని తాగింపచేస్తాడు. అంటే మీరు ఏమనుకుంటున్నారో వాడికి అక్కరలేదు. వాడు మిమ్మల్ని ఎక్కడికి తీసుకువెళ్ళాలో అక్కడికి తీసుకువెళ్ళే వరకు ఈ జన్మలోనే కాదు రాబోయే జన్మల్లో కూడా మిమ్మల్ని వెంటాడుతాడు వాడు గురువు.

గురువు కృప బలీయమైనది వశిష్టుడు రాముడికి బోధిస్తూ పురుష ప్రయత్నం అవసరమే కాని గురువనుగ్రహంతో పోల్చుకుంటే నీ ప్రయత్నం ఏపాటిది. దాని అర్థం ఏమిటంటే, ఈశ్వరుడు మనకి 10 అడుగుల దూరంలో వుంటే మనం కష్టపడి ఒక్క అడుగు వేస్తే 9 అడుగులు ఎదరకి వచ్చి మనల్ని తన వడిలోకి తీసుకుంటాడు వాడు గురువు.

ఇక్కడనుంచి చేసేదేదో చెయ్యి ఆ వరద అక్కడనుంచి రావాలి. ఆ అనుగ్రహం అనే వరద వచ్చినపుడు నీలో బలహీనతలు,నువ్వు కాని గొడవలు, నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా కొట్టుకుపోతాయి. అట్టిది ఆ వరద.

గురువు చేసే పని బయటకి ఎక్కడ కనిపించదు. లోపల ఎక్కడో వున్నాడు. నీ కళ్ళకు కనపడడు. కాని లోపల ఏమి జరుగుతుందో నీకు రిజల్టు వచ్చేవరకు తెలియదు. రిజల్టు వచ్చాక తెలుస్తుంది అనవసరంగా గురువుని తిట్టిపోసామని. మిమ్మల్ని ఆత్మలోకి తీసుకువెళ్ళటానికే ఆ తిట్లు అన్ని భరించాడు. ఈ తిట్లు అన్ని గురువు కాకపోతే ఎవరు భరించగలరు.

ఒక్కోసారి గురువుకి మన చేత్తో విషం ఇస్తే ఆయన చేత్తోటి మనకి పాయసం ఇస్తాడు. ఆత్మజ్ఞానం మాత్రం గురువు ఒక్కడే ఇవ్వగలడు. అందుచేత గురువుని మర్చిపోవద్దు. గురువు లేని విద్య గుడ్డివిద్య మీకు ఆత్మవిద్య కలగకుండా ఎన్నివేల కోట్లు వున్నా అశాంతిలోంచి దుఃఖంలోంచి బయటకు రాలేరు. ఎవ్వరూ రాలేరు. అది గురువు యొక్క ప్రసాదం. అది గురువుకే చెల్లింది ఇవ్వటానికి.

కొంతమంది గురువే దేవుడు. గురువు దగ్గరకు వెళితే ఆత్మగురించి బోధిస్తాడు మనకి ఏదో చెబుతున్నాడులే అనిపిస్తుంది. వాళ్ళు చెప్పేది మన గుండెకు అందటం కోసం మనకి తెలియకుండా లోపల్నించి దయను పంపిస్తాడు మీకు అర్థం అవ్వకపోతే ఇంకా క్రిందికి వచ్చి చిన్న చిన్న మాటలతో చెబుతారు. చెప్పటమేకాదు అర్థం అవ్వకపోతే మీకు అర్థం అయ్యేబుద్ధిని ప్రసాదిస్తాడు వాడు గురువు.

గురువు ఏదైనా ఒక మాట చెబితే సూర్యుడు ఎంత దూరం ప్రసరిస్తున్నాడో ఆ గురువు మాటలు అంత దూరం ధ్వనిస్తాయి. ప్రతిధ్వనిస్తాయి. గురువు ఏ సత్యస్థితిలో వున్నాడో, నీ పిలక పట్టుకుని ఆ స్థితికి నిన్ను చేర్చేవరకు నీవు కోటి జన్మలు ఎత్తినా నీవు చెడ్డలోకాలలో వున్నా మంచి లోకాలలోవున్నా నిన్ను విడిచిపెట్టడు వాడు గురువు.

కృష్ణుడు యజ్ఞాల వల్ల యాగాల వల్ల పుణ్యాల వల్ల అర్జునుడికి విశ్వరూపం చూపించలేదు. తను చూపించాలి అనుకున్నందువల్ల చూపించాడు అదే గురువు అనుగ్రహం అంటే వాడు గురువు.

గురువు రూపం, నామం మాత్రమే నిన్ను హృదయంలోకి చేరుస్తుంది. మనం ఏమి చేయలేము. అంతా గురువు చేసే పని ఆయనదే భారం ఆయనని స్మరించటమే మనకి నిజమైన పని. కృష్ణుడు అన్నాడు గురువు అనుగ్రహం లేకపోతే నువ్వు లోకంలో వున్నవి అన్నీ చేసినా సున్నా అన్నాడు.

యజ్ఞాలవల్ల, యాగాల వల్ల, దానాల వల్ల, ధర్మాల వల్ల, మనకి మంచి తలంపులు, చెడ్డ తలంపులు రావటం ఆగదు. గురువు దయ అనుగ్రహం వల్ల మాత్రమే ఆ రెండు తలంపులు నుండి విడుదల అవుతాము.

మనకి తలంపు వచ్చింది అంటే గురువు దగ్గరనుంచే వస్తుంది. ఆ తలంపు సుఖం అయినా, కష్టం అయినా భరించాలి. భరించి ఈ తలంపు గురువుకి తెలియకుండా రావటం లేదు. ఆ తలంపు దగ్గర గురువుని చూసుకోవాలి చూచుకుంటే సుఖం, శాంతి, ఆనందం, ఆ గురువు దగ్గరే దొరుకుతుంది. అది చూసుకోవటానికే నీకు జ్ఞానం అవసరం. లేకపోతే నీకు జ్ఞానంతో పని ఏమివుంది. అక్కడే నువ్వు వివేకం ఉపయోగించు కోవాలి.

ఈ సృష్టిలో ఏదీ నీది కాదు గురువు చెప్పిన మాటలు ప్రతీ క్షణం స్మరించుకోవాలి. ఆ గురువు మాటే మనల్ని దుఃఖం లేని స్థితికి తీసుకువెళు తుంది. నీ అహంభావనను తొలగించుకోవడానికి వేల జన్మలు పడుతుంది. అప్పుడు కూడా గురువు అనుగ్రహం వల్ల మాత్రమే తొలగించాలి.

కోటి యజ్ఞాలు చేసినా, కోటిదానాలు చేసినా, కోటి హోమాలు చేసినా, కోటి తీర్థయాత్రలు చేసినా, కోటి సత్రములు కట్టించినా గురువు అనుగ్రహం వల్ల మాత్రమే జ్ఞానం వస్తుంది.

గురువు అనుగ్రహం, ఆవరణ దోషం, విక్షేప దోషం, మల దోషం ఈ మూడు వుండటం వల్ల గురువు అనుగ్రహం మనకి తెలియటంలేదు. మీరు ఎప్పుడైనా గురువుని ప్రేమించారా? గురువుని గౌరవించారా? గురువును ప్రేమించకూడదు, గురువుని గౌరవించకూడదు మీకు అనుగ్రహం మాత్రం నెత్తిమీద వర్షం కురిసినట్టు కురవాలి. నీకు ఎప్పుడైనా శాంతి వచ్చింది అనుకో అది గురువు అనుగ్రహమే. ఆత్మజ్ఞానం వల్ల వచ్చే ఫలం మోక్షం అది గురువుకే సాధ్యం. గురువు చింతన తప్పించి మీరు ఏది చింతించినా మంచికి, మంచి, చెడ్డకి చెడ్డ వడ్డీతో సహా వచ్చి తీరుతుంది. గురువు చింతన తప్పించి ఏది చింతించినా పునర్జన్మ వచ్చి తీరుతుంది. ఆత్మవిశ్వాసం లేకపోతే ఆత్మ జ్ఞానం రాదు. మనకి ఆత్మవిశ్వాసం కలగటానికి కూడా గురువే సహాయం చేయాలి.

ఈశ్వరుడిలో గురువులో ఉన్న సారమే వాక్యరూపంలో వస్తుంది. ఒక భక్తుడు అన్నాడు గురువుగారిని ఏదీ నిజం కాదు అంటున్నారు కదా మరి ఎందుకు దుఃఖం వస్తుంది? అని అడిగాడు.

నిజం కాని దానిని నిజం వలె అనుకుంటున్నావు అందుకే దుఃఖం వస్తుంది.

గురువుని పొందటం అంటే మోక్షాన్ని పొందటమే. నా టీచింగ్ యొక్క లక్ష్యం ఏంటి అంటే మిమ్మల్ని దుఃఖం లేని స్థితికి తీసుకువెళ్ళాలి అప్పుడప్పుడు పరిస్థితులు బావుంటే సుఖంగా వుంటాం. అది కాదు పూర్ణంగా శేషం లేకుండా దుఃఖం నశించాలి. అపుడు నిజసుఖి ఆ స్థితికి

వెళ్ళటానికే మా టీచింగ్. గురువు తలంపుతోనే వుండాలి. గురువుకి శరణాగతి చెందివుండాలి ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే వస్తువు అదే గురువు. అదే లోకం కింద జీవుడు కింద కనిపిస్తుంది. అంతకంటే ఏమీ లేదు.

గురువు జ్ఞానంతో జన్మనిస్తాడు. గురువు ఆజన్మ ఇస్తే భూమి మీదకి తిరిగి రానక్కర్లేదు. అట్టివాడు గురువు.

మీ గురువు నిజం అయితే మీకు ఆ విశ్వాసం వుంటే మీరు చనిపోయినపుడు ఆనందంగా చనిపోతారు. మీ గురువు మీద వున్న ప్రేమ నిజమైతే, భక్తి నిజమైతే వెంటనే మీకు జ్ఞానం వచ్చేస్తుంది.

మీకు లోకంలో వున్న అన్ని భోగాలు ఉన్నాయనుకోండి దాని వల్ల కూడా మీకు సుఖం వస్తుంది. కాని మీకు ఎపుడన్నా దుఃఖం వస్తే అది మిమ్మల్ని ముట్టుకుంటుంది. అలాకాకుండా మన బ్రెయిన్‌కి, మన మనస్సుకి సహాయం, సహకారం, మన గురువు దగ్గరనుంచే వస్తుందని తెలిస్తే అది మనల్ని ముట్టుకోనివ్వదు, గురువు చెయ్యనివ్వడు వాడు గురువు.

మనకి వచ్చే తలంపులు, ఆలోచనలు వస్తే గురువు మీద ఆధారపడాలి, మనకి వచ్చే అశాంతి, టెన్షన్‌లను గురువు తీసేస్తున్నాడు అని తెలియక భోగాలు మీద ఆధారపడుతున్నాం, మన అశాంతి, దుఃఖం, టెన్షన్ కాదు మన ఆకలి కూడా తెలుసు గురువుకి.

గురువును రాళ్ళతో కొట్టినా సరే మీ మీద ప్రేమ తగ్గదు వాడు గురువు. మీరు నరకానికి వెళ్ళినా సరే మీతో నరకానికి వస్తాడు మీరు మోక్షం పొందేవరకు మీతోనే వుంటాడు గురువు. గురువు సహవాసం వల్ల మాత్రమే జ్ఞానం వస్తుంది. యజ్ఞాలలో, యాగాలలో కోరికలలో ఇష్టాలలో ఏముంది సుఖం అంతా గురువు అనుగ్రహంలోనే వుంది.

మీ మనస్సును నిగ్రహించుకోండి అని చెప్పటం కాదు. మనస్సు నిగ్రహింపబడే వాతావరణం తీసుకువస్తాడు వాడు గురువు. గురువు పాదాలను అంటిపెట్టుకుని వున్నంతకాలం నీ మనస్సు ప్రపంచం వైపుకు తిరగదు. గురువు పాదాలు విడిచి పెడితే నువ్వు మాయలో పడిపోతావు.

మీకు ఎప్పుడైనా దుఃఖం వచ్చిందనుకోండి ఆ దుఃఖం నిజంకాదు. ఆ దుఃఖం అనుభవించేవాడు నిజం కాదు అలాగే సుఖం వచ్చినా ఆ సుఖం నిజం కాదు, ఆ సుఖాన్ని అనుభవించేవాడు నిజం కాదు. ఇది అంతా మహాస్వప్నం అన్న సంగతి కూడా మీకు తెలియదు. గురువు అనుగ్రహం లేకపోతే ఇది మహాస్వప్నం అన్న సంగతి కూడా మీకు తెలియదు.

ఆత్మజ్ఞానం యొక్క ఫలమే మోక్షం అది శాశ్వతమైనది. అది ఎవరు ఇస్తారు? మీ ఇంట్లోవారు, బంధువులు, స్నేహితులు ఇస్తారా? ఆత్మజ్ఞానదాత గురువు ఇస్తాడు.

గురువుని మీరు చూడగానే చైతన్యం గుర్తుకురావాలి. ఆత్మ గుర్తుకురావాలి. ఆత్మే గురు రూపం ధరించి వచ్చింది మన మీద దయతో అని గుర్తుకు రావాలి. గురువు ప్రతి తలంపు గమనిస్తాడు. సాక్షిగా చూస్తుంటాడు. అలాగే జాగ్రదావస్థలోచూస్తుంటాడు వాడు గురువు.

గురువుని ఆశ్రయించు గురువు చెయ్యిపట్టుకో గురువుని సేవిస్తూవుంటే గురువుని ప్రేమిస్తుంటే, నీకు ఏ కారణం వలన దుఃఖం వస్తుందో ఆ కారణాన్ని ఎలా తొలగించాలో గురువు చూచుకుంటాడు.

గురువు యొక్క ప్రేమ పుష్కలంగా వుంటుంది. గురువు ప్రేమ అపురూపంగా ఉంటుంది. గురువు ప్రేమను తల్లిప్రేమతో పోలిస్తే గురువుని అవమానించినట్లు. కనీసం గురువు ప్రేమ అర్థమైనా చాలు నీకు మోక్షం వస్తుంది.

ఒక భక్తుడు నన్ను విడిచి పెట్టేశావు ఏంటి? అని భగవాన్‌ని అడిగాడు.

భగవాన్ ఏ అనుగ్రహం వల్ల అయితే నిన్ను నా పాదాల దగ్గరికి తీసుకువచ్చిందో ఆ అనుగ్రహమే ఇపుడు వుంది. భవిష్యత్తులోనూ వుంటుంది, చివరిదాకా వుంటుంది. నువ్వు ఈ దేహం విడిచి పెట్టి కొత్త దేహం ధరించి తరువాతకూడా వుంటుంది. నన్ను చేరే వరకు వుంటుంది నా అనుగ్రహం. ఇది పక్కా దస్తావేజులు, మీ ఆస్తులు, దస్తావేజులు గవర్నమెంటు మారితే మారిపోతాయి. నా దస్తావేజులు మారేవి కావు. నా అనుగ్రహం లేకపోతే, నా దయ లేకపోతే గురువుని కూడా మీరు స్మరించలేరు. అట్టిది గురువు అనుగ్రహం. మీకు గురువు మీద పూర్తి శరణాగతి వుంటే దేహంతో వచ్చే ప్రారబ్ధం నిన్ను ఏమిచేస్తుంది.

గురువు మాట్లాడుతుంటే అక్కడ మాట్లాడేది ఆత్మ చైతన్యం. జాగ్రదావస్థ, నిద్రావస్థ, స్వప్నావస్థ ఈ మూడు అవస్థలు అసత్యమే. ఈ అవస్థలు మూడు అసత్యం అనే అనుభవం గురువుకి వుంటుంది. గురువు సమక్షంలో వున్నప్పుడు మీ ప్రయత్నంతో సంబంధం లేకుండా మూడు అవస్థలను దాటిస్తాడు. అపుడు మనస్సు తాత్కాలికంగా అయినా శాంతి సాగరంలో ఐక్యం అవుతుంది. మనకి ఈ మూడు అవస్థలు తెలుసు. మూడు అవస్థలకు ఆధారంగా వున్న తురీయ స్థితి అదినాలుగో అవస్థ మనకి తెలియదు, ఆ నాలుగో అవస్థలో గురువు వుంటాడు. ఈ మూడు అవస్థలను సడెన్‌గా దాటించే టప్పటికి ఆ నాలుగో అవస్థయొక్క శాంతి మీకు అందుతుంది. అది గురువుకే సాధ్యం. ఇటువంటి శాంతి మాకు అనుభవంలోకి వచ్చింది అని చెప్పటానికి అందని శాంతి గురువు సమక్షంలోనే వస్తుంది. నాలోని బలహీనతలు చూపించి పంపిస్తే నీవు గురువు ఎలా అవుతావు. నీ దయ చూపించి నాలో దోషాలను సమూలంగా నాశనంచేసి నీలో ఐక్యం చేసుకో అరుణాచలా!

మీ పరిస్థితులు బాగాలేదు అనుకోండి గురువుకి మీరు శరణాగతి పొందరు అనుకోండి అపుడు దుఃఖం వస్తే ముట్టుకుంటుంది. మీ దేహ ప్రారబ్ధం ఎంత చెడ్డగా వున్నా మీ శరణాగతి నిజమైతే అది మీ మనస్సుని ముట్టుకోదు. గురువు పట్ల శరణాగతి భావనలేక వాడు తట్టుకోలేకపోతున్నాడు. గురువు పట్ల వున్న నీ భక్తి నిజమైతే నీ సాధనతో సంబంధంలేకుండా అహంభావన, వేరు భావన నశిస్తుంది. గురువు ఎంత ప్రేమ, ఆప్యాయత చూపిస్తున్నాడో నువ్వు కూడా అంత ప్రేమ, ఆప్యాయత చూపించాలి గురువు మీద. నా నామం స్మరిస్తుంది కదా అని నీలో ఎన్ని వాసనలు వున్నా వాటినన్నిటినీ తీసివేస్తాడు గురువు.

నీకు కీర్తి, ధనం, గౌరవం, చదువు ఏమీ లేకపోయినా గురువుమీద ప్రేమ, ఇష్టం వుంటే చాలు. ఆత్మజ్ఞానం వచ్చేస్తుంది. మీకు బాహ్యంగా ఏదైనా కలిసి వచ్చింది అనుకోండి, అపుడు శాంతి వస్తుంది అది పది రోజులో, ఇరవై రోజులో వుంటుంది. కాని గురువు అనుగ్రహం వల్ల వచ్చే శాంతి మీ దేహానికి, మీ మనస్సుకి మీ చావుకి పుట్టుకలకి అతీతమైనది గురువు అనుగ్రహం వల్ల వచ్చే శాంతి.

రామకృష్ణపరమహంస శరీరం విడిచి పెట్టాక ఆయన శిష్యులలో ఒకరు వివేకానందస్వామితో ఏమన్నారంటే మనం ఎన్నుకున్న గురువు మనల్ని ఒడ్డుకు తీసుకురాగలడా, లేకపోతే మధ్యలో వదిలేస్తాడా అని అడిగాడు.

దానికి వివేకానందస్వామి ఏమన్నారంటే ఆ దక్షిణేశ్వరంలో వున్న బీద బ్రాహ్మణుడు ఆ దక్షిణేశ్వరంలో వున్న చదువులేని బ్రాహ్మణుడు నాకు గురువుగా సరిపోతాడు. నా మనస్సు ఆయన మనస్సుతో శృతి కలుపుతోంది. ఆయనకు చదువురాదు పాండిత్యం లేదు వెనకాల పైసలు లేకపోయినా ఆయన అంటే నా మనస్సు ఇష్టపడుతోంది కాబట్టి ఆయన్ని నేను గురువుగా

ఎన్నుకున్నాను. ఇందులో రాజీలేదు. నీకు ఇష్టం లేకపోతే ఇంకొక గురువు దగ్గరకు వెళ్ళవచ్చు. నాకు ఏమీ అభ్యంతరం లేదు అని అన్నారు. వివేకానంద చివరి రోజు వరకు ఆ విశ్వాసంతోనే వున్నాడు. గురువు మీద చలనం లేని విశ్వాసం వుండాలి.

పూర్వం కొంతమంది గురువులకు విద్యతోపాటు ఐశ్వర్యంకూడా వుండేది. వాళ్ళు యోగ్యత అయిన  పూర్వం శిష్యులకు తినడానికి అన్నం లేకపోతే అన్నం పెట్టి చదువు చెప్పేవారు. ఒకరకంగా ఆచార్యుడి ఇల్లు కూడా అనాధశరణాలయమే.

మీకు తెలివితేటలు తక్కువ వున్న  గురువు చెప్పిన మాటలు మీద విశ్వాసం వుంటే తెలివైనవారికంటే ఎక్కువ లాభం పొందుతారు. మీరు ఆలోచించి, ఆలోచించి కొంత దూరమే వెళ్ళగలరు. ఆచార్యుడి మాటపట్ల విశ్వాసం వుంటే వందలాది మైళ్ళు వెళ్ళిపోతారు.

గురువుని మనస్సులో మననం చెయ్యాలి. ఎప్పటివరకు అలా చెయ్యాలి అంటే మీరు ఏదిగా వున్నారో అందులో స్థిరపడాలి.  మీకు దేహబుద్ధి ఎంత సహజంగా వుందో అంత సహజంగా మీకు హృదయంలో ఏదిగా వున్నారో  అందులో స్థిరపడాలి. మన క్షేమం కోరేవాడు మన మంచి కోరేవాడు గురువు. గురువు మీద గురి కుదరాలి. గురువు మన హృదయంలో ఆత్మగా వున్నాడు అవసరమైతే ఆత్మ గురురూపం ధరించి వచ్చి మనకు బోధించి సంస్కరిస్తుంది. అన్ని ప్రేమలకంటే గురుప్రేమ గొప్పది. హెచ్చుతగ్గులు లేనిది అనుగ్రహంనకు మఱొక పేరే గురువు. మనం ఏ జన్మలో వున్నా గురువు అనుగ్రహం మనల్ని వెంటాడి ఆత్మజ్ఞానంలో స్థిరపరుస్తుంది.

ఆత్మసాక్షాత్కారం పొందినవాడు మాత్రమే గురువు. ఏ గురువు ద్వారా మనం తరించవలసి ఉందో ఆ గురువు పట్ల మనకు ఆకర్షణ కలుగుతుంది. ఆయనను స్మరించుకోవటం వల్ల శాంతి లభిస్తుంది. దుఃఖం నశిస్తుంది, శరీరం మారిన ఆత్మజ్ఞానం కలిగేవరకు గురువుతో వున్న సంబంధం తెగదు. గురువే దైవం. గురువే ఆత్మ. గురువు యొక్క రూపాన్ని ధ్యానిస్తూ, నామాన్ని స్మరిస్తూ మనం నామ, రూపాలకు దూరం కావాలి.

గురువు చెప్పిన మాటలు విన్నవెంటనే ఎవరి ఇంటికి వారు వెళ్ళిపోండి. సబ్జెక్టు ప్రధానంగా జీవించండి లేకపోతే మనస్సు పలచబడటానికి బదులు చిక్కబడుతుంది. సబ్జెక్టునే ప్రధానంగా పెట్టుకుని జీవిస్తే సాధన పేరుమీద శ్రమలేకుండా ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి వస్తారు. ఒక్కరోజు సాధనకంటే ఒక్క గంట గురువు సమక్షంలో గడిపితే చైతన్య స్థాయి పెరుగుతుంది. ఆ వైబ్రేషన్స్ అటువంటివి లౌకిక విషయాలు కాకుండా యధాలాపంగా సబ్జెక్టు మాట్లాడుకున్న వివేకం, విజ్ఞానం పెరుగుతాయి.

గురువు అనుగ్రహం అనే ప్రవాహంలో బండరాళ్లలాంటి వాసనలు కొట్టుకుపోతాయి. ఇదంతా గురువు మీద విశ్వాసం వలన జరుగుతుంది. జీవనదిలా గురువు పట్ల సజీవమైన విశ్వాసం వుండాలి. అపుడు వెయ్యి జన్మలకు సరిపడా వాసనలు మీకు వున్నా ఈ శరీరం చనిపోయేలోపల తీసేస్తాడు. ఒకవేళ ఒకటీ, రెండూ వాసనలు మిగిలినా మీకు పునర్జన్మ వస్తుందని ప్రాణంపోయే సమయంలో అవికూడా తీసేస్తాడు.

గురువు అనుగ్రహం రాదు, రాదు అనుకోకండి. అనుగ్రహం వచ్చినపుడు వాడు రీజన్ చూడడు. ఆయనను పొందడానికి ఏ ఆటంకాలు వున్నాయో అవన్నీ తీసివేస్తాడు. వరదలు వస్తే మెఅక, పల్లం, ఏంటి ఆ ప్రవాహంలో అన్నీ కొట్టుకుపోతాయి. ఎపుడో చనిపోయాక ముక్తినిస్తే అది విదేహముక్తి.

మీకు నూటికి ముప్ఫైనాలుగు మార్కులు వచ్చినవారికి ఇంకొక్క మార్కు కలిపివేస్తాడు. ఆ మార్కు దయ.

సద్గురువును ఆశ్రయించకుండా మనస్సును చక్కదిద్దుకుని దాని గూటిలోకి దానిని పంపలేం.

కోటి గ్రంథాలు చదవటం కంటే లిప్తమాత్రం గురువనుగ్రహం వుంటే చాలు. నీవు అనుభవించే భోగాలు మోక్షం పొందాలనే బుద్ధిని నశింపజేస్తాయి. నీ కళ్ళకు మైకం కప్పుతాయి. అవి నీ గతిని నిరోధిస్తాయి. నీ కళ్ళకు కట్టిన మైకపు పొరలను కత్తిరిస్తాడు. నిన్ను పరిపక్వంచేసి నీకు అర్హతను యోగ్యతను పట్టియిస్తాడు వాడు గురువు. గురువు యొక్క ప్రేమలో అనుగ్రహంలో మునిగి తేలుతుంటే ఆ ప్రేమలో ఉక్కిరిబిక్కిరి అవుతుంటే అహంకారం, మమకారాలు నశించి ఆ జ్ఞానం ఉదయిస్తుంది. గురువు మీద ఆపుకోలేని, ఊపిరిసలపని ప్రేమ కలిగింది అనుకోండి మన అహంకారాలు, మమకారాలు అజ్ఞానం నదీ ప్రవాహంలో గడ్డిపఱకలాగ కొట్టుకుపోతాయి.

ఆ భగవదనుభవం పొందాక తెలుస్తుంది గురువు ఎక్కడో బయట వున్నాడు అనుకున్నాను ఇంతకాలం నుంచి నా గురువు లోపలే వుండి నాకు గైడెన్సు ఇస్తూ నా స్వరూపాన్ని వ్యక్తపరిచాడు. ఆ లోపల చావులేని వస్తువు తెలిసాక నీకు తెలుస్తుంది.

గురువు అనుగ్రహం వల్ల మహర్షివి అయ్యిపోతావు. మహాత్ముడివి అయ్యిపోతావు. గురువు ఏ స్థాయిలో వున్నాడో ఆ స్థాయికి నమ్మినవాడిని తీసుకువస్తాడు వాడే గురువు.

మనకి విషయాలమీద ఉన్న అనురాగం ఈశ్వరుని మీద ఉంటేచాలు. ఈశ్వరుడు మన కోసం రూపం ధరించి వస్తాడు. వచ్చి ఆ సత్యంవైపుకి తోలుకు వెళ్ళటం కోసం నీతోటి మాట్లాడుతూనే, నీ వంక చూస్తూనే నీతోటి నడుస్తూనే నిన్ను ఆత్మగుహలోకి గెంటుకుంటు పోతాడు గురువు.

మీ మనస్సును వీక్‌గా వుంచడు స్ట్రాంగ్ చేస్తాడు. అంటే గాలిలేనిచోట దీపం ఎంత స్టడీగా, ఎంత కుదురుగా వుంటుందో మీ మనస్సుకి తన కంపెనీఇచ్చి ఆ స్థితికి మోసుకుపోతాడు. అంటే ప్రకృతికి సంబంధించిన విషయాలుగాని ప్రారబ్ధానికి సంబంధించిన విషయాలకు గాని, నీ మనస్సు లొంగదు, కృంగదు, చెదరదు. ఆ స్థాయికి నీ మనస్సును తీసుకుపోతాడు. నీతో మాట్లాడటం కోసం మాట్లాడడు. తన కంపెనీని నీకు ఇచ్చి సుధీర దూరాలలోకి ఎక్కడైతే నీ మనస్సు పుట్టుక స్థానం వుందో, ఎక్కడనుంచి ప్రవహించి వస్తుందో, ఆ మూలంలోకి పంపటంకోసం చూపుద్వారా, మాట ద్వారా, పటిష్టంచేసి నీకు తెలియకుండా నీ హృదయంలోకి తోలుకుపోతాడు. ఏది నిజమో నీకు తెలియకపోయినా నీ గురువుకి తెలుస్తుంది. నీకు చూడటం అలవాటుకనుక, గురువు కళ్ళు వేసుకుని మాటలు అలవాటు కనుక నోరు వేసుకుని వచ్చాడు. నీ దేహానికి చావువుంది. నీ లోపల స్పిరిట్‌కి చావులేదు ఆ స్పిరిట్ మీద నీ విశ్వాసం పోగొట్టుకోవద్దు. విశ్వాసం కాలిపోకుండా, రాలిపోకుండా చూచుకో. శరీరం చనిపోతుంది. చావులేని వస్తువు నీలోపలే వుంది. అది నీ శరీరంలో ఒక భాగంకాదు. అంతా నీ హృదయంలోనుండే వస్తోంది. ఆ హృదయంలోనే నీవున్నావు. మొత్తం క్రియేషన్ అంతా ఏ హృదయంలోంచి మొదలవుతుందో, ఏ హృదయం అయితే ఆధారంగావుందో అది నీవైవున్నావు. మీ గురువుని ధ్యానం చేయగా, చేయగా నిద్రపోతున్న మీ వివేకానికి మేలుకొలుపు వచ్చి బయట గురువు లోపలేవున్నాడని మీకు స్ఫురిస్తుంది.

గురువు నీ బాధను, ఆయన బాధగా గుర్తించి మీరు కన్నీరు పెట్టుకుంటే, ఆయన కన్నీరు పెట్టుకుంటాడు. మీరు సంతోషంగా వుంటే ఆయన సంతోషంగా వుంటాడు. నిన్ను అలాచెయ్యి, ఇలా చెయ్యి అని చెప్పడు. ఏది మంచిదో అది నీ చేత చేయించుకుంటూపోతాడు. రామకృష్ణ పరమహంసకి చివరి రోజుల్లో లాటు అనే శిష్యుడు సేవ చేస్తాడు. ఒక గంటకి రామకృష్ణులు దేహం వదిలేస్తారు అనగా లాటుతో నువ్వు నా శరీరానికి చేసి సేవ చూస్తుంటే నాకు చనిపోవాలనిలేదు ఉండాలనే వుంది ప్రారబ్ధం ప్రకారం దేహానికి సమయం వచ్చేసింది,కాని కొంత కాలం ఈ క్యాన్సరుతో పోరాడాలని అనిపిస్తుంది. నువ్వు చేస్తున్న సేవ చూస్తుంటే నిన్ను కొంతకాలం నా కళ్ళతో చూచుకోవాలని వుంది. నీ సేవ చూస్తుంటే శరీరం వదిలి వెళ్ళాలని లేదు, క్యాన్సరు వుంటే వుండనియ్యి నీ సేవ ముందు ఈ క్యాన్సరు బాధకూడా మర్చిపోయాను అని అన్నారు రామకృష్ణులు. లాటు అన్నాడు సాధన చేసి నేను పవిత్రుడ్ని అవ్వలేదు, గురువుకి సేవచేసి పవిత్రుడ్ని అయ్యాను, దాని వల్ల ఔన్నత్యం ఉన్నతత్త్వం వచ్చింది. చదువు లేదు, సేవ వల్ల గురువులో ఐక్యం అయ్యిపోయాడు. అప్పుడు రామకృష్ణులు వాడికి ఒక వరం ఇచ్చాడు. ఒక వేళ నువ్వు 90సార్లు ఈ భూమి మీదకి వచ్చినా మాయే పారిపోవాలి కాని నిన్ను ముట్టుకోకూడదు అనే వరం ఇస్తున్నాను అన్నారు. ఒక భక్తుడు భగవాన్‌ని మీ దేహం పోయిన తరువాత మా పట్ల ఆప్యాయత, కరుణ ఎవరు చూపిస్తారు అన్నాడు. దానికి భగవాన్ :- ఈ శరీరం ఉన్నప్పుడు కూడా ఈ శరీరం అనుగ్రహించేదికాదు. గురువు శరీరం మాయం అయ్యిపోయినా అనుబంధం కంనిట్యూ అవుతుంది. గురువు దయ వచ్చి నీ మీద వర్షంలా కురుస్తుంది. మీరు ఉక్కిరిబిక్కిరి అయ్యిపోతారు మీకు ఊపిరి సలపదు. అపుడు మహావిష్ణువు వచ్చి మీ ప్రక్కన కూర్చున్నా కళ్ళుతెరిచి చూడాలనిపించదు. మీరు అనుభవిస్తున్న శాంతిలో మహావిష్ణువు ఒక బుడగ.

గురువు యొక్క నామం, రూపం వుంది. ఆయన చెప్పిన మాటలు కనిపిస్తున్నాయి. నీవు బయటవున్న గురువు రూపం ద్వారా లోపల వున్న భగవంతుని దగ్గరకు జంప్‌చెయ్యి. నీ హృదయంలో ఒకడు వున్నాడని నిర్ధారణకి వస్తే సహాయం అంతా వాడి దగ్గర్నుంచే వచ్చేస్తుంది. గురువు ఆ వున్నదానిని స్ఫురణకి తీసుకువస్తున్నాడుకదా! అది నీవు పట్టించుకోవటంలేదు. లోపల్నించి ఎందుకు స్ఫురిస్తున్నాడంటే నిర్ధారణకు వస్తావని. భగవంతుడు రూపం ధరించి గురువుగా వచ్చాడుకదా! అందులోకి జంప్ చెయ్యడానికి ఆ దేహాన్ని ఉపయోగించుకోవాలని తెలియటంలేదా! గురువు ముఖద్వారం ద్వారా హృదయంలోవున్న భగవంతుని దగ్గరికి వెళ్ళిపోతావని చెబుతున్నాడు. గురువు సమక్షంలో కూర్చున్నప్పుడు ఏదో వుందని నిర్ధారణకి రావాలి. అదే మనమని గురువు చెబుతున్నాడు. మిగతాదేదీ మనం కాదని చెబుతున్నాడు.

వైరాగ్యం వస్తే జీవుడు వుండలేడు. జీవ లక్షణాలు వుండలేవు. జీవుల మధ్య నీవుండలేవు. నీకు చావు ఎప్పటికైనా తప్పదు. నీ అహంకారంతో చస్తావా లేకపోతే గురువు చేతిలో అహంకారాన్ని చంపుకుంటావా దేహం వుండగానే నీ అహంకారానికి మరణం తీసుకువస్తాను అంటున్నాడు గురువు. అంటే జీవునికి మరణం తీసుకువస్తాడు.

నీకు ఆనందం వస్తుంది. గురువుకి ఆనందం వస్తుంది. నీకు వచ్చే ఆనందంలో ఇతరులు వుంటారు కాని గురువుకి వచ్చే ఆనందంలో ఇతరులు ఉండరు నీ ఆనందం గురువు ఆనందం ఒక్కటే అనుకుంటున్నావు. ఇతరులు లేని ఆనందంలోకి నిన్ను జంప్ చేయిస్తాడు. వాడే గురువు. ఇతరులు లేని ఆనందంలోనికి గురుముఖంద్వారానే జంప్ చెయ్యాలి. గురువు సమక్షంలో అశ్రద్ధ, సోమరితనం పనికిరావు. గురువు సమక్షంలో ఏదోచెయ్యటం వల్ల

రావడంలేదు. అది మనస్సుకి సంబంధించినది కాదు. నీ హృదయంలోకి ఎలా వెళ్ళాలో నేర్పేవాడే గురువు. అదేనీవని అనుభవానికి తీసుకువస్తాడు వాడి చేతికి నీవు దొరికితే నీ అహంకారానికి మరణం తీసుకువస్తాడు. నీ ఉపాధి ద్వారా పనిచేసేది భగవంతుడే. నీ తలంపులో, నీ మాటలతో సంబంధంలేకుండా నీ ఉపాధి ద్వారా పనిచేసుకుంటున్నాను అంటున్నాడు గురువు.

గురువే వున్నాడు నేను లేను అని నిర్ధారణకి వస్తే గురువుకోసం బెంగపెట్టుకోవటం, ఏడవటం వుంటుంది. రాధ ఎందుకు ఏడ్చింది? కృష్ణుడు ఉన్నాడని నిర్ధారణకి వచ్చింది కాబట్టి ఏడ్చింది. నీవు ఆయనలేడు అన్నప్పుడుకూడా అవి ఏం పట్టించుకోకుండా నీవు ఏడవలేకపోయినా నిన్ను 100% ఆయనలో కలపివేసుకొందామని ఆయన ఉద్దేశ్యం. నీకు మంచి తలంపులు, మంచి భావాలు ఇస్తాను. ప్రతీ నిమిషం నేను నిన్ను చూచుకుంటాను. గురువు మాట శ్రవణం చేశాక, మననం చేస్తే 1000రెట్లు బాగువచ్చేస్తుంది. నిన్ను ఏ రూపంలో బాగుచేసుకుంటున్నానో నీకు ఏమి తెలుసు. నేను నీకు జ్ఞాపకంరావాలి అనుకుంటే జ్ఞాపకం వస్తాను. నా జ్ఞాపకంలో నువ్వుంటే నీవు బాగుపడిపోతావు. జరగవలసినదంతా నా సమక్షంలో జరిపించి పంపివేస్తాను. నేనే అంతర్యామిగా వున్నానని గుర్తింపు రావడానికి నీ తలంపు నీకు పట్టియిస్తున్నాను. నేనే అంతర్యామిని అనే నిర్ధారణకు ముందు నువ్వురా. వున్నది నేనే అయితే నా సంకల్పమే జరిగేది.

నా ఇష్టాన్ని నీ యిష్టంగా మార్చుకుంటే నీవు జపం, ధ్యానం ఏమీ చెయ్యక్కర్లేదు. నా స్వరూపాన్ని నీకు ఇచ్చివేస్తానని గుండెలమీద చెయ్యివేసుకుని నీకు మాట ఇస్తున్నాను. నీకు వికారాలుగా వుండటం

ఇష్టం. నాకు వికారాలు లేకుండా వుండటం ఇష్టం. నీ ఇష్టాన్ని నా కోసం వదిలేసి అది నీకు కష్టమైన నా కోసం నా ఇష్టాన్ని నీ ఇష్టంగా చేసుకున్నావని నా స్వరూపాన్ని నీకు ఇస్తానని 100% హామీ ఇస్తున్నాను.

గురువుకి ఈ సృష్టిలో ఎంజాయ్‌మెంట్ అంటూఏమీ లేదు. శిష్యుని ప్రవర్తన చూచి సంతోషిస్తాడు. అది ఒక్కటే ఆయనకు ఎంజాయ్‌మెంట్. నాకు శరణాగతి చెయ్యడానికి నీకు అభ్యంతరం ఏంటి? నువ్వే ఉన్నావని నమ్మితేచాలు పని అంతా పూర్తిఅయ్యిపోతుంది.

గురువు చెప్పిన వాక్యాన్ని మనం దృష్టిలో పెట్టుకోవాలి. ఎంచేతంటే గురువు మాట దేవుడైవుంది. అంటే వారి హృదయంలో వున్నదే వారు మాట్లాడతారు. మనకి ఏది మంచిదో ఆయనకి తెలుసు. గురువు యొక్క వాక్యంలో పెనవేసుకుంటే దాని తాదాప్యం వస్తుంది. గురువుయందు విశ్వాసం వుండాలి మాటను పాటించే బుద్ధివుండాలి. గురువు నీకు మంచి విషయాలు చెబుతుంటే వాటిని గాలికి వదిలివేయకుండా మీ హృదయంలోకి తీసుకుని వాటి ప్రకారం జీవించడమే గురువును గౌరవించటం. గురువు హృదయంలోనుంచి వచ్చిన నోబుల్‌థాట్స్, నోబుల్ యాక్షన్స్, నోబుల్ వరడ్స్‌ను వృధాచేయకుండా లోభివాడు తన ధనాన్ని ఎంత జాగ్రత్తగా పెట్టుకుంటాడో అలాగే గురువు చెప్పిన మంచి మాటలను అంత జాగ్రత్తగా హృదయపూర్వకంముగా స్వీకరించి వాటిని ప్రాక్టీసు చెయ్యాలి. అపుడు మీరు గురువుకి సమీపంలో ఉన్నట్లులెక్క. గురువు రూపాన్ని నామాన్ని గురువు టీచింగ్‌ని గురువు జీవితాన్ని నీ హృదయంలో కాపాడుకోవాలి. ఎందుచేతనంటే దేవునికంటే గురువు ఎక్కువ. ఈశ్వరుడు నీకు ప్రారబ్ధం కొట్టే దెబ్బలు కొడతాడు ప్రారబ్ధం ద్వారా నీకు ఏమైనా మొట్టికాయలు తినవలసివుంటే ఆ మొట్టికాయలు పడిపోతాయి. మొట్టికాయలు నీకు

పడ్డా దాని తాలూకు బాధ ఏమాత్రంలేకుండా నీకు ధైర్యాన్నిచ్చి, జ్ఞానాన్ని ప్రసాదించేవాడు గురువు. నీ ప్రారబ్ధాన్ని బట్టి దేవుడు ఏమి చేస్తున్నా దాని తాలూకు ప్రభావం నీ బ్రెయిన్‌మీద పడకుండా చేయగలిగేవాడు గురువు మాత్రమే. గాలివాన వచ్చినపుడు గాలి ఎంత వేగంగా వుంటుందో నీ ప్రారబ్ధం యొక్క వేగం అలా వున్నప్పటికీ దానిని తట్టుకునే శక్తిని ప్రసాదించేవాడు గురువు. ఈశ్వరుడు ఎడ్మినిస్టేటర్ అంటే తల్లి గర్భంలోంచి బయటకు వచ్చింది మొదలు మరల స్మశానంలోకి వెళ్ళేవరకు విధిప్రకారం నీ దేహాన్ని నడుపుతాడు, కాని గురువు అలాకాదు. ప్రారబ్ధం ప్రకారం కష్టాలు, హింస వస్తునప్పటికీ దాని యొక్క ప్రభావం నీ మనస్సుమీద పడకుండా మిమ్మల్ని స్వీటుగా, హేపీగా వుంచుతాడు. అవసరమైతే మీ ప్రారబ్ధాలు తీసుకునేవాడు గురువే. నీ దగ్గర ఇంకా ఏమైనా కష్టాలు అదనంగా వుంటే పంపు మా భక్తులు ఎదుర్కోవడానికి సిద్ధంగా వున్నారు అని ఈశ్వరుడికే  సవాలు విసిరేవాడు గురువు. శిక్షించేవాడు ఈశ్వరుడు రక్షించేవాడు  గురువు.

మీ జీవితాన్ని గురువుకి అంకితంచెయ్యి. గురువు ఏ వాక్యం అయితే చెప్పాడో వాటిని మీ సొంతం చేసుకోవాలి. నువ్వు గురువు పట్ల కృతజ్ఞతకలిగియుండాలి. విశ్వాసం, ప్రేమ కలిగియుండాలి. శరీరాలు ఎక్కడ వున్నాయన్నది ముఖ్యంకాదు. నీ మనస్సు గురువు సమీపంలో ఉండాలి. గురువు సమీపంలో వుంటే నెమ్మదిగా పవిత్రం అయ్యిపోతుంది. నువ్వు ఏమితింటున్నావు, నువ్వు ఎక్కడవున్నావు అనేది ముఖ్యంకాదు, నువ్వు అమెరికాలో వున్నా నీ తలంపును చూస్తుంటాడు. నీ తలంపులో ఏదైనా దోషం వుంటే సరిచేస్తాడు. మట్టిలా వున్న మనల్ని బంగారంలాగ మార్చేవాడు గురువు. పూర్ణస్థితిని పొందే వరకు మనల్ని విడిచిపెట్టడు.

కొంతమంది గురువులు ఎటువంటి వారంటే మీరు జపం, ధ్యానం చెయ్యనక్కర్లేదు వారు చెప్పింది శ్రవణంచేస్తే చాలు మనకి జ్ఞానం వస్తుంది. అలా రాని పద్ధతిలో మీరు ఇంటికి వెళ్ళిన తర్వాత గురువు చెప్పింది మీ మనస్సులో మననం చెయ్యాలి. ఎప్పటివరకు అలా చెయ్యాలి అంటే మీరు ఏదిగావున్నారో అందులో స్థిరపడేవరకు అన్ని ప్రేమలకంటే గురుప్రేమ గొప్పది. హెచ్చుతగ్గులు లేనిది.

ఆత్మసాక్షాత్కారం పొందినవాడు మాత్రమే గురువు. ఏ గురువు ద్వారా మనం తరించవలసివుందో ఆ గురువుపట్ల ఆకర్షణ కలుగుతుంది. ఆయనను స్మరించటం వల్ల శాంతి లభిస్తుంది. దుఃఖం నశిస్తుంది. గురువే దైవం గురువే ఆత్మ, గురువు యొక్క రూపాన్ని ధ్యానిస్తూ నామాన్ని స్మరిస్తూ మన నామ రూపాలకు దూరంకావాలి.

గురువు చెప్పిన మాటలు విన్న వెంటనే ఎవరింటికి వారు వెళ్ళిపోండి. సబ్జెక్టు ప్రధానంగా జీవించండి లేకపోతే మనస్సు పల్చబడటానికి బదులు చిక్కబడుతుంది. సబ్జెక్టునే ప్రధానంగా పెట్టుకుని జీవిస్తే సాధన పేరు మీద శ్రమలేకుండా ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తారు. ఒకరోజు సాధనకంటే 1గంట గురు సమక్షంలో గడిపితే చైతన్యస్థాయి పెరుగుతుంది. ఆ వైబ్రేషన్స్ అటువంటివి. లౌకిక విషయాలు కాకుండా యధాపలంగా సబ్జెక్టు మాట్లాడుకున్న వివేకం, విజ్ఞానం పెరుగుతాయి. జీవనదిలా గురువు పట్ల సజీవమైన విశ్వాసం ఉండాలి. అప్పుడు వెయ్యి జన్మలకి సరిపడా వాసనలు మీకు వున్న ఈ శరీరం చనిపోయేలోపల తీసేస్తాడు. ఒకవేళ ఒకటీ, రెండు వాసనలు మిగిలినా మీకు పునర్జన్మ వస్తుందని ప్రాణంపోయే సమయంలో అవికూడా తీసివేస్తాడు. గురువనుగ్రహం రాదురాదు అనుకోకండి అనుగ్రహం

వచ్చినప్పుడు  రీజన్ చూడడు. ఆయనను పొందడానికి ఏ ఆటంకాలూ వున్నాయో అవన్నీ తీసివేస్తాడు. వరదలు వస్తే మెరక, పల్లం ఏంటి. ఆ ప్రవాహంలో అన్నీ కొట్టుకుపోతాయి.

మీకు 100కి 34 మార్కులు వచ్చినవారికి ఇంకొక్కటి మార్కు కలిపివేస్తాడు ఆ మార్కు దయ.

కోటి గ్రంథాలు చదవటంకంటే లిప్తమాత్రం గురువనుగ్రహించాలు. గురువు యొక్క ప్రేమలో, గురువు యొక్క అనుగ్రహంలో మునిగి, తేలుతుంటే ఆ ప్రేమలో ఉక్కిరిబిక్కిరి అవుతుంటే అహంకారాలు, మమకారం నశించి జ్ఞానం ఉదయిస్తుంది. గురువు మీద ఆపుకోలేని ఊపిరి సలపని ప్రేమ కలిగిందనుకోండి మన అహంకారాలు, మమకారాలు అజ్ఞానం నదీ ప్రవాహంలో గడ్డిపరకలాగ కొట్టుకుంటూ పోతాయి. ఆ భగవదనుభవం పొందాక తెలుస్తుంది ఇంతకాలం గురువు ఎక్కడో బయట వున్నాడనుకున్నాను. నా గురువు లోపలేవున్నాడు నాకు గైడెన్సు ఇస్తూ నా స్వరూపాన్ని వ్యక్తపరిచాడు అని ఆలోపల చావులేని వస్తువు తెలిసాక మీకు తెలుస్తుంది. నీవు అందరి హృదయాలలోని అంతర్యామిని చూడలేకపోతే నీవు గురువుని 'మిస్' అయినట్టే అంతర్యామిని చూడగలిగితే దేహదృష్టి భయము పోతుంది. నీకు దుఃఖం వస్తుంది అంటే ఎక్కడో ఒక చోట బంధం వుందని అర్థం. నీవు బయటనామరూపాలని చూసి లోపల అంతర్యామిని చూడలేకపోతే గురువుని మిస్ అయినట్టే. మనం ఇలా వున్నాం అంటే మన సాధనలవలన, మన తెలివి వలన కాదు. గురువు అనుగ్రహం వలన ఇలా వున్నాం. నీ దేహ ప్రారబ్ధంలో ఎప్పుడూ ఏది జరగాలో అప్పుడు అలా జరుగుతూవుంటుంది చనిపోయేవరకు. కాని నీకు గురువు అనుగ్రహం ఉంటే నిన్ను ప్రారబ్ధంలోంచి ఎలా దాటిస్తాడంటే

దానికి ఉదాహరణ :- అర్జునుడికి కర్ణుడికి యుద్ధం జరుగుతూవుంటుంది. కర్ణుడు అస్త్రం విడిచిపెట్టాడు అర్జునుడిమీదకు అంటే ఆ అస్త్రం ఎవరి మీద విడిచిపెడతారో వాళ్ళు చనిపోవాలి. అక్కడ రథం తోలేవాడు భగవంతుడు. అస్త్రం అర్జునుని దగ్గరకు వచ్చింది అది దగ్గరికి వచ్చాక కృష్ణుడు ఏమిచేసాడంటే రథాన్ని క్రిందకి త్రొక్కాడు. అది అర్జునుని కిరీటం పట్టుకుపోయింది. అలాగే నీకు గనుక గురువు అనుగ్రహం వుంటే నీ నెత్తిమీద చెడ్డ కర్మవుంటే పెద్దగా అనుభవింపచేసేది చిన్నగా అనుభవింపచేస్తాడు. వాడు గురువు.

భగవాన్ ఏమి చెప్పారంటే మీరు సాధ్యమైనంత వరకు హోలీ కంపెనీలో వుండండి. మనం ఎలా వున్నాం అంటే భగవంతునికి దూరంగా ప్రపంచానికి దగ్గరగా వున్నాం. భగవంతునికి దగ్గరగా వుండాలంటే సత్పురుషుల సహవాసం అవసరం. మనలో బలహీనతలు సంస్కారాలు వుంటాయి. శరీరం కాలిపోయినా అవి కాలవు. సజ్జన సాంగత్యంతోనే ఇవి నశిస్తాయి. కాలి బూడిద అవుతాయి. యోగులతో మాహాత్ములతో మానసిక అనుబంధం వున్నా సరిపోతుంది. సజ్జన సాంగత్యం వలన భౌతికంగా వచ్చే లాభాలకంటే మీరు జీవన ముక్తులవుతారు. జీవన్ముక్తులంటే శరీరం వుండగానే తనువుతాను కాదని దేహమాత్రుడిని నేను కాదని నాకు దేహం వుందికాని నేను దాహాన్ని కాదు అని దేహబుద్ధి నశించి ఆత్మబుద్ధికలుగుతుంది. శరీరం చనిపోయేరోజుకి నూటికి నూరు పాళ్ళు సహజంగా శాంతిగా, స్వతంత్రంగా, సుఖంగా వుండగలిగితే నీకు పునర్జన్మ లేదు. నీవు శవాలని మోయక్కర్లేదు.

కబీరు గురువు గురించి శిష్యుడి గురించి ఒక మంచి మాట చెప్పాడు. గురువు అంటే కుమ్మరి. శిష్యుడు అంటే కుండ. కుమ్మరివాడు

మట్టిని కుండగా తయారుచెయ్యడానికి లోపలనుంచి దెబ్బలు కొడతాడు. బయటనుంచి దెబ్బలు కొడుతూవుంటాడు. ఎన్నో దెబ్బలు కొట్టికొట్టి దానికి కూడా ఒక ఆకారం తీసుకువస్తాడు. అలాగే గురువుకూడా బయటనుంచి కొట్టవలసినదెబ్బలు బయటనుండి లోపల నుండి కొట్టవలసిన దెబ్బలు లోపలనుండి కొడతాడు. అంటే లోపలివి బయటకి తోలడానికి ఆ తోలేటప్పుడు కొంచెం నొప్పి వుంటుంది ఆ బలహీనత మీలోవున్నట్టు తెలియపరచి బయటకు లాగుతాడు. అలాగ మీకు ట్రైనింగు ఇస్తాడు.

గురువు ఏ స్టేటులో వున్నాడో ఆ స్టేటులోకి మిమ్మల్ని తీసుకు రావడానికి బయటనుండి కొన్ని అవమానాలు రావొచ్చు. లోపల వున్న బలహీనతలు బయటకుతోలేయడానికి పరిస్థితులు తీసుకువస్తాడు. ఒక్కొసారి మనలని ఏ తలుపు సందులోనో పెట్టేసి నొక్కేస్తున్నాడు గురువు అనిపిస్తుంది. కొన్ని ట్రబుల్సు, కొన్ని వ్యతిరేక పరిస్థితులు వస్తుంటాయి. అప్పుడు నిరుత్సాహపడతాము. వీడు గురువేనా అనేటటువంటి అనుమానం వస్తుంది. మనకి గురువు అనుగ్రహంలేదేమో ఇన్ని కష్టాలు పడుతున్నాం అనిపిస్తుంది. మనకి ఏద్దైనా మంచి జరిగితే గురువు అనుగ్రహం వుందని మంచి జరగకపోతే గురువు అనుగ్రహం లేదు అని అనుకుంటే అసలు మనం భక్తులమే కాదు.

వేదాలు ఉపనిషత్తులు, గురువులు, మహాత్ములు, మహాఋషులు వీళ్ళందరూ ఈ దేహం నీవు కాదని ఎంత బలంగా చెబుతున్నారో అంత బలంగా దేహం నేను అనుకుంటున్నాం వాళ్ళు అసత్యం చెప్పటంలేదు. సత్యమే చెబుతున్నారు. దేహం నేను అనుకోవటం మాయ యొక్క వేగము నీకు దేహభావన వున్నప్పుడు నీ హృదయంలో ఏది వుందో దేహభావన పోయినప్పుడు అదేవుంది. అయితే గురువు చేసేది ఏమిటంటే ఏదోనీకు

ఇవ్వటం కాదు. నీ హృదయంలోవున్నదే సహజంగా నీ చేతికి అందిస్తాడు. గురువు చేసే సహాయసహకారములు అవి. గురువు చేసే ముఖ్యమైనపని ఏమిటంటే మిమ్మలని దుఃఖరహిత స్థితికి తీసుకువెళ్ళటమే నిజమైన గురువు నీకు ఎట్టి పరిస్థితిలోనూ దుఃఖం రాకూడదని కోరుకుంటాడు. వాళ్లు నీకు మాటలు చెప్పినా, నిన్ను అనుగ్రహించినా దుఃఖస్పర్శలేని స్థితికి నిన్ను తీసుకుపోవాలని.

నువ్వు ప్రయత్నం చేసినా చెయ్యకపోయినా నీ కళ్ళు మూసుకున్నా, కళ్ళు తెరిచివున్నా గురువు సమక్షంలో ఈ భక్తుడికి జ్ఞానానుభవం, సుఖానుభవం, ఆనందానుభవం, స్వరూపజ్ఞానం వాడి ప్రయత్నంలేకుండా జరుగుతాయి.

సద్గురువు సమక్షంలో ఒక్కనిముషం కూర్చుంటే వంద సంవత్సరాలు తపస్సు చేసినంత ఫలితం వస్తుంది.

